


ఈ సంచికతోపాటు 12 పేజీల **సక్సెస్** సప్లిమెంట్ అందుకోండి



ప్రభాత
# వెలుగు
26.01.2019
www.v6velugu.com
శనివారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 340 పేజీలు: 12+12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
**గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు**

**112** మందికి పద్మ అవార్డులు

నలుగురికి పద్మ విభూషణ్

**14** మందికి పద్మభూషణ్

**94** మందికి పద్మశ్రీ

మార్చి, ఏప్రిల్‌లో అవార్డుల ప్రదానం



# భారత రత్నాలు



**ఒకరు రాజకీయ చాణక్యుడు..**
**మరొకరు పాటల మాంత్రికుడు..**
**ఇంకొకరు సంఘ్ సేవకుడు..**

దేశ అత్యున్నత పురస్కారం ఆ ముగ్గురినీ వరించింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, అస్సామీ గాయకుడు భూపేన్ హజారికా, భారతీయ జన సంఘ్ నేత నానాజీ దేశ్‌ముఖ్‌కు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న'ను ప్రకటించింది. భూపేన్, నానాజీలకు మరణానంతరం ఈ అవార్డు దక్కింది. దేశానికి వారు చేసిన సేవలు ఎనలేనివని కేంద్రం కొనియాడింది. 2012 నుంచి 2017 వరకు రాష్ట్రపతిగా ప్రణబ్ చేసిన సేవలను గుర్తుచేసుకుంది. భూపేన్ కళావైభవాన్ని, నానాజీ కార్యదీక్షను ప్రత్యేకంగా ప్రస్తావించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత రత్నతోపాటు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులను కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

వివరాలు 2,3లో

## ప్రణబ్, భూపేన్, నానాజీకి దేశ అత్యున్నత పురస్కారం

### పద్మ విభూషణ్



తీజన్ బాయి | ఇస్మాయిల్ | అనిల్‌కుమార్ | బల్వంత్

### పద్మ భూషణ్



మోహన్‌లాల్ | కుల్దీప్ నయ్యర్ | బచేంద్రీపాల్ | కరియ ముండా

### పద్మశ్రీ

**తెలంగాణ నుంచి..**



సునీల్ ఛెత్రి | సిరివెన్నెల

విదేశీ కోటాలో హైదరాబాద్ వాసి శాంతను నారాయణ్.. ఏపీ నుంచి ద్రోణవల్లి హారిక, వెంకటేశ్వరరావు

**పద్మశ్రీ గ్రహీతల్లో కొందరు..**

మాజీ క్రికెటర్ గౌతం గంభీర్, సినీ రంగ ప్రముఖులు ఖాదర్ ఖాన్, ప్రభుదేవా, శంకర్ మహదేవన్, శివమణి, మనోజ్ బాజ్‌పాయ్

## పాలమూరుకు లైన్‌క్లియర్

పాలమూరు ఎత్తిపోతల పథకానికి అటవీ భూముల కేటాయింపుపై తుది అనుమతులిచ్చిన కేంద్రం.

04

**వెన్‌కాబ్**
(ఫారం గేట్ ధర)

| హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ |
|---|---|---|
| 79.00 | 79.00 | 79.00 |
| **కరీంనగర్** | **నిజామాబాద్** | **ఖమ్మం** |
| 80.00 | 79.00 | 78.00 |

# మళ్లీ కారుదే హవా

రెండో దశ పంచాయతీల్లో ఆధిక్యం చూపిన టీఆర్ఎస్ మద్దతుదారులు

4,118 పంచాయతీల్లో 2,633 సీట్లు వారికే – 88.85 శాతం పోలింగ్ నమోదు

అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 93.71%, అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 80.23% ఓటింగ్

**వెలుగు నెట్‌వర్క్:**
గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతలోనూ టీఆర్ఎస్ మద్దతుదారుల హవా కొనసాగింది. మూడింట రెండొంతులకుపైగా గులాబీ పార్టీ బలపర్చినవారే గెలుపొందారు. రెండో దశలో మొత్తం 4,130 పంచాయతీలకుగాను 788 చోట్ల ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్లు దాఖలు గాకపోవడం, ఇతర కారణాలతో 12 చోట్ల ఎన్నిక జరగలేదు. మిగతా 3,330 పంచాయతీల్లో శుక్రవారం పోలింగ్ జరిగింది. మొత్తంగా రెండో దశలో ఏకగ్రీవాలు కలిపి 4,118 పంచాయతీలకుగాను టీఆర్ఎస్ మద్దతుదారులు 2,633, కాంగ్రెస్ బలపర్చినవారు 832, ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి 653 చోట్ల విజయం సాధించారు. రెండు దశల్లో కలిపి ఐదున్నర వేలకుపైగా పంచాయతీల్లో టీఆర్ఎస్ బలపర్చినవారే గెలుపొందారు. కాంగ్రెస్ మద్దతుదారులు సుమారు 1,800 చోట్ల గెలవగా, ఇతరులు స్వతంత్రులు 1,200 పంచాయతీల్లో విజయం సాధించారు.

**ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే..**
ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 482 పంచాయతీలకు టీఆర్ఎస్ మద్దతుదారులు 230, కాంగ్రెస్ 106, ఇతరులు 146 స్థానాల్లో విజయం సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన ఎన్నికల్లో 343 సీట్లకుగాను టీఆర్ఎస్

మిగతా 4లో



06

**పూర్ణాహుతితో పరిసమాప్తం**

ఎర్రవల్లి వ్యవసాయ క్షేతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన సహస్ర మహా చండీయాగం పూర్ణాహుతితో ముగిసింది. చివరి రోజు శుక్రవారం కేసీఆర్ దంపతులు, కుటుంబ సభ్యులు ఎనిమిది మంటపాలకు వెళ్లి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. యాగం పూర్తయిన తర్వాత రుత్వికులను ఘనంగా సన్మానించారు.



# 10 శాతం కోటా భేష్



ఓటు విలువ గుర్తిద్దాం
వచ్చే ఎన్నికల్లో తప్పక ఓటేద్దాం
అందరి భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి
అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు
రిపబ్లిక్ డే సందేశంలో రాష్ట్రపతి

03

## జాబులిస్తామంటూ... జేబులు గుల్ల

**విదేశాల్లో ఉద్యోగాల పేరిట విజ్డమ్ జాబ్స్ పోర్టల్ మోసం**



రెజ్యూమె ఫార్వర్డ్, ఇతర సర్వీసుల కోసమంటూ వసూళ్లు
పెద్ద కంపెనీల పేరిట ఫోన్‌లోనే నకిలీ ఇంటర్వ్యూలు..
ఒక్కొక్కరికి రూ. 10 వేల నుంచి లక్ష వరకు టోకరా
తొమ్మిది దేశాల్లో లక్ష మంది వరకు బాధితులు
రూ.70 కోట్ల దందాను బయటపెట్టిన పోలీసులు
ప్రధాన నిందితుడు ఏపీకి చెందిన అజయ్ కొల్లా

04

# ఇప్పటిదాకా 48 మందికి..

**భారతరత్న..** దేశ అత్యున్నత పౌర పురస్కారం. 1954 జనవరి 2న ఈ అవార్డులను తొలిసారి ప్రకటించారు. కుల, మత, జాతి, హోదా, లింగ భేదాలేవీ లేకుండా అవార్డులను ప్రకటిస్తారు. నిజానికి మొదట్లో కళలు, సాహిత్యం, సైన్స్, పబ్లిక్ సర్వీసెస్‌లో సేవలు చేసిన ప్రముఖులకు మాత్రమే ఇచ్చేవాళ్లు. కానీ, ఆ నిబంధనను 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం మార్చేసింది. అది ఏ రంగమైనా సరే.. జనానికి సేవ చేసే వ్యక్తులకు ఇవ్వాలని నిర్ణయిస్తూ అన్ని రంగాలకూ భారతరత్నను విస్తరించింది. భారతరత్న ఎవరికివ్వాలన్నది మాత్రం దేశ ప్రధానికే అధికారం ఉంటుంది. రాష్ట్రపతికి ప్రధానే పేర్లను నామినేట్ చేస్తారు. సొంత దేశస్థులకే ఇవ్వాలన్న నిబంధన లేదు. కాబట్టి విదేశీయులకూ ఆ అవార్డును అందించొచ్చు. ఇప్పటిదాకా రెండుసార్లు విదేశీయులకు భారతరత్న అవార్డును ప్రదానం చేశారు. అందులో శాంతి కోసం పోరాడిన దక్షిణాఫ్రికా లీడర్ నెల్సన్ మండేలా ఉన్నారు. మరో సందర్భంలో పాకిస్థాన్‌కు చెందిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌కు ఇచ్చారు. అవార్డులను ఇప్పటిదాకా రెండు సార్లు ఆపేశారు. తొలిసారి 1977లో మొరార్జీ దేశాయ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక.. జూలై 13న భారతరత్న సహా అన్ని పౌర పురస్కారాలను రద్దు చేశారు. ఇందిరా గాంధీ ప్రధాని అయ్యాక వాటిని పునరుద్ధరించారు. ఈ అవార్డుల రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ మధ్యప్రదేశ్, కేరళ హైకోర్టుల్లో కేసులు దాఖలవడంతో 1992లో వాటిని మళ్లీ రద్దు చేశారు. వాదనల అనంతరం అవార్డులను పునరుద్ధరిస్తూ 1995 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. 2019ని కలుపుకుని ఇప్పటిదాకా 48 మందిని భారతరత్న పురస్కారం వరించింది.

# అరుదైన వ్యక్తిత్వం

**నానాజీ దేశ్‌ముఖ్..** దేశం గర్వించదగ్గ వ్యక్తిత్వం ఆయనది. అసలు పేరు చండికాదాస్ అమృత్‌రావు దేశ్‌ముఖ్. అందరికీ నానాజీ దేశ్‌ముఖ్‌గానే ఆయన పరిచయం. మహారాష్ట్ర పర్భని జిల్లా కడోలి అనే చిన్న టౌన్‌లో అక్టోబర్ 11, 1916న పుట్టిన దేశ్‌ముఖ్ చిన్నప్పట్నుంచే కష్టాలతో సహజీవనం చేశారు. కూరగాయలు అమ్ముకుంటూ చదువుకున్నారు. బాల్‌గంగాధర్ తిలక్ ప్రేరణతో బాల్యంలోనే ఆయన జాతీయ భావాలను వంటపట్టించుకున్నారు. బిర్లా కాలేజీ (ఇప్పటి బిట్స్ పిలానీ) లో చదువుతున్నప్పుడే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా ఉన్నప్పుడే ఆయన విద్య అవసరాన్ని గుర్తించారు. దాంతోనే ఆయన గోరఖ్‌పూర్‌లో తొలి సరస్వతి శిశుమందిర్‌ను ఏర్పాటుచేశారు.

**రాజకీయాల్లోకి...**

ప్రత్యక్ష రాజకీయాలంటే అంతగా ఆసక్తిలేకపోయినా జాతీయవాద రాజకీయాలను జీర్ణించుకున్న దేశ్‌ముఖ్ ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లోనూ తనదైన ముద్రను వేశారు. భిన్న రాజకీయ సిద్ధాంతాలున్న నాయకుల్ని ఒక్కచోటకు చేర్చి ఉత్తరప్రదేశ్‌లో 1967లో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. వినోబా భావే ప్రారంభించిన భూదాన్ ఉద్యమంలో ఆయన చురుగ్గా పనిచేశారు. జయప్రకాశ్ నారాయణ్ ప్రారంభించిన 'సంపూర్ణ విప్లవం' ఉద్యమం పట్ల ఆకర్షితుడైన ఆయన తన నిబద్ధతతో జేపీ అభిమానాన్ని పొందగలిగారు. కేంద్రంలో జనతా సర్కార్ ఏర్పడ్డప్పుడు పరిశ్రమల మంత్రి పదవి ఇస్తామన్న మురార్జీ దేశాయ్ ఆహ్వానించినా ఆయన దాన్ని తిరస్కరించారు. 1977 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని బలరామ్‌పూర్ నుంచి గెలిచిన దేశ్‌ముఖ్ 60 ఏళ్లు పూర్తికాగానే క్రియాశీల రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు.

**సామాజిక సేవలో**


క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్న దేశ్‌ముఖ్ తన శేషజీవితాన్ని సమాజసేవకు అంకితం చేశారు. దీన్‌దయాల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్‌గా గ్రామీణాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని సుమారు 500 గ్రామాల్లో సామాజిక పునర్ నిర్మాణ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించారు. గోండ్ (ఉత్తరప్రదేశ్), బీడ్ (మహారాష్ట్ర) ప్రాంతాల్లోనూ ఆయన ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. చిత్రకూట్‌లో స్థిరపడ్డ ఆయన దాన్ని కేంద్రంగా చేసుకుని దేశ్‌ముఖ్ తన సామాజిక సేవల్ని కొనసాగించారు. అక్కడే దేశంలో తొలి గ్రామీణ విశ్వవిద్యాలయం..'చిత్రకూట్ గ్రామోదయ్ విశ్వవిద్యాలయ్'ను ఏర్పాటుచేశారు. ఫిబ్రవరి 27, 2010లో దేశ్‌ముఖ్ చిత్రకూటలో తుదిశ్వాస విడిచారు. జాతికి చేసిన సేవలకుగాను ఎన్డీయే సర్కార్ 1999లో దేశ్‌ముఖ్‌ను రాజ్యసభకు నామినేట్ చేసింది. అదే ఏడాది పద్మవిభూషణ్ ప్రదానం చేసింది.











పద్మశ్రీ: శంకర్ మహదేవన్ | ప్రభుదేవ | ఖాదర్ ఖాన్ | శివమణి

# ప్రణబ్, భూపేన్, నానాజీ భారత రత్నాలు

**న్యూఢిల్లీ:** నాలుగేళ్ల విరామం తర్వాత భారతరత్న అవార్డును కేంద్రం ప్రకటించింది. 2015లో అటల్ బిహారీ వాజపేయి, మదన్ మోహన్ మాలవీయలకు ఈ అవార్డును ప్రకటించింది. ఆ తర్వాత ఏటా పద్మ అవార్డులను ప్రకటిస్తున్నా భారతరత్నకు మాత్రం ఎవరినీ ఎంపిక చేయలేదు. అలాంటిది ఈసారి ఏకంగా ముగ్గురికి భారతరత్న దక్కింది. కాంగ్రెస్ ట్రబుల్ షూటర్‌గా పేరు పొందిన ప్రణబ్ ముఖర్జీ, కళా రంగం నుంచి సినీ దిగ్గజం భూపేన్ హజారికా, ఆరెస్సెస్ దిగ్గజం నానాజీ దేశ్‌ముఖ్‌లను భారతరత్నకు ఎంపిక చేశారు. ఈ ముగ్గురిలో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. కాంగ్రెస్ పార్టీలో దాదా ఎన్నో కీలక పదవులు నిర్వహించారు. రక్షణ మంత్రిగా, ఆర్థిక మంత్రిగా తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. దేశ ప్రథమ పౌరుడిగా సేవలందించారు. మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా భారత రత్న అవార్డుల ప్రకటనలో కేంద్రం ఆచితూచి నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటు ప్రణబ్ పేరును ప్రకటించడంతో కాంగ్రెస్ శ్రేణులను కూడా తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేసిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అటు సంఘ్ ప్రచారక్, మాజీ ఎంపీ నానాజీ దేశ్‌ముఖ్ పేరును ప్రకటించడం ద్వారా.. ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలను శాంతపరిచినట్లయిందని వారు చెప్తున్నారు. ఈ ఇద్దరూ రాజకీయ రంగం వారేవారే కావడంతో కళారంగం నుంచి భూపేన్ హజారికాను ఎంపిక చేసింది. ఇదిలా ఉంటే ఈ సారి 112 మందిని పద్మ అవార్డులకు కేంద్రం ఎంపిక చేసింది. ఇందులో నలుగురికి పద్మవిభూషణ్, 14 మందికి పద్మభూషణ్, 94 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. మొత్తం 112 మందిలో 21 మంది మహిళలు ఉన్నారు. 11 మంది ఎన్నారైలు, ఒక ట్రాన్స్ జెండర్ కూడా ఉన్నారు. ముగ్గురికి మరణానంతరం పద్మ అవార్డులు దక్కాయి. మార్చి, ఏప్రిల్‌లో రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని కేంద్రం ప్రకటనలో తెలిపింది.

**ఇంకా ఎందరో..**

రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్ నలుగురిని వరించింది. ఇందులో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జానపద కళాకారిణి తీజన్ బాయ్, విదేశీయుడైన ఇస్మాయిల్ ఒమర్ గుయెల్లె, మహారాష్ట్రకు చెందిన వాణిజ్య పారిశ్రామిక రంగానికి చెందిన అనిల్ కుమార్ మణిభాయ్ నాయక్, అదే రాష్ట్రానికి చెందిన రంగస్థల ఆర్టిస్టు బల్వంత్ మోరేశ్వర్ పురందరే ఉన్నారు. పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన 14 మంది ప్రముఖుల్లో సీనియర్ పాత్రికేయులు కులదీప్ నయ్యర్ (మరణానంతరం), పర్వతారోహకురాలు బచేంద్రిపాల్, దక్షిణాది సినీ నటుడు మోహన్‌లాల్, రాజకీయవేత్త కరియా ముండా ఉన్నారు. ఇక, పద్మశ్రీ అవార్డులు అందుకున్న వారిలో మాజీ క్రికెటర్ గౌతం గంభీర్, బాలీవుడ్ నటుడు ఖాదర్ ఖాన్ (మరణానంతరం), గాయకుడు శంకర్ మహదేవన్, సంగీత వాయిద్యకారుడు శివమణి, నటుడు మనోజ్ బాజ్‌పాయ్, డ్యాన్స్ మాస్టర్ ప్రభుదేవా వంటివారు ఉన్నారు.

### తెలంగాణ నుంచి ఇద్దరికి

తెలంగాణ కోటాలో ఇద్దరికి పద్మశ్రీ అవార్డు దక్కింది. అందులో సినీ గీత రచయిత 'సిరివెన్నెల' సీతారామ శాస్త్రి, స్పోర్ట్స్ పర్సన్ సునీల్ ఛెత్రి ఉన్నారు. ఇక, హైదరాబాద్‌కు చెందిన శాంతను నారాయణ్‌ను విదేశీ కోటాలో పద్మశ్రీ వరించింది. ఏపీ నుంచి చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, వ్యవసాయ రంగ నిపుణుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావుకు పద్మశ్రీ దక్కింది.

### పద్మ విభూషణ్ అవార్డులు

| | | | |
|---|---|---|---|
| 1 | తీజన్ బాయి | ఆర్ట్, వోకల్, ఫోక్ | చత్తీస్‌గఢ్ |
| 2 | ఇస్మాయిల్ ఒమర్ గెలె (విదేశీయుడు) | పబ్లిక్ ఎఫైర్స్ | జిబౌటి |
| 3 | అనిల్‌కుమార్ మణిభాయ్‌నాయక్ | వాణిజ్యం | మహారాష్ట్ర |
| 4 | బల్వంత్ మోరేశ్వర్ పురంధర్ | నాటకం | మహారాష్ట్ర |

### పద్మ భూషణ్ అవార్డులు

| | | | |
|---|---|---|---|
| 1 | నంబి నారాయణ్ | సైన్స్ అండ్ ఇంజనీరింగ్ | కేరళ |
| 2 | కుల్దీప్ నయ్యర్ | జర్నలిజం | ఢిల్లీ |
| 3 | బచేంద్రీపాల్ | మౌంటెనీర్ | ఉత్తరాఖండ్ |
| 4 | మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్ | ఆర్ట్, యాక్టింగ్ | కేరళ |
| 5 | సుఖ్‌దేవ్‌సింగ్ ధిండ్సా | పబ్లిక్ ఎఫైర్స్ | పంజాబ్ |
| 6 | మహాశయ్ ధరమ్‌పాల్ గులాటి | ట్రేడ్, ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ | ఢిల్లీ |
| 7 | దర్శన్‌లాల్ జైన్ | సోషల్ వర్క్ | హర్యానా |
| 8 | అశోక్ లక్ష్మణ్‌రావు కుకడే | మెడిసిన, హెల్త్ కేర్ | మహారాష్ట్ర |
| 9 | కరియా ముండా | పబ్లిక్ ఎఫైర్స్ | జార్ఖండ్ |
| 10 | బుధాదిత్య ముఖర్జీ | ఆర్ట్, మ్యూజిక్, సితార్ | పశ్చిమబెంగాల్ |
| 11 | వీకే షుంగ్లు | సివిల్ సర్వీస్ | ఢిల్లీ |
| 12 | హుకుమ్‌దేవ్ నారాయణ్ యాదవ్ | పబ్లిక్ ఎఫైర్స్ | బిహార్ |
| 13 | జాన్ చాంబర్స్ (విదేశీయుడు) | వాణిజ్యం | యూఎస్‌ఏ |
| 14 | ప్రవీణ్ గోర్ధన్ (విదేశీయుడు) | పబ్లిక్ ఎఫైర్స్ | సౌత్ ఆఫ్రికా |



వెంకటేశ్వర రావు
వ్యవసాయం,
ఆంధ్రప్రదేశ్
(పద్మశ్రీ)

### జాతి వృద్ధిలో ప్రణబ్ ముద్ర

ప్రణబ్ దాదా ఓ గొప్ప రాజనీతిజ్ఞుడు. కొన్ని దశాబ్దాల పాటు నిర్విరామంగా, అవిశ్రాంతంగా దేశానికి సేవ చేశారు. జాతి వృద్ధి బాటలో తనదైన ముద్ర వేశారు. ఆయన జ్ఞానం, తెలివికి సాటి లేదు. అలాంటి వ్యక్తికి భారతరత్న రావడం చాలా ఆనందంగా ఉంది.

### పాటలతో సామరస్యం చాటారు

భూపేన్ హజారికా పాటలు, సంగీతం అన్ని తరాల వారినీ ఓలలాడించాయి. ఆ పాటల నుంచే ఆయన న్యాయం, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించారు. ప్రపంచవ్యాప్తంగా భారత సంగీతానికి ప్రాచుర్యం కల్పించడంలో గొప్ప పాత్ర పోషించారు.



### నానా.. గ్రామీణాభివృద్ధికి నమూనా

గ్రామీణాభివృద్ధి కోసం నానాజీ దేశ్‌ముఖ్ ఎంతో కృషి చేశారు. గ్రామీణ ప్రజల సాధికారత కోసం ఓ నమూనాను సృష్టించారు. అణగారిన వర్గాల పట్ల ఎప్పుడూ గౌరవం, దయతో ఉండేవారు. నిజంగా ఆయన భారత రత్నమే.

- ప్రధాని నరేంద్ర మోడీ

# సమ్మోహనలాల్

**300లకు పైగా సినిమాల్లో** నటించిన మలయాళీ స్టార్.. ఐదు నేషనల్ ఫిలిం అవార్డులు అందుకున్న విలక్షణ నటుడు.. లెఫ్టినెంట్ కల్నల్‌గా ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీ గౌరవించిన మొట్టమొదటి యాక్టర్ మోహన్‌లాల్. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లోనూ అభిమానులను సంపాదించుకున్న సూపర్‌స్టార్. ప్లేబ్యాక్ సింగర్‌గా, నిర్మాతగా కూడా మంచి పేరు తెచ్చుకున్నారు. జనతాగ్యారేజ్, మన్యంపులి సినిమాల్లో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకున్నారు. కేరళలోని ఎలంథూర్‌లో 1960 మే 21న జన్మించిన ఈ మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్.. 1978లో తిరనోత్తమ్ సినిమాతో సినీజీవితం మొదలెట్టారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆ సినిమా విడుదలవలేదు. విలన్‌గా నటించిన మంజిల్ విరింజ పుక్కల్ తొలుత విడుదలైంది. ఆ తర్వాత చాలా సపోర్టింగ్ పాత్రలు చేశారు. 1986లో లాల్ హీరోగా నటించిన రాజవింటే మకన్ అద్భుత విజయం సాధించడంతో సూపర్‌స్టార్ అయ్యారు. తర్వాత క్రమంగా అగ్ర నాయకుడిగా గుర్తింపు పొందారు. ఇరువర్ (తమిళం), కంపెనీ (హిందీ), జనతాగ్యారేజ్ (తెలుగు) ఇతర భాషల్లో ఆయన నటించిన సూపర్‌హిట్ సినిమాలు. సినిమా రంగానికి చేసిన గుర్తింపుకుగాను 2001లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డునిచ్చింది. కాలికట్ యూనివర్సిటీ, శ్రీ శంకరాచార్య యూనివర్సిటీ ఆఫ్ సాన్‌స్క్రిట్ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయి.



# అస్సామీ పాటసారి

**'నేను సంచారిని. ఆ సంచారమే** నన్ను నన్నుగా తీర్చిదిద్దింది' కార్యక్రమం ఏదైనా ఆయన నోట వచ్చే మాట అది. నేపథ్య గాయకుడిగా, గీత రచయితగా, కవిగా, సినిమా దర్శకుడిగా కడవరకు కళామతల్లి సేవలో తరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి భూపేన్ హజారికా. తన మాతృభాష అస్సామీలో వేలాది పాటలు రాసి.. వాటికి ఆయనే స్వరకల్పన చేసి.. శ్రోతల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్నారు. బెంగాలీలో, హిందీలోనూ పాటలు రాశారు. సంగీతం అందించారు. హజారిక పాటల్లో జనహితం, సోదరభావం, మత సామరస్యత ఎక్కువగా ఉంటుంది. 'దిల్ హూమ్ హూమ్ కరే..', 'ఓ గంగా బెహతీ హో..' లాంటి ఎన్నో గీతాలు ఇప్పటికీ ఎక్కడో ఓ చోట మారుమోగుతూనే ఉంటాయి.

### వాజపేయి వీరాభిమాని

భూపేన్ పాటంటే మాజీ ప్రధాని వాజపేయికి ప్రాణం. ప్రత్యేకంగా ఆయనను తన దగ్గరకు పిలిపించుకొని పాటలు పాడించుకునేవారు. కవి కూడా అయిన వాజపేయి.. తన రచనలను భూపేన్‌తో స్వరకల్పన చేయించేవారు.

**గిరిజనుల గానమే ప్రేరణగా..**


ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన అస్సాంలోని సాదియా అనే మారుమూల గ్రామంలో భూపేన్ హజారిక 1926, సెప్టెంబర్ 8న జన్మించారు. తండ్రి నీలకాంత, తల్లి శాంతి ప్రియ. వారికి ఉన్న పదిమంది సంతానంలో భూపేన్ హజారికానే పెద్దవాడు. ఆయన 12 ఏళ్ల వయసులో తొలిసారి సినిమా పాట పాడారు. అస్సామీ చిత్రం ఇంద్రమాలతిలోనిది ఆ పాట. స్థానిక గిరిజనుల పాటలు విని.. వాటి ద్వారా తన భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు భూపేన్. 13 ఏళ్లకే గేయరచయిత, సంగీత దర్శకుడిగా ఎదిగారు. బీఏ, ఎంఏ బనారస్ హిందూ యూనివర్సిటీలో చేశారు. ఆల్ ఇండియా రేడియోలో కొంత కాలం పని చేశారు. స్కాలర్‌షిప్‌పై అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో చేరి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. అక్కడే ప్రియంవద పటేల్‌ను ప్రేమించి వివాహమాడారు. వారి తనయుడు తేజ్. 'గిరిజన సంగీతం విని పెరిగాను. అదే నాకు ప్రేరణ. అమ్మ మంచి గాయని. నన్ను నిద్రపుచ్చుతూ అమ్మ పాడిన పాటను.. 'రుదాలి' చిత్రంలో వాడుకున్నాను' అని ఓ సందర్భంలో హజారికా తెలిపారు.

**బ్రహ్మపుత్ర వాగ్గేయకారుడు**

అస్సామీ సంప్రదాయం, గిరిజన సంగీతం భూపేన్ పాటల్లో ప్రతిధ్వనిస్తుంటుంది. అస్సాంలో ప్రవహించే బ్రహ్మపుత్ర నదికి గుర్తుగా ఆయనను 'బ్రహ్మపుత్ర వాగ్గేయకారుడు'గా పిలుస్తుంటారు. సినిమాలకు 50ఏళ్లపాటు సేవ చేశారు. శకుంతల, ప్రతిధ్వని తదితర అస్సామీ చిత్రాలను నిర్మించి దర్శకత్వం వహించారు. వాటికి సంగీతమూ అందించారు. ప్రఖ్యాత దర్శకురాలు కల్పనా లాజ్మీతో కలిసి రూపొందించిన రుదాలి, ఏక్‌పల్, దార్మియాన్, దామన్, క్యోన్ వంటి చిత్రాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. చివరి రోజుల్లో కల్పనా లాజ్మీతో కలిసి భూపేన్ హజారికా జీవించారు. ఆయన భారతీయ సినిమాలకే కాక బంగ్లాదేశ్ సినిమాలకు కూడా సంగీతం అందించారు. భూపేన్ పాట 'మనుష్ మనుషర్ జోనో' బంగ్లాదేశ్‌లో అత్యంత ప్రసిద్ధి పొందింది. బంగ్లాదేశ్ జాతీయ గీతం తరువాత చెప్పుకునే స్థాయిలో అది పాపులర్ అయింది. 2011లో వచ్చిన 'గాంధీ టు హిట్లర్' సినిమాలో 'వైష్ణవ జన..' పాట భూపేన్ చివరి పాట. రాజకీయ నాయకుడిగా కూడా భూపేన్ అస్సామీ ప్రజలకు సేవ చేశారు. 1967లో స్వతంత్రంగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1972 వరకు కొనసాగారు. 86ఏళ్ల వయసులో 2011 నవంబర్ 5న ముంబైలోని ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో ఆయన కన్నుమూశారు. ఆయన అంతిమసంస్కారానికి సుమారు 5 లక్షల మంది హాజరయ్యారు.

### వంతెనకు భూపేన్ పేరు

భారతదేశంలోనే అత్యంత పొడవైన ధోలా – సాదియా వంతెనకు భూపేన్ హజారికా బ్రిడ్జిగా 2017లో ప్రధాని నరేంద్రమోడీ నామకరణం చేశారు. అసోం – అరుణాచల్‌ప్రదేశ్‌ను కలుపుతూ, బ్రహ్మపుత్ర నదికి ఉపనది అయిన లోహిత నదిపై 9.15 కిలోమీటర్ల పొడవున ఈ వంతెనను నిర్మించారు.



### వరించిన పురస్కారాలు

1975లో ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ అవార్డు. 1987లో సంగీత నాటక అకాడమీ అవార్డు, ఫెలోషిప్. 1992లో దాదా ఫాల్కే, 1977లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, మరణానంతరం 2012లో పద్మవిభూషణ్, 2018లో భారతరత్న.

# పాటల తోటలో విరబూసిన పద్మం



**సిరివెన్నెల సీతారామశాస్త్రి..** సినిమా పేరే ఇంటిపేరుగా మారిపోయింది ఆయనకు. ఆయన కలం నుంచి వచ్చే పదం పాటకు పవర్‌నిస్తుంది. ప్రాణం పోస్తుంది. కాశీనాథుని విశ్వనాథ్‌కు పాటలు రాయడంతో ఆయన పాటల ప్రస్థానం మొదలైంది. 1984లో తొలిసారి జనని జన్మభూమికి పాట రాశారాయన. ఆ సినిమాలో చెంబోలు సీతా రామ శాస్త్రిగా టైటిల్ కార్డు పడుతుంది. కానీ, సిరివెన్నెల సినిమాతో అన్ని పాటలూ రాసేసిన ఆయనకు.. ఆ సినిమా పేరే ఇంటిపేరుగా మారిపోయింది. అప్పటి నుంచి మొదలైన ఆయన పాటల జర్నీ ఏనాడూ వెనుదిరిగి చూడలేదు. స్వయంకృషి, స్వర్ణకమలం, సంసారం ఒక చదరంగం, రుద్రవీణ వంటి సినిమాలకు పదాలనందించి తన ముద్రేంటో చూపించారు. ఇక, గాయం సినిమాలో నిగ్గదీసి అడుగు అనే పాట గురించి ప్రత్యేకంగా చెప్పాలా? ఇప్పటిదాకా ఆయన కలం నుంచి 3 వేల పైచిలుకు పాటలు జాలువారాయి. అన్నపూర్ణ స్టూడియోస్, సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వంటి సంస్థలతోనూ, కే విశ్వనాథ్, రాంగోపాల్ వర్మ, కృష్ణ వంశీ, త్రివిక్రమ్ శ్రీనివాస్ వంటి డైరెక్టర్ల సినిమాలకు ఆయన పాటలు రాశారు. దాదాపు 11 సార్లు ఉత్తమ పాటల రచయితగా నంది అవార్డులను అందుకున్నారాయన. 1986, 87, 88లో వరుసగా నంది అవార్డులు గెలుచుకుని హ్యాట్రిక్ కొట్టారు. ఆ తర్వాత 1993, 94, 95, 97, 99 (96, 98ల్లో నంది అవార్డులను ప్రకటించలేదు) వరుసగా ఐదుసార్లు వాటిని అందుకున్నారు. ఎక్కువ నందులను అందుకున్న సినీ గీత రచయితగా సిరివెన్నెల సీతారామశాస్త్రిదే రికార్డు. ఆ రికార్డును ఇంతవరకు ఎవరూ బద్దలు కొట్టలేకపోయారు. ఇక, నాలుగు సార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను అందుకున్నారు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలోని అనకాపల్లి. కాకినాడలోని పీఆర్ కాలేజీలో బీఏ, బీకాం చదివారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. ఇప్పుడు ఆ పాట పవర్ మెచ్చి ప్రభుత్వం పద్మశ్రీ అవార్డునిచ్చి గౌరవించింది.

శనివారం హైదరాబాద్
26.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu
03

# అందరివాడు



## బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రణబ్ ముఖర్జీ
## ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవజ్ఞుడు
## క్లర్క్ నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన నేత

క్లర్క్ నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన అసాధారణ నాయకుడు.. కష్ట కాలంలో కాంగ్రెస్‌ను ముందుండి నడిపించిన ట్రబుల్ షూటర్.. భారతీయ ఆర్థిక వ్యవస్థకు మొట్టమొదటి సంస్కర్తగా గుర్తింపు పొందిన మేధావి.. ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా అందరి మనసుల్లో స్థానం సంపాదించుకున్న రాజనీతిజ్ఞుడు.. ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న అందరివాడు ప్రణబ్ ముఖర్జీ. రాజ్యసభ సభ్యుడు మొదలుకొని పారిశ్రామిక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రిగా, రాజ్యసభలో డిప్యూటీ లీడర్‌గా, లీడర్‌గా, రక్షణ, ఆర్థిక, విదేశీ వ్యవహారాల మంత్రిగా, రాష్ట్రపతిగా అంచెలంచెలుగా ఎదిగారు.

**తొలుత క్లర్క్‌గా**

పశ్చిమ బెంగాల్‌లోని బిర్భుమ్ జిల్లా మిరాఠీ గ్రామంలో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో 1935 డిసెంబర్ 11న ప్రణబ్ జన్మించారు. ఆయన తండ్రి కమద కింకర్ ముఖర్జీ, తల్లి రాజ్‌లక్ష్మి. అప్పట్లో కలకత్తా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న సూరి విద్యాసాగర్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి తర్వాత చరిత్ర, రాజనీతిశాస్త్రంలో పట్టా పొందారు. తర్వాత ఎల్‌ఎల్‌బీ కూడా చదివారు. కలకత్తాలోని డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్) ఆఫీస్‌లో అప్పర్ డివిజన్ క్లర్క్‌గా, 1963లో విద్యానగర్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. రాజకీయాల్లోకి వచ్చే ముందు దేషేర్‌దక్ పత్రికలో జర్నలిస్టుగా కూడా పని చేశారు.

**మ్యాన్ ఫర్ ఆల్ సీజన్స్**

1969లో ప్రణబ్ రాజకీయాల్లోకి వచ్చారు. మిడ్నాపూర్ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వీకే కృష్ణమీనన్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆయన ప్రతిభను గుర్తించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రణబ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అలా 1969లోనే ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1975, 1981, 1993, 1999లోనూ సభ్యుడిగా కొనసాగారు. ఆయన్ను ముద్దుగా 'మ్యాన్ ఫర్ ఆల్ సీజన్స్' అని పిలుచుకునేవారు. 1973లో ఇందిర కేబినెట్‌లో పరిశ్రమల శాఖ డిప్యూటీ మంత్రిగా నియమితులయ్యారు. 1975-77 ఎమర్జెన్సీ సమయంలో ఆయన యాక్టివ్‌గానే ఉన్నారు. 1979లో రాజ్యసభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా, 1980లో సభా నాయకుడిగా ఎన్నికయ్యారు. 1982 నుంచి 1984 వరకు ఆర్థిక మంత్రిగా పని చేశారు. ప్రణబ్ హయాంలోనే మాజీ ప్రధాని మన్మోహన్ ఆర్బీఐ గవర్నర్‌గా నియమితులయ్యారు.

**రాజీవ్ హయాంలో దూరమైనా..**

రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యాక ప్రణబ్ ప్రాముఖ్యం కాస్త తగ్గినా పీవీ నర్సింహారావు ప్రధాని అయ్యాక ఆయన్ను ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్‌గా, తర్వాత కేంద్ర కేబినెట్ మంత్రిగా నియమించారు. పీవీ కేబినెట్‌లోనే 1995 నుంచి 1996 వరకు విదేశాంగ మంత్రిగా చేశారు. 2004లో లోక్‌సభ నాయకుడిగా నియమితులయ్యారు. 2004లో సోనియా ప్రధాని పదవి వద్దన్నాక ముఖర్జీనే ప్రధాని అవుతారని అందరూ భావించారు. కానీ అనూహ్యంగా మన్మోహన్‌ను సోనియా ప్రధానిగా ప్రతిపాదించారు. మన్మోహన్ సారథ్యంలోనే రక్షణ, ఆర్థిక, విదేశీ వ్యవహారాల శాఖ బాధ్యతలు సమర్థంగా నిర్వహించారు. 2012లో 13వ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 2017 వరకు పని చేసి తనదైన ముద్ర వేశారు.

### సీఎం కేసీఆర్ హర్షం

**హైదరాబాద్, వెలుగు:** ప్రణబ్‌కు భారతరత్న లభించడం పట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. పురస్కారానికి ఆయన సంపూర్ణ అర్హుడని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టపరచడానికి, రాజ్యాంగాన్ని సమర్థంగా అమలు చేయడానికి ప్రణబ్ ఎంతో చొరవ చూపారని కొనియాడారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వహించిన ఆయన దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. పద్మ అవార్డు గ్రహీతలందరికీ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

### దేశం నాకిచ్చిందే ఎక్కువ

"భారతరత్న వంటి గొప్ప అవార్డు రావడానికి కారణమైన దేశ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటాను. వాళ్లందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగింది. ఎన్నోసార్లు చెప్పాను.. మళ్లీ చెప్తున్నాను. ఈ గొప్ప దేశంలోని ప్రజలకు ఇప్పటిదాకా నేను ఇచ్చిన దాని కంటే దేశం నాకు ఇచ్చిందే ఎక్కువ"

- మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

## యాపిల్‌తో మొదలు..
# అడోబ్‌తో అందలాలు



తెలుగుతేజం శాంతను నారాయణ్‌ను పద్మశ్రీ వరించింది. ఆయన పుట్టింది, పెరిగింది, చదువుకుంది అంతా హైదరాబాద్‌లోనే. ఆయన తల్లి అమెరికన్ లిటరేచర్ లెక్చరర్, తండ్రి ప్లాస్టిక్ కంపెనీ నడిపేవారు. విద్యాభ్యాసం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో బీఈ చదివారు. తర్వాత బెర్కెలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఎంబీఏ చేశారు. తర్వాత ఒహాయోలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పట్టా పొందారు. ఆయన కెరీర్ యాపిల్‌తో మొదలైంది. తర్వాత సిలికాన్ గ్రాఫిక్స్‌లో డెస్క్‌టాప్ అండ్ కొలాబరేషన్ ప్రోడక్ట్స్ డైరెక్టర్ గా పని చేశారు. తర్వాత ఇంటర్నెట్ లో డిజిటల్ ఫొటో షేరింగ్ కాన్సెప్ట్‌తో పిక్ట్రా ఇంక్ అనే కంపెనీని స్థాపించారు. తర్వాత 1998లో అడోబ్ వరల్డ్ వైడ్ ప్రొడక్ట్ రీసెర్చ్‌కు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గా చేరారు. అక్కడి నుంచి ఆయన వెనుదిరిగి చూసుకోలేదు. తక్కువ కాలంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి సాధించారు. 2007లో కంపెనీ ఆయన్ను సీఈవోగా నియమించింది. 45 ఏళ్ల వయసులోనే ఆయన పెద్ద బాధ్యతలు చేపట్టారు. విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఫొటోషాప్ వచ్చింది ఆయన టీం నుంచే. ప్రీమియర్ ప్రో, ఆక్రోబాట్/పీడీఎఫ్‌లనూ తీసుకొచ్చారు. శాంతను హయాంలోనే కంపెనీ గతేడాది 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.7.08 లక్షల కోట్లు) కంపెనీగా అవతరించింది. ఫార్చ్యూన్ 400 కంపెనీల జాబితాలోనూ చోటు సాధించింది. 2018 ఫార్చ్యూన్ బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ జాబితాలో శాంతను నారాయణ్ 12వ స్థానంలో నిలిచారు.





## ఎవరెస్టుపై
# నారీభేరి

"మేం పర్వతాల్లో నివసించే వాళ్లం. వాటినే ఆరాధిస్తాం. ఈ రోజు ఎవరెస్ట్‌ను ఎక్కడం మొదలుపెడుతున్నా నాలో ఆరాధనా భావం పొంగిపొర్లుతోంది'' ఇది తాను ఎవరెస్ట్ ఎక్కడం మొదలెడుతున్నపుడు బచేంద్రీపాల్ అనుకున్న మాట. దేశ పతాకాన్ని ఎవరెస్ట్ శిఖరంపై రెపరెపలాడించిన తొలి మహిళ. ఉత్తరాఖండ్‌లోని చిన్న కుగ్రామం నకురిలో పాల్ జన్మించారు. 12 ఏళ్ల వయసులో తొలిసారి పర్వతారోహణ చేశారు. ఆమె ప్రతిభ గుర్తించిన స్కూల్ ప్రిన్సిపల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌కు పంపారు. అక్కడే చదువుకుంటూ 21 వేల అడుగుల మౌంట్ గంగోత్రిని అధిరోహించారు. 1984లో ఎవరెస్ట్‌ను అధిరోహించడానికి వెళ్లే గ్రూప్‌కు ఎంపికయ్యారు. కొద్ది రోజులు బాగానే సాగినా మంచుచరియలు విరిగిపడి కొందరు గాయపడ్డారు. దీంతో పర్వతాధిరోహణ ఆపేశారు. అయినా పాల్ ముందుకుసాగి ఎవరెస్టును అధిరోహించారు.



# కలం యోధుడు కుల్దీప్



హక్కుల కోసం ఆజన్మాంతం పోరాడిన జర్నలిస్టు యోధుడు కుల్దీప్ నయ్యర్. బ్రిటిష్ ఇండియాలోని పంజాబ్ సియాల్‌కోట్‌లో 1923 ఆగస్టు 14న ఆయన జన్మించారు. లాహోర్‌లోని ఫోర్మన్ క్రిస్టియన్ కాలేజీలో బీఏ హానర్స్ చదివారు. లాహోర్‌లోని లా కాలేజీ నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. స్కాలర్‌షిప్‌తో నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీలోని మెడిల్ స్కూల్ ఆఫ్ జర్నలిజం నుంచి జర్నలిజం చదివారు. చదువయ్యాక ఓ ఉర్దూ పత్రికలో రిపోర్టర్‌గా కెరీర్‌ను ప్రారంభించారాయన. అనంతరం అప్పట్లో ప్రముఖ పత్రిక అయిన ద స్టేట్స్‌మాన్ అనే ఇంగ్లిష్ న్యూస్ పేపర్‌కు ఎడిటర్‌గా సేవలందించారు. శాంతి కోసం, మానవ హక్కుల కోసమూ పోరాడారు. 1996లో ఐక్యరాజ్యసమితికి భారత బృందంలో ఆయనా ఓ సభ్యుడు. అంతకుముందు 1990లో గ్రేట్ బ్రిటన్‌కు హై కమిషనర్‌గానూ పనిచేశారు. 1997 ఆగస్టులో రాజ్యసభ ఎంపీగా ఆయన నామినేట్ అయ్యారు. డెక్కన్ హెరాల్డ్ (బెంగళూరు), ద డైలీ స్టార్, ద సండే గార్డియన్, ద న్యూస్, ద స్టేట్స్‌మాన్, ద ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్, డాన్, ప్రభాసాక్షి వంటి 14 భాషల్లోని 80 పత్రికల్లో సంపాదకీయ వ్యాసాలు రాశారు. 2000వ సంవత్సరం నుంచి ఏటా ఇండియా, పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా అటారీ-వాఘా సరిహద్దుల వద్ద శాంతి కార్యకర్తలను లీడ్ చేస్తూ క్యాండిల్స్ వెలిగించేవారు. పాక్ జైళ్లలో ఉన్న భారతీయులు, భారత జైళ్లలోని పాకిస్థానీలను విడిపించేందుకు కృషి చేశారు. అయినా ఆయన కృషిని ఎవరూ పట్టించుకోలేదు. అన్నా హజారే ఉద్యమానికి మద్దతిచ్చారు. ఇక, ఆయనకు జాతి వ్యతిరేక వ్యక్తిగా పేరుపడిపోయింది. ఇండియన్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ లీడర్ హేమంత్ కర్కారేని హిందూ గ్రూపులే చంపించాయంటూ పాకిస్థాన్ పత్రిక డాన్‌కు ఆయన వ్యాసం రాశారు. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో సయ్యద్ గులాం నబీ ఫా అమెరికాలో నిర్వహించిన కార్యక్రమాలకు కుల్దీప్ హాజరయ్యారని 2011 జులైలో అమెరికా అధికారులు నిర్ధారించారు. 2018 ఆగస్టు 23న ఆయన మరణించారు. ఆయనకిప్పుడు పద్మభూషణ్ అవార్డునిచ్చి కేంద్రం సత్కరించింది.

# ఓటు విలువను గుర్తిద్దాం

**న్యూఢిల్లీ:** ఓటు పవిత్రమైనదని, దాని విలువను గుర్తించాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన గురువారం రాత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికలను రాజకీయ కోణంలో చూడొద్దని, అవి మన భవిష్యత్తును నిర్దేశించేవని తెలిపారు. 'దేశ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.

- వచ్చే ఎన్నికల్లో తప్పక ఓటేద్దాం
- అందరి భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి
- అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు
- 10శాతం కోటా గొప్ప నిర్ణయం రిపబ్లిక్ డే సందేశంలో రాష్ట్రపతి

వచ్చే 17వ లోక్‌సభ ఎన్నికలకు ఓ ప్రత్యేకత ఉంది. 21వ శతాబ్దం ఆరంభంలో పుట్టినవారందరికీ ఈసారి ఓటు వేసే అవకాశం దక్కింది. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి. దాని పవిత్రతను కాపాడాలి. మంచి నాయకులను ఎన్నుకోవాలి' అని కోరారు. 'ఈ దేశం మనది. మనందరిదీ. భిన్నత్వంలో ఏకత్వం మనకున్న గొప్ప బలం. అది ప్రపంచానికి ఆదర్శం. వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధి ..ఈ మూడు ఒకదానికి ఒకటి ముడి పడి ఉంటాయి. ఏ ఒక్కదాన్నీ విడివిడిగా చూడలేం. అవే మనను నడిపిస్తున్నాయి. అందరి భాగస్వామ్యంతోనే దేశం పురోగమిస్తుంది' అని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి



రిపబ్లిక్ డే ఉత్సవాలకు వచ్చిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు, ప్రధాని నరేంద్ర మోడీ

ఉత్సవాలు జరుపుకోనున్న తరుణంలో ఈ గణతంత్ర దినోత్సవం ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నదని రాష్ట్రపతి అన్నారు. మహాత్ముడి స్ఫూర్తితో ముందుకు సాగాలని, దేశ సమగ్రతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం కేంద్రం తీసుకువచ్చిన 10శాతం కోటా గొప్ప నిర్ణయమని అన్నారు. ఈ కోటా వల్ల ఎందరో పేదలకు ప్రయోజనం చేకూరుతుందని, మహాత్ముడి కలలు సాకారమవుతాయని పేర్కొన్నారు. మహిళలు ఎన్నోరంగాల్లో రాణిస్తున్నారని, ఇటు చదువుల్లో, కళల్లో, ఆటల్లో, అటు సైన్యంలోనూ తమదైన ముద్రవేస్తున్నారని అభినందించారు.

**ఎన్నికల్లో మోడ్రన్ టెక్రాలజీ**

ఎన్నికల్లో మోడ్రన్‌టెక్నాలజీ వాడకాన్ని కొనసాగించాలని రాష్ట్రపతి సూచించారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన సందేశం విడుదల చేశారు. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో ఎన్నికల నిర్వహణకు మోడ్రన్ టెక్నాలజీ అవసరమని, దీని వల్ల ఎన్నికల్లో పారదర్శకత ఉంటుందని తెలిపారు. ఈవీఎంలపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



శుక్రవారం భూపాలపల్లిలో భిక్షాటన చేస్తున్న వృద్ధ దంపతులు

# దెబ్బకు దిగొచ్చారు

- పాస్‌బుక్ ఇచ్చేందుకు వృద్ధులను లంచమడిగిన తహసీల్దార్
- వారి భిక్షాటనతో దిగొచ్చిన యంత్రాంగం

అది భూపాలపల్లి జిల్లా కేంద్రం. మంచి రద్దీ ఉన్న ప్రాంతం. అక్కడ వృద్ధ దంపతులు శుక్రవారం భిక్షమెత్తుకోవడం కలిచివేసింది. అయినవాళ్లంతా వదిలేశారేమోనని భావించారంతా.. దగ్గరికెళ్లి చూస్తే వారి మెడలో బోర్డులున్నాయి.. ఓ ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడర్థమైంది అదంతా ఓ ఆఫీసర్‌చలవేనని. తమ పట్టాదారు పాస్‌బుక్ ఇచ్చేందుకు లంచం అడిగిన ఆఫీసర్‌పై ఆ వృద్ధ దంపతులు భిక్షాస్త్రం సంధించారు. మనసును కదిలించే ఈ సన్నివేశాన్ని కొందరు సోషల్‌మీడియాలో అప్‌లోడ్‌చేశారు. అంతే.. నిమిషాల్లోనే వైరల్‌అయింది. దెబ్బకు పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చి వారి చేతిలో పడింది. 80ఏళ్ల వయసులో ఆఫీసర్లకు ముచ్చెమటలు పట్టించిన ఆ వృద్ధ జంటను జనం అభినందించారు.

భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం ఆజంనగర్‌కు చెందిన మాంత బస్వయ్య-లక్ష్మి దంపతులు తమ భూమిని కొందరు పట్టా చేసుకున్నారని తహసీల్దార్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు. తమ 9 ఎకరాల పట్టా భూమిని రెవెన్యూ ఆఫీసర్ల సహకారంతో కొందరు పట్టా చేసుకున్నారని, విచారణ జరిపి తమ భూములు తమకే చెందేలా చర్యలు తీసుకోవాలని ఈ వృద్ధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నాయి. అయినా సమస్య పరిష్కరించలేదు. భూపాలపల్లి తహసీల్దార్ తమను రూ.లక్ష లంచమడిగాడని, ఇవ్వడానికి తమ వద్ద డబ్బులు లేవని శుక్రవారం భూపాలపల్లిలో భిక్షమెత్తారు. అంబేద్కర్ చౌరస్తాలోని షాపులన్నీ తిరుగుతూ భిక్షాటన చేశారు.



వృద్ధులకు పాస్ పుస్తకం అందిస్తున్న ఆర్డీవో

**కలెక్టర్ ఆగ్రహం.. అందిన పాస్ పుస్తకం**

భూపాలపల్లి తహసీల్దార్ లంచం అడిగినందుకు వృద్ధ దంపతులు ఫ్లెక్సీ పట్టుకొని భిక్షాటన చేసిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇది చూసిన జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు రెవెన్యూ ఆఫీసర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో వెంకటాచారిని ఆదేశించారు. దీంతో వృద్ధ దంపతులను ఆర్డీవో కార్యాలయానికి పిలిపించి 4.10 ఎకరాలకు పట్టాదారు పాస్ పుస్తకాన్ని అందించారు. మిగిలిన భూమికి సంబంధించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ విషయమై బాధితురాలు లక్ష్మి 'వెలుగు'తో మాట్లాడుతూ తమకు ఇంకా 5.07 ఎకరాలకు సంబంధించిన భూమిని పట్టాదారు పాస్‌పుస్తకంలోకి ఎక్కించాల్సి ఉందని తెలిపారు. తమను మళ్లీ శనివారం విచారణ కోసం భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయానికి రావాల్సిందిగా ఆఫీసర్లు సూచించినట్లు తెలిపారు.

**- భూపాలపల్లి, వెలుగు**

# రామ జన్మభూమి కేసు విచారణకు కొత్త బెంచ్

**న్యూఢిల్లీ:** అయోధ్య రామజన్మభూమి కేసు విచారణకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయ్ శుక్రవారం కొత్త బెంచ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇద్దరు కొత్త జడ్జిలను బెంచ్‌లోకి తీసుకున్నారు. జస్టిస్ యు.యు. లలిత్, జస్టిస్‌ఎన్వీ రమణ స్థానంలో కొత్తగా జస్టిస్‌భూషణ్, జస్టిస్ అబ్దుల్‌నజీర్‌ను నియమించారు. గతంలో ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్ర నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బెంచ్‌లో కూడా వీరిద్దరు సభ్యులుగా ఉన్నారు. ఈ నెల 29న కేసు విచారణ జరగనుందని సుప్రీం కోర్టు రిజిస్ట్రీ చెప్పింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌రంజన్ గొగోయ్, జస్టిస్‌డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఎస్.ఏ బాబ్డే, జస్టిస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ అశోక్ భూషణ్ ఈ కేసును విచారించే బెంచ్‌లో సభ్యులుగా ఉన్నారు.

# ఆర్టీసీకి లాభాలు తెచ్చిన ఆఫీసర్లు

- 15 మందికి ప్రశంస పత్రాలు అందజేసిన ఇన్‌చార్జ్ ఎండీ

**హైదరాబాద్, వెలుగు:** ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆఫీసర్లకు ఇన్‌చార్జ్ ఎండీ సునీల్ కుమార్ ప్రశంస పత్రాలను అందజేశారు. శుక్రవారం బస్‌భవన్‌లో జరిగిన డివిజినల్ మేనేజర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు లాభాలు తెచ్చిపెట్టిన ఒక రీజనల్ మేనేజర్, ఇద్దరు డివిజినల్ మేనేజర్లు, 12 మంది డిపో మేనేజర్లను అభినందించారు. వరంగల్ రీజనల్ మేనేజర్ టి.సూర్య కుమార్ రూ.7.40 కోట్లు, వరంగల్ అర్బన్ డివిజనల్ మేనేజర్ జి.రాములు రూ.4.67 కోట్లు, వరంగల్ రూరల్ డివిజనల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి రూ.2.73 కోట్లు, వరంగల్ డిపో 1 మేనేజర్ సురేశ్ రూ.6.06 కోట్ల మేరకు సంస్థకు లాభాలు తెచ్చిపెట్టారు.

# మరో మూడ్రోజులు రాష్ట్రానికి వర్ష సూచన

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో పలుచోట్ల ఈ నెల 28 వరకు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడొచ్చని వాతావరణ కేంద్రం చెప్పింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం 0.6 మిల్లీ మీటర్ల వర్షం పడిందని అధికారులు చెప్పారు. ఆగ్నేయ బంగాళాఖాతంపై అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా దక్షిణ మధ్యప్రదేశ్ నుంచి కర్ణాటక మీదుగా 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందని చెప్పారు.

# గవర్నర్, సీఎం రిపబ్లిక్ డే శుభాకాంక్షలు





**హైదరాబాద్, వెలుగు:** సమాజంలోని అన్ని వర్గాలకూ అభివృద్ధి ఫలాలు అందాలని గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన 70వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. బాధ్యతగల పౌరులుగా అందరం కలసికట్టుగా పనిచేసి ఉజ్వల భారతాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. బంగారు తెలంగాణ సాధనే లక్ష్యంగా అహర్నిశలు పనిచేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరులు, త్యాగమూర్తులను స్మరించుకోవాలన్నారు. మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

**సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లాలి: సీఎం**

రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ 70వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిజమైన సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా భారత ప్రజాస్వామ్య గణతంత్ర వ్యవస్థ బలపడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతీ పౌరుడు పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'పాలమూరు'కు లైన్ క్లియర్



- అటవీ భూముల కేటాయింపుపై తుది అనుమతులు ఇచ్చిన కేంద్రం
- హర్షం వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, వెలుగు:**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అడ్డంకులు తొలగిపోయాయి. ఈ ప్రాజెక్టులో అటవీ భూముల బదలాయింపునకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర అటవీ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రవణ్‌కుమార్ వర్మ గురువారం రాష్ట్ర అటవీ శాఖ స్పెషల్ సీఎస్‌కు లేఖ రాశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు, వెయ్యి గ్రామాలకు తాగునీటిని అందించే 'పాలమూరు' ప్రాజెక్టు పనులు ఇకపై మరింత వేగం పుంజుకోనున్నాయి.

**అటవీ భూముల బదలాయింపుతో**

పాలమూరు ప్రాజెక్టు ఫస్ట్ స్టేజీ పంపుహౌస్, నార్లాపూర్ వద్ద నిర్మిస్తున్న అంజనగిరి రిజర్వాయర్, అక్కడి నుంచి ఏదుల వీరాంజనేయ రిజర్వాయర్ మధ్య సొరంగం తవ్వకానికి అటవీ భూములు అవసరం పడ్డాయి. ఈ మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఫారెస్ట్ డివిజన్‌లో 205.4811 హెక్టార్ల అటవీ భూమిని ప్రాజెక్టు నిర్మాణానికి ఇవ్వాలని కోరుతూ రాష్ట్రప్రభుత్వం 2017 మేలో కేంద్రానికి లేఖ రాసింది. ఆ అభ్యర్థనను పరిశీలించిన ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ 2018 ఏప్రిల్‌లో మొదటి దశ అనుమతి మంజూరు చేసింది. కేంద్రం నిర్దేశించిన విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయడంతో తాజాగా ఫైనల్ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో ఆ భూమి ప్రాజెక్ట్ సీఈ ఆధీనంలోకి రానుంది. ప్రాజెక్టు పనులు కొనసాగించడానికి కేంద్ర అటవీ శాఖ తుది అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ పర్యావరణ ప్రభావ నివేదికను సిద్ధం చేస్తోంది. త్వరలోనే కేంద్రానికి అందించనుంది.

**కేసుల తలనొప్పికి చెక్**

పాలమూరు ప్రాజెక్టులో అనుమతి లేకుండానే అటవీ భూముల్లో పనులు చేస్తున్నారంటూ కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దాంతో పనులు ఆపివేయాలని ట్రిబ్యునల్ తొలుత ఆదేశించింది. అయితే తాగునీటి అవసరాల కోసమే పనులు కొనసాగిస్తున్నామని, తుది అనుమతులు వచ్చాకే సాగునీటి పనులు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వడంతో ఓకే చెప్పింది. మరోవైపు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా హైకోర్టులోనూ కొందరు కేసులు వేశారు. ఇలాంటి సమయంలో కేంద్రం నుంచి అనుమతులు రావడం పెద్ద ముందడుగు అని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

**సీఎం కేసీఆర్ హర్షం**

పాలమూరు ప్రాజెక్టుకు కేంద్ర అటవీ శాఖ క్లియరెన్స్ ఇవ్వడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనుమతులు వచ్చేలా కృషి చేసిన ఇరిగేషన్ అధికారులను అభినందించారు.

**ప్రాజెక్ట్ స్వరూపమిదీ..**

10లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు ఉమ్మడి ఏపీలో పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. జూరాల నుంచి నీటిని ఎత్తిపోసి 3 రిజర్వాయర్లలో నిల్వ చేయాలని భావించారు. ఆ డిజైన్‌లో కోయిలకొండ (76 టీఎంసీలు), గండీడు (35 టీఎంసీలు), కేపీ లక్ష్మీదేవిపల్లి (10 టీఎంసీలు) రిజర్వాయర్ల కింద 47 గ్రామాలు, 16,340 ఆవాసాలు ముంపుకు గురై 85 వేల మంది నిరాశ్రయులయ్యేవారు. కానీ తెలంగాణ ఏర్పాటయ్యాక టీఆర్‌ఎస్ సర్కారు ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై సమీక్షించింది. జూరాల నుంచి రోజుకు 1.50 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదని గుర్తించి.. శ్రీశైలం నుంచి నీటిని తీసుకునేలా రీడిజైన్ చేసింది. తీసుకునే నీటిని రోజుకు 2 టీఎంసీలకు, ఆయకట్టును 12.30 లక్షల ఎకరాలకు పెంచింది. వెయ్యి గ్రామాలకు మంచినీటిని అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రిజర్వాయర్లను మార్చి.. కేపీ లక్ష్మీదేవిపల్లి, ఉద్దండాపూర్, కర్వెన, వెంకటాద్రి, వీరాంజనేయ, అంజనగిరి రిజర్వాయర్లను ప్రతిపాదించింది. మొత్తంగా వీటి కింద 3 గ్రామాలు, 20 తండాల పరిధిలో 24,084 ఎకరాల భూమి, 2,374 కట్టడాలు ముంపుకు గురవుతోంది.

# మళ్లీ కారుదే హవా

(మొదటిపేజీ తరువాయి)

మద్దతుదారులు 217, కాంగ్రెస్ 40, టీడీపీ 26, ఇతరులు 60 పంచాయతీల్లో గెలిచారు. మెదక్ జిల్లాలో మొత్తం 550 సీట్లకు టీఆర్‌ఎస్ మద్దతుదారులు 416, కాంగ్రెస్ బలపర్చినవారు 96, ఇతరులు 38 చోట్ల గెలుపొందారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 564 పంచాయతీలకు టీఆర్‌ఎస్ 369, కాంగ్రెస్ 144, ఇతరులు 51 సీట్లలో విజయం సాధించారు. కరీంనగర్ జిల్లాలో 386 పంచాయతీలకు టీఆర్‌ఎస్ బలపర్చినవారు 244, కాంగ్రెస్ 60, ఇతరులు 82 చోట్ల గెలిచారు. నిజామాబాద్ జిల్లాలో 333 సీట్లకు టీఆర్‌ఎస్ బలపర్చినవారు 206, కాంగ్రెస్ మద్దతుదారులు 87, ఇతరులు 40 స్థానాల్లో గెలిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 537 పంచాయతీల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులు 390, కాంగ్రెస్ మద్దతుదారులు 111, ఇతరులు 36 చోట్ల గెలుపొందారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 546 పంచాయతీలకుగాను టీఆర్‌ఎస్ బలపర్చినవారు 373, కాంగ్రెస్ 72, ఇతరులు 101 స్థానాల్లో విజయం సాధించారు. రంగారెడ్డి జిల్లాలో 377 పంచాయతీలకుగాను టీఆర్‌ఎస్ బలపర్చినవారు 188 చోట్ల, కాంగ్రెస్ మద్దతుదారులు 116, ఇతరులు 73 పంచాయతీల్లో గెలిచారు.

**భారీగా పోలింగ్**

రెండో విడతలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం 3,342 పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 88.85 % పోలింగ్ నమోదైంది. 42,79,277 మంది ఓటర్లకుగాను 37,76,797 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా 93.71 %, జగిత్యాలలో అత్యల్పంగా 80.23 % ఓటింగ్ జరిగింది. జనగామ, కామారెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదవడం గమనార్హం.

**ఒక్క ఓటు గెలిపించింది**

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం అయ్యపల్లి తండాలో దేవసోత్ జీల్యా ఒక్క ఓటు మెజార్టీతో సర్పంచ్‌గా గెలిచారు. ఇక్కడ 281 ఓట్లు పోలవగా జీల్యాకు 141 ఓట్లు, ప్రత్యర్థి రూప్‌సింగ్‌కు 140 ఓట్లు వచ్చాయి. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గుర్రాలకుంట సర్పంచ్‌గా టీఆర్‌ఎస్ మద్దతుదారు జానకి ఒక్క ఓటుతో తేడాతో గెలిచారు.

**డ్రాతో గెలిచారు**

రాష్ట్రంలోని పలుచోట్ల సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చాయి. దాంతో డ్రా పద్ధతిలో విజేతను నిర్ణయించారు. ఇలా జరిగిన ఒకటి రెండు చోట్ల ఓడినవారు ఆందోళనకు దిగగా.. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా(కె)లో టీఆర్‌ఎస్ మద్దతుదారు పారిశెట్టి సంగమ్మ, బీజేపీ బలపర్చిన అభ్యర్థి మాలిపటేల్ పుష్ప ఇద్దరికీ 504 చొప్పున ఓట్లు వచ్చాయి. దాంతో డ్రా తీయగా సంగమ్మను అదృష్టం వరించింది. ఇక ఇదే జిల్లా కల్హేర్ మండలం జంమ్లి తండాలోనూ బలరాంనాయక్, మంగ్లిబాయికీ సమానంగా 197 ఓట్లు వచ్చాయి. డ్రాతీయగా బలరాం ఎన్నికయ్యారు.

# విజ్డమ్ గోల్ మాల్

## విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం



పోలీసుల అదుపులో ఉద్యోగులు

**హైదరాబాద్, వెలుగు:** ఆన్‌లైన్ జాబ్‌పోర్టల్స్ పెట్టి నిరుద్యోగులను టార్గెట్ చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఊదరగొట్టారు. సర్వీస్ చార్జీలంటూ ఒక్కొక్కరి నుంచి వేల రూపాయలు వసూలు చేశారు. తర్వాత ఉద్యోగం వచ్చిందంటూ ఎర వేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సెక్యూరిటీ డిపాజిట్ అంటూ ఒక్కొక్కరి దగ్గర రూ. 30 వేల నుంచి లక్ష రూపాయల దాకా పిండుకున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు సుమారు లక్ష మందిని మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. విజ్డమ్ ఐటీ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట తొమ్మిదేళ్లుగా జరుగుతున్న దందా ఇది. ఈ సంస్థ చేతిలో మోసపోయిన ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు మొత్తం వ్యవహారాన్ని బయటికి లాగారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ శుక్రవారం ఈ వివరాలు వెల్లడించారు.

**ఆకర్షణీయమైన వెబ్‌సైట్లతో..**

ప్రకాశం జిల్లా పర్చూరుకు చెందిన అజయ్ కొల్లా ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. 2009లో విజ్డమ్ ఐటీ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఐటీ సేవలు ప్రారంభించాడు. 2011లో అదే పేరుతో ఓ కంపెనీని రిజిస్టర్ చేసుకున్నాడు. ఇండియాతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రచారం చేసుకున్నాడు. ఇందుకోసం www.wisdomjobsindia.com, www.wisdomjobsgulf.com పేర్లతో రెండు జాబ్ వెబ్ పోర్టళ్లను ఏర్పాటు చేశాడు. వేర్వేరు భాషల్లో మంచి స్కిల్స్ ఉన్నవారిని టెలికాలర్లుగా, ఇతర ఉద్యోగాల్లో నియమించుకున్నాడు. తమ వెబ్‌పోర్టల్స్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలను సేకరించి గాలం వేయడమే ఈ టీమ్ పని.

**ఉద్యోగాలన్నీ ఉత్తవే..**

ఈ పోర్టళ్లు ఏ సంస్థ నుంచీ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ వివరాలు తీసుకోవు. ఆన్‌లైన్‌లో పేరున్న పెద్ద జాబ్ పోర్టల్స్ నుంచి ఉద్యోగాల వివరాలను కాపీ చేసి, ఈ వెబ్‌సైట్లలో పెడతారు. పోర్టళ్లలో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆయా ఉద్యోగాల కోసం అప్లై చేసుకోవచ్చంటూ ఆప్షన్ ఇస్తారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఫోన్లు చేస్తారు, మెయిల్స్ పంపుతారు. కంపెనీలు మీ ప్రొఫైల్‌పై ఇంట్రెస్ట్ చూపిస్తున్నాయంటూ.. రెజ్యూమెలను ఫార్వర్డ్ చేయడం, ప్రొఫైల్‌ను యాక్టివ్ చేయడం వంటి సర్వీసుల పేర్లు చెబుతూ డబ్బులు గుంజుతారు. తర్వాత ఆయా కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్ల పేరిట ఫోన్లలోనే నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఉద్యోగానికి ఎంపికైనట్లేనని నమ్మిస్తారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సెక్యూరిటీ డిపాజిట్ అంటూ వేలకు వేలు వసూలు చేస్తారు. ఉద్యోగంలో చేరాక ఈ సొమ్ము తిరిగిస్తారంటూ మభ్యపెడతారు. ఇది నమ్మి అభ్యర్థులు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేశాక ఉలుకూపలుకూ లేకుండా పోతారు.

**పక్కా ప్రొఫెషనల్‌గా..**

వెబ్ పోర్టల్‌లో సర్వీసెస్, యాక్టివ్ ప్రొఫైల్ పేరిట డబ్బులు వసూలు చేయడం దగ్గరి నుంచి, నకిలీ ఇంటర్వ్యూల దాకా అంతా పక్కా ప్రొఫెషనల్‌గా నడిపించడం గమనార్హం. దీంతో ఏళ్లుగా వేలాది మంది మోసపోతున్నా విషయం పెద్దగా బయటికి రాలేదు. విజ్డమ్ కెరీర్ సర్వీస్ అడ్వైజర్లుగా చెప్పుకునే టెలికాలర్లుగా పనిచేసేందుకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారిని పెట్టుకున్నారు. నకిలీ ఇంటర్వ్యూల కోసమైతే ఏకంగా ఆయా ఉద్యోగాలకు సంబంధించిన రంగాల్లో పూర్తి అవగాహన ఉన్నవారిని నియమించుకున్నారు. వారు ఇంటర్వ్యూ అడిగే అంశాలన్నీ కూడా.. డైరెక్ట్‌గా ఇంటర్వ్యూ చేసే ప్రొఫెషనల్స్ కంటే బెటర్‌గా ఉన్నాయని విజ్డమ్ సంస్థ చేతిలో మోసపోయినవారు చెబుతున్నారు. కేవలం సర్వీసెస్, ప్రొఫైల్ కోసమే ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకున్నారు. నకిలీ ఇంటర్వ్యూల తర్వాత అయితే రూ.30 వేల నుంచి లక్ష రూపాయల దాకా వసూలు చేశారు. ఇలా తొమ్మిదేళ్లుగా అజయ్ కొల్లా ముఠా దందా సాగిస్తూనే ఉంది. గల్ఫ్ దేశాలు సహా తొమ్మిది దేశాల వారు ఈ జాబ్ పోర్టల్ మోసానికి గురయ్యారు.

**లక్ష మందికిపైగా బాధితులు**

హైదరాబాద్‌కు చెందిన ఏడుకొండలు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫోన్ నంబర్లు, బ్యాంకు అకౌంట్ల ఆధారంగా మాదాపూర్ అడ్డాగా సాగుతున్న విజ్డమ్ చీటింగ్ దందాను బయటపెట్టారు. మొత్తంగా రూ.70 కోట్లకుపైగా మోసం జరిగినట్లు గుర్తించారు. 69,962 మంది నుంచి సర్వీసెస్ ఫీజు పేరిట రూ.30 కోట్లు, ఉద్యోగం వచ్చిందంటూ సెక్యూరిటీ డిపాజిట్ అంటూ సుమారు 35 వేల మంది నుంచి రూ.40 కోట్లకుపైగా వసూలు చేసినట్టు అంచనాకు వచ్చారు. బాధితుల్లో మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు, గల్ఫ్ దేశాలు, ఆఫ్రికా, శ్రీలంక, మలేషియా దేశాల వారూ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు అజయ్ కొల్లాతోపాటు టీమ్ లీడర్లు, ఆపరేషన్ మేనేజర్లుగా వ్యవహరించిన సయ్యద్ మజార్, రోహిత్, బస్వరాజ్ నయకొడి, గోపినాథ్ సురెడ్డి, రాజేష్, శుభంకుమార్ సింగ్, సామ్రాట్ పందుగుల, నితిన్ జైన్, మధురి విపురి, కార్తీక్ కుమార్, కంకమేని శమికంట, రవికిరణ్, శ్రీకాంత్‌లను అరెస్ట్ చేశామని, రూ.23 లక్షల నగదు సీజ్ చేశామని వెల్లడించారు.

**నిరుద్యోగులకు వల**

హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన గన్నవరం ఏడుకొండలు అనే యువకుడు విజ్డమ్ గల్ఫ్ జాబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, రెజ్యుమె అప్‌లోడ్ చేశాడు. రెండు, మూడు రోజుల తర్వాత విజ్డమ్ జాబ్స్ పోర్టల్ ఎగ్జిక్యూటివ్ మౌనికారెడ్డి అని చెబుతూ ఏడుకొండలుకి ఫోన్ కాల్ వచ్చింది. గల్ఫ్ దేశాల్లోని కంపెనీలు ఏడు కొండలు ప్రొఫైల్‌పై ఇంట్రెస్ట్ చూపాయని, వాటికి రెజ్యూమెను ఫార్వర్డ్ చేయడం, ఇతర పనుల కోసం 150 డాలర్లు (సుమారు రూ.10 వేలు) సర్వీస్ చార్జీలు చెల్లించాలని.. త్వరలో ఆ కంపెనీల నుంచి కాల్ వస్తుందని చెప్పింది. దీంతో ఏడుకొండలు ఆన్‌లైన్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొద్దిరోజులకు విజ్డమ్ కంపెనీ నుంచి ఏడుకొండలుకు మరో కాల్ వచ్చింది. గల్ఫ్‌లో మంచి పేరున్న రావన్ జనరల్ పెట్రోలియం కంపెనీలో ఉద్యోగ అవకాశం వచ్చిందని చెప్పారు. ఆ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ యాంజెలా బోస్ పేరిట 40 నిమిషాల పాటు ఏడుకొండలును నకిలీ ఇంటర్వ్యూ చేశారు. తర్వాత కాల్ చేసి సీనియర్ ఇంజనీర్‌గా సెలెక్ట్ అయ్యారని చెప్పారు. అయితే జెస్సీ పేరుతో మరో కాల్ వచ్చింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, సెక్యూరిటీ డిపాజిట్ కింద 525 డాలర్లు (సుమారు రూ.37 వేలు) చెల్లించాలని ఎగ్జిక్యూటివ్ కోరింది. ఉద్యోగం వచ్చిందన్న సంతోషం తో ఉన్న ఏడుకొండలు వారు చెప్పిన అకౌంట్‌కు ఆ సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేశాడు. కానీ తర్వాత విజ్డమ్ పోర్టల్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. విజ్డమ్ ప్రతినిధులను కలవాలని ప్రయత్నించినా ఎవరూ అందుబాటులోకి రాలేదు. మోసపోయానని గ్రహించి సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఎస్.చంద్రశేఖర్ రెడ్డి (ఐపీఎస్) ఎస్పీ, రంగారెడ్డి | మధుసూదన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ, ఏసీబీ | డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం | వీ.సూర్యచంద్ర రావు, డీఎస్పీ, ఎస్‌సీఆర్‌బీ, సీఐడీ | ఇ.రామచంద్రారెడ్డి, డీసీపీ, రాచకొండ

# ఉత్తమ సేవలకు మెడల్స్

**హైదరాబాద్, వెలుగు:** ఉత్తమ సేవలందించిన 17 మంది పోలీస్ ఉన్నతాధికారులు ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం), ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ (పీపీఎం)కు ఎంపికయ్యారు. ఇందులో జైళ్ల శాఖ సిబ్బంది ముగ్గురున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా వీరంతా ఈ రోజు మెడల్స్ అందుకోనున్నారు.

**ఎంపికైన పోలీస్ అధికారులు**

**పీపీఎం మెడల్**

- మధుసూదన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ, ఏసీబీ

**ఐపీఎం మెడల్**

- ఎస్.చంద్రశేఖర్ రెడ్డి (ఐపీఎస్) ఎస్పీ, రంగారెడ్డి
- ఎం.నారాయణ, ఎస్పీ, సీఐడీ
- ఎస్. ఫ్రాన్సిస్, అసాల్ట్ కమాండర్, గ్రే హౌండ్స్
- బీ.రాంప్రకాశ్, కమాండెంట్ 15వ బెటాలియన్
- ఇ.రామచంద్రారెడ్డి, డీసీపీ, రాచకొండ
- డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ, భద్రాది
- ఎస్.ప్రభాకర్ రావు, డీఎస్పీ ఎఫ్‌పీబీ, సీఐడీ
- వీ.సూర్యచంద్ర రావు, డీఎస్పీ, ఎస్‌సీఆర్‌బీ, సీఐడీ
- ఖాజామోహినుద్దీన్, ఎస్ఐ, సీఎస్‌బీ, వరంగల్
- సయ్యద్ మఖ్బుల్, ఎస్ఐ, సీఎస్‌బీ, వరంగల్
- అలీఖాన్ ముఖ్తార్, ఏఆర్ ఎస్ఐ, ఇంటెలిజెన్స్
- జీఎల్. నరసింహారావు, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్
- మహ్మద్ అజీజుద్దీన్, పీసీ 716 ఏసీబీ, వరంగల్

**పీపీఎం మెడల్స్ (జైళ్ల శాఖ)**

- సయ్యద్ ఖాజాపాషా, హెడ్‌వార్డర్, చర్లపల్లి
- ముఖ్లేశ్వర్, చీఫ్ హెడ్‌వార్డర్ (రిటైర్డ్), నల్గొండ
- వెంకటేశ్వర్లు, చీఫ్ హెడ్‌వార్డర్, మహబూబాబాద్ సబ్ జైలు

# పరమ విశిష్ట 'రావత్'

- ఆర్మీ చీఫ్‌కు అత్యున్నత శాంతి పురస్కారం
- ఇద్దరికి కీర్తి చక్ర, తొమ్మిది మందికి శౌర్య చక్ర



ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్‌కు దేశ అత్యున్నత మిలటరీ పురస్కారం(శాంతి సమయంలో) పరమ విశిష్ట సేవా మెడల్(పీవీఎస్ఎమ్) లభించింది. ఆయనతో పాటు మరో 18 మంది ఆర్మీ సీనియర్ ఆఫీసర్లకు రక్షణ శాఖ పీవీఎస్ మెడల్‌ను ప్రకటించింది. జాట్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ తుషార్ గౌబాను, 22వ రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన సోవార్ విజయ్ కుమార్‌ను మరణానంతరం రక్షణ శాఖ కీర్తి చక్ర అవార్డుతో గౌరవించనుంది. కీర్తి చక్ర దేశ రెండో అత్యున్నత గ్యాలెంట్రీ అవార్డు. శాంతి సమయంలో దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన వారికి దీన్ని అందజేస్తారు. తొమ్మిది మందికి శౌర్య చక్ర, ముగ్గురికి ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్‌ను రక్షణ శాఖ అందించనుంది. మరో 32 మంది ఆర్మీ ఆఫీసర్లకు అతి విశిష్ట సేవా మెడల్‌ను, తొమ్మిది మందిని యుద్ధ సేవా మెడల్‌తో సత్కరించనుంది. 103 మంది ఆర్మీ ఆఫీసర్లను సేనా మెడల్(గ్యాలెంట్రీ)తో, 74 మందిని విశిష్ట సేవా మెడల్‌తో, మరో 35 మంది సేనా మెడల్(విశిష్ట పురస్కారం)తో రక్షణ శాఖ గౌరవించనుంది.

# ద్వేషించను.. పోరాడతా

## మోడీపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



పరివర్తన్ సంకల్ప్ సమావేశంలో రాహుల్‌గాంధీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**భువనేశ్వర్:** ప్రధాని నరేంద్రమోడీపై పోరాటం చేస్తాను కాని ఆయనను ద్వేషించనని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ అన్నారు. '' ఆయన (ప్రధాని మోడీ) నాతో ఏకీభవించకపోవచ్చు. నేను ఆయనతో ఏకీభవించకపోవచ్చు. అయితే నేను ఆయనతో పోరాడతాను. అంతేకాని ఆయన అంటే నేను ద్వేషించను . సొంత అభిప్రాయాలు ఉండే హక్కు ఆయనకు ఉంది'' అని రాహుల్ అన్నారు. '' ది ఒడిశా డైలాగ్'' పేరుతో భువనేశ్వర్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

''కాంగ్రెస్ పార్టీతో మోడీ అప్‌సెట్ అయినట్టు నాకు అర్థమైంది. అయితే ఆయనపై మాకు కోపం లేదు. కోపం, ద్వేషం మా విధానం కాదు'' అని రాహుల్ చెప్పారు.

**సర్కార్‌పై ఆర్ఎస్ఎస్ ముద్ర**

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ఆర్ఎస్ఎస్ ముద్ర స్పష్టంగా ఉందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. మోడీ సర్కార్ లోని మంత్రుల్ని కూడా ఆర్ఎస్ఎస్ నియంత్రిస్తోందని అన్నారు. బీజేపీకి తల్లిలాంటి ఆర్ఎస్ఎస్ తాను మాత్రమే దేశంలో ఉన్న ఏకైన సంస్థ అని భావిస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం జ్యుడిషియరీ, విద్య సహా అన్ని రంగాల్లోనూ చొచ్చుకుపోడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వికేంద్రీకరణ, సంస్థల స్వతంత్రతను తాము గౌరవిస్తామన్నారు. విద్య, హెల్త్‌కేర్ రంగాల్లో ఇప్పుడు అమలవుతున్న విధానాలను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని రాహుల్ చెప్పారు.

**ఒడిశా సీఎం మోడీ చేతిలో రిమోట్ కంట్రోల్**

ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ ప్రధాని నరేంద్రమోడీ చేతిలో రిమోట్ కంట్రోల్‌గా ఉన్నారని రాహుల్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే ఒడిశాలో రైతులకు రుణమాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**వరుణ్‌గాంధీ రాక.. నాకు తెలీదు**

బీజేపీ నాయకుడు, సోదరుడు వరుణ్‌గాంధీ కాంగ్రెస్ చేరుతారన్న వార్తలపై రాహుల్ గాంధీ స్పందించారు. ''ఈ విషయం తనదాకా రాలేదని'' ఆయన చెప్పారు. ప్రియాంక గాంధీ క్రియాశీలక రాజకీయాల్లోకి రావడంతో.. వరుణ్‌గాంధీ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరతారంటూ ఊహాగానాలు వినిపించాయి. ఈనేపథ్యంలో గాంధీ, నెహ్రూ కుటుంబం మళ్లీ ఒకటవుతుందా అంటూ భువనేశ్వర్ లో మీడియా అడిగిన ప్రశ్నకు రాహుల్ క్లారిటీ ఇచ్చారు. వరుణ్‌గాంధీ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ బీజేపీ ఎంపీగా ఉన్నారు. ఆయన తల్లి మేనకా గాంధీ కేంద్రమంత్రిగా ఉన్నారు.

### 'ప్రియాంక ఎంపిక ఏళ్ల కిందటి నిర్ణయం'

ప్రియాంక గాంధీ పొలిటికల్ ఎంట్రీ ఇప్పటికిప్పుడు తీసుకున్ననిర్ణయం కాదని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన కొన్ని సంవత్సరాల క్రితం తీసుకున్నదని ప్రకటించారు. ఒడిశాలో పర్యటనలో భాగంగా భువనేశ్వర్ టౌన్‌హాల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న రాహుల్ ..తన చెల్లెలు రాజకీయ ఆరంగేట్రంపై తొలిసారిగా మాట్లాడారు. ''నేను, నా చెల్లి చాలా కష్టాల్ని అనుభవించాం. గొప్ప కుటుంబం నుంచి వచ్చాం కదా మాకేంట్లే అని చాలా మంది అనుకుంటారు. అది మా విషయంలో మాత్రం నిజం కాదు. మా నాన్న, నాన్నమ్మ హత్యకు గురయ్యారు. రాజకీయంగా ఎన్నో నష్టాల్ని అనుభవించాం. అదే మా ఇద్దర్ని మరింత దగ్గరికి చేర్చింది.'' అని రాహుల్ వివరించారు. ప్రియాంక గాంధీ ఈ మధ్యనే కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులవ్వడమేకాదు... ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత బాధ్యతల్ని కూడా స్వీకరించడం తెలిసిందే.



రాహుల్ గాంధీ టూర్‌ను కవర్‌చేసే డ్యూటీలో ఉన్న ఫొటోగ్రాఫర్ అనుకోకుండా మెట్లమీంచి కిందపడ్డాడు. క్షణాల్లో స్పందించిన కాంగ్రెస్ చీఫ్ అమాంతం కిందకుదిగి అతడ్ని లేవనెత్తడానికి సాయపడ్డారు. తనను లేవనెత్తింది రాహుల్ అని ఆతర్వాత తెలిసి ఫొటోగ్రాఫర్ ఆశ్చర్యపడ్డాడు. ఈ ఘటన ఒడిశాలోని భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగింది.

### రాహుల్ చైనా మంత్రుల కామెంట్స్‌పై రగడ!

గత ఏడాది కైలాస్ మానస సరోవర్ టూర్‌లో తాను ఇద్దరు చైనా మంత్రుల్ని కలిసి ఉద్యోగాల పెంచే అంశంపై చర్చించానంటూ రాహుల్ గాంధీ భువనేశ్వర్‌లో చేసిన కామెంట్స్ వివాదాస్పదమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వానికి ఎందుకు సమాచారం ఇవ్వలేదని బీజేపీ ఆయనను నిలదీసింది. భువనేశ్వర్ ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ, ''మనం చైనాతో పోటీపడాలి. ఉద్యోగాల్ని అసంఖ్యాకంగా సృష్టిస్తున్న చైనా సామర్థ్యం నిజంగా మనకు గట్టిపోటీ అని అంగీకరించాల్సిందే. కైలాస్ మానససరోవర్ యాత్ర సందర్భంగా నేను కొంతమంది చైనా మంత్రులతో ఉద్యోగాలు ఎలా కల్పించాలన్నదానిపై చర్చించాను'' అని అన్నారు. మరోవైపు, చైనా మంత్రులతో భేటీని తాము ఏర్పాటుచేయలేదని విదేశీ మంత్రిత్వశాఖ అధికారులు చెప్పారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా ఘాటుగా స్పందించారు. ''తన కైలాస్ టూర్‌లో చైనా మంత్రులనుగాని, అధికారులనుగాని కలవనని రాహుల్‌గాంధీ అంతకుముందు చెప్పారు. టూర్‌లో మంత్రుల్ని కలిశానని ఈరోజు చెబుతున్నారు. దీనిపై విదేశీమంత్రిత్వశాఖకు ఆయన ఎందుకు సమాచారం ఇవ్వలేదు.?'' అని ఆయన ప్రశ్నించారు.



శుక్రవారం రాజ్‌పత్ దగ్గర జవాన్ల గస్తీ

# ఢిల్లీలో హై అలర్ట్

- ఇద్దరు జైష్ ఏ మహమ్మద్ టెర్రరిస్టుల అరెస్టుతో సెక్యూరిటీ కట్టుదిట్టం
- 25 వేల మంది సిబ్బందితో పహారా
- ఫేస్ రికగ్నిషన్ కెమెరాలు, స్నిపర్స్‌తో పోలీసుల పర్యవేక్షణ

**న్యూఢిల్లీ:** రిపబ్లిక్ డే సందర్భంగా దేశరాజధాని ఢిల్లీ నగరంలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో విధ్వంసం సృష్టించేందుకు కుట్రపన్నిన ఇద్దరు జైష్ ఏ మహమ్మద్ గ్రూప్ టెర్రరిస్టులను గురువారం అర్ధరాత్రి ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అబ్దుల్ లతీఫ్, అలియాస్ దిలావర్(29), హిలాల్ అహ్మద్ భట్ (26) జమ్మూకాశ్మీర్‌కు చెందిన వారిగా గుర్తించారు. లజ్‌పత్‌నగర్ మార్కెట్, హజ్‌మంజిల్, తుర్కమన్, పహర్‌గంజ్, ఇండియా గేట్ పరిసర ప్రాంతాల్లో పేలుళ్లు జరిపేందుకు టార్గెట్‌గా చేసుకుని నిందితులు రెక్కీ నిర్వహించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో ఢిల్లీ నగరాన్ని సెక్యూరిటీ సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ, ఎన్ఎస్‌జీ కమాండోలను మోహరించారు. 25వేల మంది సిబ్బందితో సెంట్రల్ ఢిల్లీలో అడుగడుగునా సెక్యూరిటీ ఏర్పాటు చేశారు.

**నిఘా నీడలో**

రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ఆత్మాహుతి దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఫేస్ రికగ్నిషన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ విభాగం నుంచి 36మంది మహిళా కమాండోలు భద్రతా ఏర్పాట్లలో పాల్గొంటున్నారు. మొబైల్ హిట్ బృందాలు, యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ స్నిపర్స్, షార్ప్ షూటర్లను రాజ్‌పథ్ నుంచి ఎర్రకోట వరకు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా ఏర్పాటు చేశామని ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అనుమానాస్పద ఫ్లైయింగ్ వస్తువులను గుర్తించేలా యాంటీ డ్రోన్ టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నామన్నారు. పరేడ్ మార్గంలో ప్రజల కదలికల్ని గమనించేందుకు వందలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, రద్దీగా ఉండే మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేశామన్నారు.

# 51 కాదు, 17 మందే

## మహిళల శబరిమల దర్శనంపై కేరళ ప్రభుత్వం అఫిడవిట్

**తిరువనంతపురం:** సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో 50 ఏళ్ల లోపు మహిళలు ఇంత వరకు కేవలం 17 మంది మాత్రమే శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారని కేరళ ప్రభుత్వం స్పష్టంచేసింది. 51 మంది మహిళలు శబరిమలకు వెళ్లారని ఇంతకుముందు సుప్రీం కోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌ను ఈ మేరకు సవరించింది. కేరళ చీఫ్‌సెక్రటరి టామ్‌జోస్‌నేతృత్వంలోని ప్యానల్‌ఇంతకు ముందు ఇచ్చిన నివేదికను సవరించి కొత్త రిపోర్టును అందించిందని వార్తలొచ్చాయి. గతంలో ఇచ్చిన నివేదికలో నలుగురు పురుషుల పేర్లు ఉన్నాయని, మిగతా 30 మంది యాభైఏళ్లు పైబడిన మహిళలే అని రిపోర్టులో చెప్పారు. దీంతో 34 మంది పేర్లను లిస్ట్‌నుంచి తొలగించామని అధికారులు చెప్పారు. సమయాభావం వల్లే సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తప్పులు వచ్చాయని ప్యానల్ చెప్పింది. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత మొదటిసారి శబరిమల ఆలయాన్ని దర్శించుకున్న బిందు , కనకదుర్గ అనే మహిళలు తమకు సెక్యూరిటీ కావాలని గతంలో సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు తీర్పు తర్వాత 51 మంది మహిళలు అయ్యప్పను దర్శించుకున్నారని పిటిషన్ ను విచారించే సమయంలో కేరళ ప్రభుత్వం కోర్టుకు లిస్ట్ సమర్పించింది.




# ఈబీసీ కోటాపై స్టేకు సుప్రీం నో

## కేంద్రానికి నోటీసులు

**న్యూఢిల్లీ:** పెద్ద కులాలోని పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంపై స్టే ఇచ్చేందుకు సుప్రీం నో చెప్పింది. చట్టానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో దాఖలైన పలు పిటిషన్లను కోర్టు శుక్రవారం విచారించింది. దీనిపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన బెంచ్ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పెద్ద కులాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. దాన్ని వ్యతిరేకిస్తూ యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే సంస్థతో పాటు మరో ముగ్గురు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రిజర్వేషన్లు యాభై శాతం దాటకూడదని రాజ్యాంగంలో ఉందని, ఈ చట్టం దాన్ని అతిక్రమిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# నేషనల్ ఎమర్జెన్సీ డ్రాఫ్ట్ రెడీ

- అక్రమ వలసలతో ముప్పు తప్పదు
- బోర్డర్‌లో గోడ కట్టాల్సిందే
- ఇతర మార్గాలనూ పరిశీలిస్తున్నాం: డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికాలో నేషనల్ఎమర్జెన్సీ ప్రకటించేందుకు ట్రంప్ సర్కారు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసిందని ఇంటర్నేషనల్ మీడియా వెల్లడించింది. బోర్డర్ వాల్‌కు నిధులు సమకూర్చడంతో పాటు దేశంలో షట్‌డౌన్‌ను ఎత్తివేసేందుకు ట్రంప్ సర్కారు ఈ మార్గాన్ని ఎంచుకుందని తెలిపింది. నేషనల్ ఎమర్జెన్సీ డిక్లరేషన్ కు సంబంధించి మీడియాలో వస్తున్న వార్తలను ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఖండించని విషయాన్ని ప్రస్తావించింది. ఈ విషయంలో ట్రంప్ సలహాదారులు మాత్రం భిన్నాభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. బోర్డర్ వాల్‌కు నిధుల మంజూరుకు ఇతరత్రా మార్గాలున్నాయని చెబుతున్నారు.

**డ్రాఫ్ట్ లో ఇలా..**

'రోజూ అక్రమంగా బోర్డర్ దాటి దేశంలోకి అడుగుపెడుతున్న వారితో దేశభద్రతకు ముప్పు పొంచి ఉంది. ఇది నేషనల్ ఎమర్జెన్సీకి దారితీయొచ్చు. దీనిని అడ్డుకోవడానికి బోర్డర్‌వాల్ నిర్మించాల్సిందే. గోడ నిర్మాణానికి ప్రజలతో పాటు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కూడా అనుకూలమే. అక్రమ వలసలను సమర్థంగా అడ్డుకోవడానికి డొనాల్డ్ ట్రంప్ అనే నేను అమెరికా ప్రెసిడెంట్‌గా రాజ్యాంగం నాకిచ్చిన అధికారానికి, నేషనల్ ఎమర్జెన్సీ యాక్ట్ పరిధికి లోబడి, సదరన్ బోర్డర్‌లో ఎమర్జెన్సీ ప్రకటిస్తున్నాను'

**పరిశీలనలో ఉన్న మార్గాలు**

బోర్డర్‌వాల్‌కు నిధుల మంజూరుకు కాంగ్రెస్ అంగీకరించకపోవడంతో ట్రంప్ సర్కారు ఇతరత్రా మార్గాలను పరిశీలించింది. ట్రెజరీ ఫోర్ ఫీచర్ ఫండ్స్ నుంచి 681 మిలియన్ డాలర్లు, మిలటరీ కన్‌స్ట్రక్షన్ కింద 3.6 బిలియన్‌డాలర్లు, పెంటగాన్ సివిల్ వర్క్స్ ఫండ్స్ నుంచి 3 బిలియన్ డాలర్లు, హోంలాండ్ సెక్యూరిటీ ఫండ్స్ నుంచి 200 మిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

### ఇండోనేషియా వరదల్లో.. 59కి చేరిన మృతులు

**మకాస్సార్:** ఇండోనేషియాలో వరద బీభత్సం ఆడగంలేదు. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటి వరకు 59 మంది చనిపోయినట్లు అధికారులు చెప్పారు. మరో 25 మంది గల్లంతయ్యారని, వారి కోసం గాలిస్తున్నామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా ఈసారి వరదలు వచ్చాయన్నారు. సదరన్ సులావెసీ ప్రాంతంలోని 11 జిల్లాలపై వరద ప్రభావం ఎక్కువగా ఉంది. దాదాపు 3,400 మంది కట్టుబట్టలతో మిగిలారు. గొవా జిల్లాలోనే 44 మంది చనిపోయినట్లు అధికారులు చెప్పారు. డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునగడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# అది వాళ్లిష్టం

## అద్వానీ, జోషీ పోటీపై బీజేపీ క్లారిటీ



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బీజేపీ సీనియర్ నేతలు ఎల్.కె. అద్వానీ, మురళీ మనోహర్ జోషీ ఈసారి పోటీలో ఉండటమా, లేదా అన్న విషయాన్ని వారికే పార్టీ అధిష్ఠానం వదిలేసినట్టు తెలుస్తోంది. 75 ఏళ్ల వయసు పైబడ్డ పార్టీనేతలు ఎలాంటి పదవుల్లో ఉండకూడదన్న నిబంధన బీజేపీలో ఉంది. దీంతో ఈ ఇద్దరు సీనియర్ల భవిష్యత్తుపై కొంతకాలంగా రకరకాల ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఎన్నికల్లో పోటీ చేసే అంశాన్ని వాళ్ల ఇష్టాఇష్టాలకు వదిలేస్తున్నట్టు పార్టీ వర్గాలు తాజాగా తెలిపాయి. 75 ఏళ్లు దాటిన వారు మంత్రులుగా మాత్రమే పనిచేయకూడదన్న నిబంధన ఉంది గానీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అది అడ్డు కాదని వివరించాయి. 2014 ఎన్నికల్లో అద్వానీ గుజరాత్ లోని గాంధీనగర్ నుంచి మురళీ మనోహర్ జోషీ ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. జోషీ తన వారణాసి సీటును నరేంద్రమోడీకి వదిలేశారు.

**పోటీచేయబోమంటున్న సుష్మా, ఉమా భారతి**

అనారోగ్య కారణాల వల్ల వచ్చే ఎన్నికల్లో పోటీచేయడంలేదని కేంద్రమంత్రులు సుష్మాస్వరాజ్, ఉమా భారతి ఇప్పటికే ప్రకటించారు. పార్టీ మాత్రం ఈ ఇద్దరి ప్రకటనపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 91 ఏళ్ల అద్వానీ, 84 ఏళ్ల జోషీ లోక్‌సభకు మళ్లీ పోటీ చేయడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. పార్టీ ఎలా కోరుకుంటే అలా చేస్తానని జోషీ మాత్రం తన మనసులోని మాట బయటపెట్టినట్టు ఆయన సన్నిహితులు చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అద్వానీ, జోషీ, శాంతాకుమార్, బీసీ ఖండూరీ గెలిచినా నరేంద్ర మోడీ ప్రభుత్వంలో వాళ్లు ఎలాంటి పదవులు చేపట్టలేదు. అయితే అద్వానీ, జోషీలు సభ్యులుగా పార్టీ కొత్తగా ''మార్గదర్శక్ మండల్''ని ఏర్పాటు చేసింది. పార్టీకి సలహాలు ఇవ్వడానికి మాత్రమే ఈ మండలి పరిమితమైంది. నాలుగన్నరేళ్లలో ఒక్కసారి కూడా భేటీ కాలేదు.

**ప్రభుత్వాన్ని ఇరుకునపెడుతున్న జోషీ**

లోక్‌సభ స్పీకర్ పదవిపై అద్వానీ చాలా ఆశలు పెట్టుకున్నారని చెబుతారు. అయితే ఆ ఆశలు నెరవేరలేదు. జోషీ ఇప్పుడు పార్లమెంటరీ ఎస్టిమేట్స్ కమిటీకి చైర్మన్‌గా ఉంటున్నారు. కొన్ని నెలలుగా ప్రభుత్వ విధానాలను ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారింది. పక్కన పెట్టడంతో సీనియర్ నాయకులు తరచూ పార్టీలో తిరుగుబాటు చేసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడంతో ..నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ అద్వానీ, జోషీ, యశ్వంత్ సిన్హా ( గత ఏడాది పార్టీని వీడారు) ఘాటుగానే లెటర్ రాశారు. ప్రియాంక గాంధీ రాకతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగిన నేపథ్యంలో.. ఉత్తరప్రదేశ్‌లో ఆ పార్టీని సమర్థంగా ఎదుర్కోవాలంటే జోషీ, కల్రాజ్ మిశ్రా లాంటి నాయకులు అవసరమన్న విషయాన్ని పార్టీ గుర్తిస్తోన్నట్టు చెబుతున్నారు. వీళ్లిద్దరూ అగ్రకులాలకు ప్రతినిధులుగా ఉన్నారు. అగ్రకులాల ఓట్లను టార్గెట్ చేయాలని కాంగ్రెస్ భావిస్తున్న సమయంలో ఇలాంటి సీనియర్ల సేవలు తప్పకుండా ఉపయోగించుకునే ఆలోచనలో పార్టీ ఉన్నట్టు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

# ఆయుష్మాన్ 'లేఖ'పై రగడ

- 7.5 కోట్ల లేఖలకు 15 కోట్ల పైనే ఖర్చు
- ప్రభుత్వ ప్రచారం కోసమేనని విమర్శలు
- రాజకీయ ప్రయోజనాలే లక్ష్యమన్న సీపీఎం
- మాటమాత్రమైనా చెప్పలేదు: రాష్ట్ర ప్రభుత్వాలు

**తిరువనంతపురం/న్యూఢిల్లీ:** 'ఆయుష్మాన్ భారత్' ప్రచారం కోసమంటూ ప్రధాని నరేంద్ర మోడీ రాసిన ఇంటింటికీ లేఖ వివాదాస్పదంగా మారింది. దేశంలోని ఏడున్నర కోట్ల కుటుంబాలకు ఈ లేఖలను చేర్చేందుకు 15.75 కోట్లు ఖర్చుపెట్టడంపైన ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ రాజకీయ లబ్ది కోసమే ఈ లేఖలు రాశారని ఆరోపిస్తున్నాయి. బీమా ప్రయోజనాలతో పాటు కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల వివరాలన్నీ ఈ లేఖలో పొందుపరిచారని విమర్శించాయి. ప్రధాని లేఖ పక్కా ఎన్నికల స్టంటేనని సీపీఎం ఆరోపించింది. ప్రధాని మోడీ నేరుగా రాష్ట్ర ప్రజలకు లేఖ రాయడంపై బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ప్రజారోగ్యంకోసం ప్రవేశపెట్టిన 'ప్రధాన మంత్రి జనారోగ్య యోజన' పథకం అమలులోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోడీ ఇటీవల ఇంటింటికీ లేఖ రాశారు. ఈ పథకం ప్రచారంతో పాటు ఇతర పథకాల వివరాలనూ ఈ లేఖలో పేర్కొన్నారు.

**ఎన్నికల్లో లబ్ది పొందేందుకే: సీపీఎం**

లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రధాని మోడీ ఈ ఎన్నికల స్టంట్‌కు తెరతీశారని సీపీఎం విమర్శించింది. ప్రధాని తన లేఖలో కేంద్రం ప్రవేశపెట్టిన అన్ని పథకాలనూ పేర్కొనడమే దీనికి రుజువని ఆరోపించింది. లెటర్లను స్పీడ్‌పోస్ట్ ద్వారా పంపించడంతో ఒక్కో లెటర్‌కు రూ.40 ఖర్చవుతుందని పార్టీ ఎంపీ ఎంబీ రాజేష్‌చెప్పారు. ప్రభుత్వం ఈ బీమా పథకానికి కేటాయించిందే రూ.2 వేల కోట్లని, ఈ లేఖల కోసం డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన నిలదీశారు. అయితే ఈ ఆరోపణలను ఆయుష్మాన్ భారత్ సీఈవో ఇందూ భూషణ్ ఖండించారు. స్థానిక భాషలలో ఈ లేఖలు త్వరలో ఇంటింటికీ చేరనున్నాయని చెప్పారు. ఈ లేఖల ద్వారా బీమా పథకం ప్రయోజనాలను ప్రజలందరూ తెలుసుకుంటారని చెప్పారు. వీటికయ్యే ఖర్చును పరిపాలనా వ్యయం ఖాతాలో చూపిస్తామని, రోగుల కోసం వెచ్చించిన సొమ్మును కదిలించబోమని చెప్పారు.

**పథకం నుంచి తప్పుకున్న బెంగాల్**

ఈ లేఖలపై ప్రధాన మంత్రి జనారోగ్య యోజన అని పేర్కొనడంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తంచేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం తమ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ స్వస్థ్యసాథి పేరుతో అమలు చేస్తున్నామని బెంగాల్ అధికారులు చెప్పారు. ఈ పథకం నుంచి తప్పుకుంటున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి లేఖ రాసింది.

**ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం: బీజేపీ**

ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత దగ్గరికి చేసే ప్రయత్నంలో భాగంగానే ఈ ప్రయత్నం చేశామని బీజేపీ సమర్థించుకుంటోంది. పన్నుల రూపంలో సేకరిస్తున్న సొమ్మును సద్వినియోగం చేస్తున్నామని ఇలా లేఖల ద్వారా చెప్పామంది. దీంతో మరింత మంది నిజాయితీగా పన్నులు కట్టేందుకు ముందుకొస్తారని బీజేపీ ఎంపీ మురళీధరన్ చెప్పారు. వివిధ పథకాల గురించి ప్రజలకు తెలియకపోవడం వల్ల వాటికి కేటాయించిన సొమ్ము ఖర్చుకావడంలేదన్నారు.




### లేఖలో ఏముందంటే..

'నా జీవితంలో పేదరికాన్ని అతి దగ్గరి నుంచి చూశాను. నిరుపేదలను అధికారానికి దగ్గర చేయడం ద్వారా పేదరికాన్ని దూరం చేయొచ్చు. వారిని శక్తిమంతులుగా చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలు నన్ను ప్రధానిగా ఎన్నుకున్నప్పటి నుంచి దీనికోసమే పాటుపడుతున్నాను. వారికి సేవ చేయడానికి వచ్చిన ఏ అవకాశాన్నీ నేను వదులుకోలేదు. సామాన్యులు, మహిళలను ఉన్నత స్థానంలోకి చేర్చడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నా. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణం నుంచి ఆదాయ మార్గాల దాకా, విద్య నుంచి ఆరోగ్యం దాకా ఎన్నో అడుగులు వేశాం' అని లేఖలో పేర్కొన్నారు.



సహస్ర మహా చండీయాగం మొదటి రోజు కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



యాగంలో రెండో రోజు పూజ కార్యక్రమంలో..



సహస్ర చండీయాగంలో మూడోరోజున..



నాలుగో రోజు పూజలో..






# పూర్ణాహుతితో పరిసమాప్తం

- ముగిసిన సహస్ర మహా చండీయాగం
- శాస్త్రోక్తంగా పూజలు చేసిన కేసీఆర్ దంపతులు
- ఎనిమిది మండపాల్లో పూర్ణాహుతి

**హైదరాబాద్/సిద్దిపేట, వెలుగు:** దేశ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన ఐదు రోజుల సహస్ర మహా చండీయాగం పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యింది. చివరి రోజు శుక్రవారం ఎనిమిది మండపాల్లో కేసీఆర్ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు పూర్ణాహుతిలో పాల్గొన్నారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో రుత్వికులు శాస్త్రోక్తంగా క్రతువు ముగించారు. శుక్రవారం రాజశ్యామల, బగలాముఖి, నవగ్రహ, రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద మండపాల్లో తొలుత పూర్ణాహుతి జరిగింది. అనంతరం ప్రధాన యాగశాలైన చండీమాత మండపంలో పూర్ణాహుతి ఆరంభమైంది. బగళాముఖి దేవి మండపంలో జయ పీతాంబర ధారణి, దివ్యవేదోక్త నీరాజనం సమర్పయామి అంటూ పూజలు చేశారు. నవగ్రహ, మహారుద్ర, చతుర్వేద మండపాల్లో సహస్ర శీర్షా, పురుష సంవేద పుష్పమాం, పుష్ప మాలికాం సమర్పయామి అంటూ పూర్ణాహుతి నిర్వహించారు. యాగంలో భాగంగా చేసిన పారాయణాలు, జపాలకు తద్దశాంశ హోమ తర్పణలు నిర్వహించారు. ప్రధాన కలశం అధిష్టాన దేవతా మండపం వద్ద శారదా కల్పవృక్షం అనుసరించి అమ్మవారికి షోడశోపచార పూజలు చేశారు. చతుష్షష్టి యోగినీ బలి, మంగళ నీరాజన సేవ గావించారు. అగ్ని మథనం ద్వారా అగ్రి ప్రతిష్ట చేసి అగ్ని హోమం ఆరంభించారు. వేద పండితులు పాయసం, తెల్ల నువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని ఆహుతులిస్తూ హోమం చేశారు. అనంతరం అష్టదిక్పాలక బలి, ప్రాయశ్చిత హోమాలు చేశారు. చండీ సప్తశతి(700) శ్లోకాల స్వాహాకారాలకు పాయసం, తెల్లనువ్వులు, నెయ్యితో కలిపిన ద్రవ్యాన్ని యజ్ఞ భగవానుడికి సమర్పించారు. చండీయాగ మండపంలోని అన్ని యజ్ఞకుండాల అగ్నిని ప్రధాన యజ్ఞ కుండంలోకి తీసుకువచ్చి మహాపూర్ణాహుతి ఆరంభించారు. పసుపు, కుంకుమ, ఖర్జూర, వక్కలు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, జీడిపప్పు, పటికబెల్లం, బాదం, పచ్చకర్పూరం, గంధకచూరలు, పూలు, పండ్లు, తమలపాకులు, పట్టుచీర, మారేడుకాయ తదితరాలను సమర్పించారు.

**పాయస ద్రవ్య విశేషాలు**

చివరి రోజు చండీమాత యాగశాలలో అగ్నిస్థాపన చేసి హోమం నిర్వహించారు. చండీ సప్తశతి(700) లోని ప్రతి శ్లోకానికి నువ్వులు, నెయ్యి, పాయసాన్ని ఆహుతులు ఇచ్చారు. వెయ్యి కిలోల పాయస ద్రవ్యాన్ని ఇందుకు వినియోగించారు. బియ్యం, నెయ్యి, పాలు, బెల్లం, తేనె, యాలకులు, జీడిపప్పు, కిస్మిస్ తదితర సుగంధ ద్రవ్యాలతో ఈ పాయసం తయారు చేశారు.




## రుత్వికులకు సన్మానం

ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ దంపతులు చండీ సంబంధ అన్నిరకాల ఉపాసనలు చేశారు. శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీ మహా స్వాముల ఆశీస్సులతో యాగంలో మొదటి నాలుగు రోజులు గణపతి సహస్ర మోదక హోమం, రాజశ్యామల మహా మంత్రానుష్టానం, లక్ష బగళాముఖి మహా మంత్రానుష్టానం, వెయ్యి చండీ పారాయణాలు, మహారుద్ర మంత్రాలను అనుష్టానం చేసి దశాంశ హోమ పక్షాన్ని ఆశ్రయించి చండీ మహాయాగ పూర్ణాహుతితో యాగ క్రతువును పరిసమాప్తం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ యాగంలో పాల్గొన్న రుత్వికులను ఘనంగా సన్మానించారు. ఈ యాగానికి శృంగేరి, జీయర్, ఉడిపి పీఠాల నుంచి ప్రత్యేకంగా ప్రసాదాలు వచ్చాయి.

# వైభవంగా జాన్‌పహాడ్ ఉర్సు

**హుజూర్‌నగర్, వెలుగు :** సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో భాగంగా శుక్రవారం గంధం ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. కనుల పండువగా జరిగే గంధం యాత్రలో పాల్గొనడానికి భక్తులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అర్ధరాత్రి వరకు దర్గా వద్దకు చేరుకున్నారు. ఉర్సులో భాగంగా దర్గా పూజారి జానీ మోహినుద్దీన్ ఇంటి నుంచి తీసుకుచ్చిన గంధాన్ని . ఆనవాయితీ ప్రకారం హైదరాబాద్ వక్ఫ్ బోర్డు నుంచి అధికారులు తీసుకువచ్చిన గంధాన్ని సందల్ ఖానాలో కలిపి ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. గంధపు బిందెలను ప్రత్యేకంగా అలకరించిన గుర్రంపై జానపహాడ్ గ్రామ వీధులు, చెర్వుతండా మీదుగా దర్గావరకు పోలీసు బందోబస్తు నడుమ రోప్ పార్టీ సహాయంతో శోభాయాత్ర నిర్వహించారు. గుర్రం మీద వస్తున్న గంధాన్ని తాకడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం హజ్రత్ సయ్యద్ మొహియుద్దీన్, జాన్ పాక షహీద్ రహ్మతుల్లా సమాధులపై ఎక్కించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా వద్ద ఉన్న నాగేంద్రుడు పుట్ట వద్ద పాలు, గుడ్డలు ఉంచి మహిళా భక్తులు పూజలు చేశారు. భక్తులకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా దక్కన్ సిమెంట్ యాజమాన్యం ట్యాంకర్లతో సరఫరా చేసింది. భక్తుల రవాణా సౌకర్యార్థం కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు 30 ప్రత్యేక బస్సులు నడిపారు. ఉత్తమ్, సైదిరెడ్డి ప్రత్యేక పూజలు టీపీసీసీ అధ్యక్షుడు, శాసన సభ్యులు ఉత్తమ్ కుమార్, టీఆర్ఎస్ ఇన్‌చార్జి సైదిరెడ్డి దర్గాలో పూజలు నిర్వహించారు. వేర్వేరుగా గంధపు బిందెలను ఎత్తుకుని దర్గా వరకు ఊరేగింపుగా వచ్చారు. వారివెంట వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సైదా, నేరేడుచర్ల ఎంపీపీ గీతా నాయక్, పూజారి జాని మొయినుద్దీన్, సూపరింటెండెంట్ జబ్బార్ పాల్గొన్నారు.



దర్గాలో గంధం పూజలు చేస్తున్న ఉత్తమ్, సైదిరెడ్డి

# గోదారి దాటొచ్చిన మావోయిస్టులు

**భద్రాచలం,వెలుగు:** తెలంగాణలో మళ్లీ పట్టుసాధించేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు కన్పిస్తోంది. దండకారణ్యం నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల మీదుగా మావోయిస్టు దళాలు రాష్ట్రంలోకి వచ్చినట్టు నిఘావర్గాలు చెప్తున్నాయి. 21 మంది మావోయిస్టుల బృందం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లె దగ్గర కాటన్ ఆనకట్ట మీదుగా గోదారి దాటినట్టు భద్రాద్రి కొత్తగూడెం పోలీసులకు సమాచారం అందింది. దీంతో జిల్లా ఓఎస్డీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు అశ్వాపురం మండలంలోని మావోయిస్టులు తిరిగిన ప్రాంతాల్లో కూంబింగ్ చేశాయి. మావోయిస్టులు మణుగూరు ఏరియాలోనే ఉన్నారని, జిల్లాలో కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్టు, మిషన్ భగీరథ పనులమీద గురి పెట్టినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈనెల 25 నుంచి 31 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడులకు ఆందోళన చేపట్టాలని, జనవరి 31న భారత్‌బంద్‌లో పాల్గొనాలని మావోయిస్టు కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది. బంద్‌కు సంబంధించిన కరపత్రాలు శుక్రవారం అశ్వాపురం, చర్ల మండల కేంద్రంలో పంచిపెట్టారు. అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర, మల్లెల మడుగు మధ్యలో రోడ్డుకు రెండు దిక్కుల పోస్టర్లు అంటించారు.

**యాక్షన్ చేసాకే వెనక్కి..**

మావోయిస్టులు అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచే తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఎన్నికలటైమ్‌లో భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోకి నాలుగు యాక్షన్‌బృందాలు వచ్చాయి. ఎన్నికలు అయిపోయినా వారు ఇక్కడే ఉన్నారని, ఏదైనా యాక్షన్ చేసిన తర్వాతే దండకారణ్యానికి తిరిగి రావాలని వారికి పార్టీ నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మరో 21 మంది జిల్లాకు వచ్చారని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు చర్లలో పోలీసులకు దొరికిన ఒక మావోయిస్టు ద్వారా పోలీసులు మరిన్ని వివరాలు సేకరించినట్టు తెలుస్తోంది. గురువారం రాత్రి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వెంకటాపురం మండలం సూరవీడులో జేసీబీని మావోయిస్టులు తగులబెట్టారు.

**పోలీసుల గన్ డౌన్....?**

మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో పోలీసులు గన్‌డౌన్‌చేసినట్లుగా తెలుస్తోంది. ఎన్‌కౌంటర్లపై వస్తున్న విమర్శలు, అర్బన్ నక్సల్స్ పేరిట అరెస్ట్‌లమీద అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు బలగాలు సంయమనం పాటించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆదేశాలొచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌దండకారణ్యంలో ఎన్‌కౌంటర్లు తగ్గడానికి ఇదే కారణమని ఓ అధికారి చెప్పారు.





- మళ్లీ తెలంగాణలో పట్టు సాధించాలని ఆరాటం
- భద్రాద్రి ఏజెన్సీలోకి 21 మంది సభ్యుల బృందం
- సీతారామ ప్రాజెక్టు, మిషన్ భగీరథలపై గురి
- అప్రమత్తమైన పోలీసులు... ఓఎస్డీ ఆధ్వర్యంలో కూంబింగ్

# టీ కొట్టులో పేలిన సిలిండర్

### మున్సిపల్ కార్మికురాలు మృతి

**మహబూబ్ నగర్, వెలుగు:** గ్యాస్ సిలిండర్ పేలి మున్సిపల్ కార్మికురాలు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో శుక్రవారం జరిగింది. ఆమె వివరాలు ఇంకా తెలియరాలేదు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం టీ కొట్టు దగ్గర మున్సిపల్ సిబ్బంది చెత్తను వేసి నిప్పంటించారు. అదే సమయంలో టీ కొట్ట యజమాని డబ్బాను తెరవడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో పక్కనే ఉన్న షెడ్డులోని కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. నలుగురు మున్సిపల్ సిబ్బంది, టీ కొట్టు యజమానికి గాయాలయ్యాయి. అప్పటికే డబ్బాలో గ్యాస్ లీక్ అయి ఉందని, తెరవగానే మంట దగ్గరలో ఉండడంతో పేలుడు సంభవించిందని చెప్తున్నారు. పేలుడు సంభవించిన విజువల్స్ సీసీ కెమెరాలో రికార్డయ్యింది.



# విచారణకు నేను రెడీ



- నాకేం అభ్యంతరం లేదు.. వ్యక్తిగత ఆరోపణలకు స్పందించను
- 1982 నుంచే ఈవీఎంల వాడకం.. ట్యాంపరింగ్ అసాధ్యం
- సీఈసీ, నా ఓటుపై సమగ్ర దర్యాప్తు: సీఈవో రజత్‌కుమార్

**హైదరాబాద్, వెలుగు:** ఈవీఎంలపై ఆరోపణలు అర్థరహితమని సీఈవో రజత్‌కుమార్ అన్నారు. రాజకీయ పార్టీలు తనపై చేసే వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలకు తాను స్పందించనన్నారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై విచారణకు ఆదేశిస్తే సిద్ధమేనని, ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. 1982 నుంచే దేశంలో ఈవీఎంల వాడకం ఉందన్నారు. ఇటీవల సుప్రీం కోర్టు కూడా వాటి పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ స్పష్టమైన తీర్పునిచ్చిందన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశమేలేదని, నిరూపిస్తామని ఎవరైనా ముందుకు వస్తే ఆహ్వానిస్తామని సీఈవో స్పష్టం చేశారు. ఎన్నికలపై హైకోర్టులో పిటిషన్లు వేయడం రాజకీయ పార్టీల హక్కు అని, ఫలితాలొచ్చిన 45 రోజుల్లోపు పిటిషన్లు వేసుకోవచ్చని చెప్పారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఓటరు నమోదుపై ఇప్పటిదాకా 16 లక్షల వినతులు, అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఓటరు చైతన్యం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఓటర్లకు నేరుగా లేఖలు రాస్తున్నామని, దాదాపు 30 వేల మంది బదులిచ్చారని తెలిపారు. 1950 హెల్ప్‌లైన్ నంబర్‌ను సాంకేతికంగా పటిష్టం చేశామన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి అది పూర్తి స్థాయిలో పనిచేస్తుందన్నారు.

**మా ఓట్లపై దర్యాప్తు**

మాజీ సీఈసీ ఓం ప్రకాశ్ రావత్, తన ఓటు రిజిస్టర్ అయిన విషయం తన దృష్టికి వచ్చిందని రజత్ కుమార్ తెలిపారు. దానిపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి దానకిషోర్‌ను ఆదేశించానని చెప్పారు. పోలీస్ దర్యాప్తుకు ఆదేశించామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 72 మంది అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వలేదన్నారు. దానికి తుది గడువు 26 వరకేనన్నారు. సోషల్‌మీడియా, పత్రికలు, వార్తా చానెళ్లపై ఆంక్షలు పెట్టినా వాటిని నియంత్రించలేకపోతున్నామన్నారు. కోడ్ ఉల్లంఘనలపై ఇప్పటికే నోటీసులూ ఇచ్చామన్నారు. తొలిసారి ఓటు హక్కు పొందినోళ్లు 90 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొంటున్నారన్నారు.

## 15 రోజుల్లో ఎఫ్‌బీవో తుది జాబితా?

### టీఎస్‌పీఎస్సీ సన్నాహాలు

**హైదరాబాద్, వెలుగు:** ఫారెస్టు బీట్ ఆఫీసర్ తుది ఫలితాల విడుదలకు టీఎస్‌పీఎస్సీ సన్నాహాలు చేస్తోంది. 15 రోజుల్లో జాబితా విడుదల చేసి నెల రోజుల్లో నియామక పత్రాలిచ్చేందుకు సిద్ధమవుతోంది. భర్తీ ప్రక్రియలో జాప్యంపై సీఎస్ ఎస్‌కే జోషి దృష్టికి అటవీ శాఖ అధికారులు తీసుకెళ్లారు. దీంతో ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించినట్టు తెలిసింది. 2017 ఆగస్టులో 1,857 ఎఫ్‌బీవో పోస్టుల భర్తీకి కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. రాత పరీక్షలు నిర్వహించి 2018 జూన్‌లో ఫలితాలు విడుదల చేసింది. జూలైలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారు. అర్హత గల వారికి ఆగస్టులో ధృవపత్రాల పరిశీలన పూర్తి చేశారు. అప్పటి నుంచి తుది జాబితా విడుదల చేయలేదు.

## 66 కేసుల్లో 22కిలోల బంగారం స్వాధీనం

**హైదరాబాద్, వెలుగు:** గతేడాది 66 కేసుల్లో 22కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నామని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ హైదరాబాద్ జోన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ బీబీ అగర్వాల్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇన్‌కంటాక్స్ టవర్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టెక్నాలజీ ఉపయోగించి అక్రమ రవాణాపై మరింత దృష్టి పెడతామని అన్నారు. ఇప్పటి వరకు విదేశీ కస్టమ్స్‌తో పోలిస్తే భారత కస్టమ్స్ అత్యుత్తమ ఫలితాలు సాధించిందని, ఈ ఏడాది 'స్మార్ట్ బార్డర్స్ ఫర్ సీమ్‌లెస్ ట్రేడ్ ట్రావెల్' అనే నినాదంతో ముందుకెళ్తామన్నారు. షిప్పింగ్‌తోపాటు విదేశాల నుంచి వచ్చే ఎగుమతి, దిగుమతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. శాంతా బయోటిక్స్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ మంజుల సమావేశంలో పాల్గొన్నారు.



# మన స్టూడెంట్లు ప్రధాని పేరు చెప్పలేరు

- ప్రభుత్వ బడులు చెప్పే చదువులో నాణ్యత ఏది?
- కేరళ మాదిరిగా మన విద్యావ్యవస్థను తీర్చుదిద్దలేమా?
- అక్కడ ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల పిల్లలు అంగన్‌వాడీలకు వెళ్తున్నారు
- విద్యా ప్రమాణాలపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆవేదన

**హైదరాబాద్, వెలుగు:**

"మన దేశ ప్రధాని పేరు చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర విద్యార్థులున్నారు. కాస్తయినా ప్రమాణాలు, నాణ్యత లేని ప్రభుత్వ స్కూళ్లకు బిడ్డల్ని పంపే సాహసాన్ని తల్లిదండ్రులు చేయలేకపోతున్నారు. వాళ్లకు సర్కారీ బడులపై ఏ మాత్రం విశ్వాసం లేని పరిస్థితి. కేరళలో ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల పిల్లలు అంగన్‌వాడీలకు వెళ్లి చదువుకుంటున్నారు. మన రాష్ట్రంలో ఆ పరిస్థితులు ఉన్నాయా? మనం ఎందుకు కేరళ మాదిరి విద్యా వ్యవస్థను తీర్చిదిద్దులేకపోతున్నాం? దీని గురించి అందరూ ఆలోచించాలి. సర్కారు వెంటనే మేల్కొవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రభుత్వ బడుల్లో చదువుల నాణ్యత పెంచడానికి శాస్త్రీయ పద్ధతుల్లో చర్యలు తీసుకోవాలి" అంటూ శుక్రవారం హైకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. విద్యా ప్రమాణాల్లో నాణ్యత పెంపునకు, ప్రభుత్వ స్కూళ్లలో డ్రాపవుట్స్‌ను తగ్గించేందుకు తీసుకునే చర్యలపై నివేదిక సమర్పించాలని విద్యా శాఖను కోరింది. రాష్ట్ర విద్యా అధ్యయన శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్టీ) అభిప్రాయాల్ని కూడా నివేదికలో పొందుపర్చి, మూడు వారాల్లోగా నివేదిక అందజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాల్లో విద్యా ప్రమాణాల క్షీణతపై ఎం.వి.ఫౌండేషన్ ప్రతినిధి ఆర్.వెంకటరెడ్డి దాఖలు చేసిన పిల్‌ను ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారించింది. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలల్ని అనుసంధానం చేస్తే, ఎంతమంది స్టూడెంట్స్ పైచదువులకు వెళ్తున్నారో తేల్చొచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు లెక్క తేల్చాలని ప్రభుత్వానికి సూచించింది. పూర్తిగా గ్రామాలే ఉన్న ఓ మండలాన్ని ఎంచుకుని అన్ని కోణాల్లో అధ్యయనం చేసి, నివేదికను అందించాలని ఆదేశించింది. పిల్లల తల్లిదండ్రులతో కమిటీలు వేస్తే ఫలితాలు బాగుంటాయని అభిప్రాయపడింది.

**నమ్మకం ఎలా కల్పిస్తున్నారు?**

'ప్రభుత్వ బడుల్లో పాఠాలు బాగా చెబుతున్నాం' అని స్టూడెంట్స్ తల్లిదండ్రులకు ఎలా నమ్మకం కల్పిస్తున్నారో, ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ధర్మాసనం కోరింది. దశల వారీగా ఉన్నత ప్రమాణాలు కల్పించకపోతే తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. టీచర్లు కూడా పిల్లల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. పోయిన మంగళవారం పిల్‌ను విచారించిన హైకోర్టు, ప్రమాణాలు పెంచడానికి విద్యావంతులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రమాణాలు పెంపు కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని, టీచర్లకు తగిన శిక్షణ ఇస్తున్నామని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తరఫున ప్రభుత్వ న్యాయవాది సి.వాణిరెడ్డి కోర్టుకు నివేదించారు. ఇందుకోసం శాశ్వత ప్రాతిపదికపై విద్యావంతులతో కమిటీ ఏర్పాటు అవసరంలేదన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించేందుకు తగిన చర్యలు తీసుకోకపోతే ఆ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంటుందని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.ఎస్. అర్జున్ వాదించారు. ప్రభుత్వ చర్యలు సజావుగా ఉంటే ప్రమాణాలు ఎందుకు పడిపోతాయని ప్రశ్నించారు. పాఠ్యాంశాల తయారీ, టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు ఎస్‌సీఈఆర్టీ సమన్వయకర్త సురేశ్ బాబు చెప్పారు. ఈ కేసులో తదుపరి విచారణను ధర్మాసనం మూడు వారాలకు వాయిదా వేసింది.

## ఇన్‌టెన్సివ్ రివ్యూ చేయరేం

### కేసీఆర్‌కు తొత్తుగా ఈసీ: మర్రి

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ సీఎం కేసీఆర్‌కు తొత్తుగా మారారని, అసెంబ్లీ ఎన్నికలను తమ ఇష్టానుసారంగా నిర్వహించారని పీసీసీ ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి శుక్రవారం ఆరోపించారు. '2016లో ఎన్నికల కమిషన్ పేర్కొన్న విధంగా ఇన్‌టెన్సివ్ రివ్యూ చేయాల్సి ఉంటుంది. నేను చాలెంజ్ చేస్తున్నా. ఇప్పటి వరకు ఈసీ దీనిపై ఎక్కడైనా రివ్యూ చేసిందా' అని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికీ వెళ్లి లిస్ట్‌లో ఓటర్ల వివరాలు, ఇంట్లో ఉన్న వారి వివరాలతో సరిచూసుకోవాలన్నారు. అధికారుల తీరుతో కొత్తగా ఓటర్లను చేర్పించేందుకు సర్కారు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 22లక్షల ఓట్లు గల్లంతయ్యాయని స్వయంగా సీఈవో చెప్పినప్పటికీ దానికి బాధ్యులైన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం ఇష్టమున్నట్టుగా పర్మిట్ రూంలకు అనుమతిచ్చి రాష్ట్రంలో మద్యాన్ని ఏరులా ప్రవహింజేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు ఆరోపించారు. పర్మిట్ రూంల వల్ల తాగి న్యూసెన్స్ చేసే వారి సంఖ్య పెరుగుతోందని మండిపడ్డారు. పర్మిట్ రూంలను ఎత్తి వేస్తే న్యూసెన్స్ చేసే వారిని అదుపు చేయొచ్చని సూచించారు.

## అది దేశద్రోహమే

### రక్షణరంగంలోకి ఎఫ్‌డీఐలపై మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

**హైదరాబాద్, వెలుగు:** రక్షణ రంగంలోకి ఎఫ్‌డీఐలను ఆహ్వానించి యుద్ధ విమానాలు, జలాంతర్గాముల తయారీ విదేశీయుల చేతిలో పెట్టడం దేశద్రోహమేనని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. రక్షణరంగం ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉద్యోగులు చేస్తున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా శుక్రవారం హైదరాబాద్‌లో కార్మిక, ప్రజా, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మానవహారం కార్యక్రమం జరిగింది. నాగేశ్వర్ మాట్లాడుతూ భారత్, పాక్ యుద్ధం కీలక సమయంలో ప్రైవేటు కంపెనీలు చేతులెత్తేసిన విషయం కేంద్రానికి గుర్తులేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రక్షణరంగంలో ఎఫ్‌డీఐల ఆలోచనను విరమించుకోవాలన్నారు. 'మేకిన్ ఇండియా' పేరుతో రక్షణరంగంలోకి 100శాతం ఎఫ్‌డీఐలకు అనుమతివ్వడం దేశీయ రక్షణ రంగాన్ని నాశనం చేయడమేనని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సాయిబాబు అన్నారు.

## 'పంచాయతీ' కోసం రూ.83 కోట్లు

**హైదరాబాద్, వెలుగు:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.83 కోట్లు విడుదల చేసినట్టు అధికారులు చెప్పారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత మొదటి విడత రూ.50కోట్లు, రెండో విడత పోలింగ్ రోజు శుక్రవారం 33కోట్ల రూపాయలను పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసింది.

# నదుల పునరుజ్జీవంపై నివేదికివ్వండి

- నెలాఖరుకల్లా పూర్తి చేసి ఇవ్వండి
- నదీ కాలుష్య నివారణకు మూడేళ్ల ప్రణాళిక: సీఎస్ జోషి


**హైదరాబాద్, వెలుగు:** నదుల పునరుజ్జీవనంపై నెలాఖరుకల్లా నివేదిక తయారు చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన అధికారులతో నదుల పునరుజ్జీవంపై సమీక్షించారు. కాలుష్య నివారణ కోసం ఎస్టీపీల నిర్మాణం, దానికి వాడే సాంకేతిక పరిజ్ఞానం, అవసరమయ్యే నిధుల వివరాల గురించి చెప్పాలన్నారు. రాష్ట్రంలో ప్రవహించే 8 నదుల్లో కాలుష్య నివారణ కోసం మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ఏయే నదులు ఎక్కడెక్కడ కాలుష్యానికి ప్రభావితమయ్యాయో గుర్తించాలని, అందుకు కారణాలనూ అన్వేషించాలని సూచించారు. పరిశ్రమల కాలుష్యం, సివరేజీ, భూగర్భ జలాలపై ప్రభావం, జనాభా లాంటి అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఎక్కడెక్కడ ఎస్టీపీలు అవసరమవుతాయో అంచనా వేయాలని సూచించారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఉత్తర్వులను దృష్టిలో పెట్టుకుని నివేదికను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, పార్కుల ఏర్పాటు తదితర అంశాలనూ నివేదికలో పొందుపరచాలని సూచించారు. ఆ నివేదికలోని ముఖ్యాంశాలతో ఓ నోట్ తయారు చేయాలని సూచించారు.

# ఎస్సై పోస్టుల భర్తీపై విచారణ వాయిదా

## సింగిల్ జడ్జి ఉత్తర్వుల్ని సమగ్ర విచారణ చేయాలన్న డివిజన్ బెంచ్

**హైదరాబాద్, వెలుగు:**

సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షలో ఆరు ప్రశ్నల్ని తొలగించాలని సింగిల్ జడ్జి ఇచ్చి ఉత్తర్వుల్ని తెలంగాణ పోలీసు నియామక మండలి డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ అప్పీల్ పిటిషన్‌ను విచారించింది. పరీక్షలో అడిగిన ఆరు ప్రశ్నలు కరెక్టుగానే ఉన్నాయని, వాటిని తొలగించాల్సిన పని లేదని నియామక మండలి డివిజన్ బెంచ్ ముందు వాదనలు వినిపించింది.



రాష్ట్ర పోలీసు శాఖలో ఎస్సై పోస్టులకు గతేడాది ఆగస్టు 28న రాత పరీక్షలు జరిగింది. ఈ పరీక్షలో ఆరు ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఇచ్చారని, దీని వల్ల పోస్టుల ఎంపికపై ప్రభావం పడుతుందని 15 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని విచారించిన సింగిల్ జడ్జి ప్రశ్నాపత్రంలోని బుక్‌లెట్ 'కోడ్ బి'లోని 117, 138, 172, 181, 185, 189 ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు తప్పని తేల్చారు. ఆరు ప్రశ్నల్ని తొలగించాకే అర్హులైన అభ్యర్థుల జాబితా వెల్లడించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై పోలీసు నియామక మండలి చేసిన అప్పీల్‌ను సమగ్రంగా విచారించాల్సివుందని డివిజన్ బెంచ్ పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఈలోగా ప్రతివాదులు తమ అభ్యంతరాలను తెలపాలని ధర్మాసనం ఆదేశించింది.

# ఆహారశుద్ధి పరిశ్రమలకు 'నిఫ్టెమ్' సహకారం

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఆహారశుద్ధి పరిశ్రమలకు సాంకేతిక సహకారం అందించేందుకు నిఫ్టెమ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ అండ్ మేనేజ్ మెంట్) అంగీకరించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం హర్యానా సోనేపట్ లోని ఆ సంస్థను సందర్శించి సాంకేతిక సహకారంపై చర్చించారు. పసుపు, మిర్చి, మామిడి, బత్తాయి, సీతాఫలం వంటి ఉద్యాన పంటలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి సహకరించేందుకు నిఫ్టెమ్ వైస్ ఛాన్సలర్ సంసిద్ధత వ్యక్తం చేశారు. బృందంలో ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రవీణ్ రావు, ఉద్యాన సంచాలకుడు వెంకట్రామ్ రెడ్డి, ఆహారశుద్ధి శాఖ సంచాలకుడు అఖిల్, మార్కెటింగ్ సంచాలకురాలు లక్ష్మీ బాయి, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు జగదీశ్వర్, ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు భగవాన్ ఉన్నారు.

# ఓటేయనోళ్లకు ప్రశ్నించే హక్కులేదు

## లోక్‌సభ ఎన్నికల్లో 90% పోలింగ్ జరగాలి ■ జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ నరసింహన్

**హైదరాబాద్, వెలుగు:** యువత ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన తొమ్మిదో జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఓటు వేయని వాళ్లకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఆరోజును కేవలం సెలవు దినంగా కాకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పెద్ద బాధ్యతగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల నిర్వహణపై ఎన్నో దేశాలు అధ్యయనం చేసి ప్రశంసించాయని, కొన్ని దేశాలు దేశ ఎన్నికల విధానాన్నే పాటిస్తున్నాయని అన్నారు. తెలంగాణలో తొలిసారి ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించిన సీఈవో రజత్‌కుమార్‌ను గవర్నర్ అభినందించారు. దివ్యాంగులు ఓటేసేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లోనూ పోలింగ్ ఎక్కువ శాతం నమోదవుతుండడం ప్రశంసనీయమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని రజత్ కుమార్‌కు సూచించారు. కొత్త ఓటర్లుగా నమోదైన




యువతీయువకులకు ఎపిక్ కార్డులను గవర్నర్ అందజేశారు. ఓటింగ్‌లో పాల్గొన్న సీనియర్ సిటీజన్లను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఎన్నికలు ప్రశాంతంగా సమర్థంగా నిర్వహించిన అధికారులకు అవార్డులు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించామని, ఓటరు చైతన్య కార్యక్రమాల ద్వారా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేశామన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం అర్హత ఉన్నోళ్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఉన్నా కూడా సోమరితనంతో ఓటు వేయకపోవడం విచారకరమని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. చదువుకున్నోళ్లు ఎక్కువున్న హైదరాబాద్‌లోనూ పోలింగ్ శాతం తక్కువుండడం బాధాకరమన్నారు.

## హైదరాబాద్ సేఫ్ సిటీ: డీజీపీ

**హైదరాబాద్, వెలుగు:** సేఫ్ అండ్ సెక్యూరిటీ నగరంగా హైదరాబాద్ పేరు పొందిందని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మూడ్రోజుల పాటు జరిగే లిటరరీ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. శాంతిభద్రతల్లో ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో క్వాలిటీ ఆఫ్ లివింగ్‌తో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి తెలుస్తాయన్నారు.

## ఫిబ్రవరి 16న మున్నూరు కాపు మహాసభ

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలోని మున్నూరు కాపులందరినీ ఏకం చేసేలా ఫిబ్రవరి 16న హైద్రాబాద్‌లో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్నూరు కాపు సంఘం తెలిపింది. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని బీసీ సాధికారత భవన్‌లో మెజీషియన్ సామల వేణుతో పాటు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సభలో మున్నూరు కాపులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ సమావేశంలో మహాసభ కన్వీనర్ పుట్టం పురుషోత్తంరావు, ఎక్కా యాదగిరి, లక్ష్మణ్, నీల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది

### రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ



శుక్రవారం రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నుంచి జాతీయ అవార్డు అందుకుంటున్న శైలజ

**హైదరాబాద్, వెలుగు:**

గతేడాది అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం వివిధ కేటగిరీల్లో జాతీయ అవార్డులు ఢిల్లీలో అందజేసింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజకు ప్రత్యేక కేటగిరీలో అవార్డు లభించింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా పురస్కారాన్ని శైలజ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో దివ్యాంగులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2.75లక్షల మంది దివ్యాంగులైన ఓటర్లను గుర్తించామని చెప్పారు. అంధుల కోసం బ్రెయిలీ లిపిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించామన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలను మరింత సమర్థంగా నిర్వహించేలా ఈ అవార్డు నూతనోత్సాహాన్ని నింపిందన్నారు.

## రిపబ్లిక్ డే గెస్ట్‌కి

# ఈ ఆవులంటే ప్రాణం!



**సిరిల్ రమఫోసా.. ప్రస్తుతం మన అతిథి. ఇండియా రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన సౌతాఫ్రికా ప్రెసిడెంట్. 'నల్ల సూరీడు' నెల్సన్ మండేలా తర్వాత మన దేశంలో అంత గౌరవం దక్కింది ఈయనకే. 66 ఏళ్ల వయసులోనూ చురుగ్గా ఉండే సిరిల్ స్టైల్ మిగతా ప్రపంచ దేశాధినేతలకు భిన్నం. సౌతాఫ్రికాలోని అత్యధిక ధనవంతుల్లో ఒకడైనా తనను పాడి రైతుగానే గుర్తించమంటారు.**



సాధారణ పోలీస్ ఉద్యోగి కుటుంబంలో పుట్టిన సిరిల్ రమఫోసా జీవితంలోని మలుపులు సినిమా స్క్రిప్ట్‌కి ఏమాత్రం తీసిపోవు. విద్యార్థి నేతగా, లాయర్‌గా, ఉద్యమ నాయకుడిగా, దేశంలోనే అతి పెద్ద వర్కర్స్ యూనియన్‌కి వ్యవస్థాపకుడిగా వ్యవహరించారు. అన్నిటికీ మించి నెల్సన్ మండేలాను జైలు నుంచి విడుదల చేయించడంలో కీలక పాత్ర పోషించారు. కొన్నాళ్లు రాజకీయాలకు దూరమై సక్సెస్‌ఫుల్ బిజినెస్ మ్యాన్‌గా కొనసాగారు.

**దోస్తానాతో ఇద్దరికీ ఫాయిదా**

సౌతాఫ్రికా ప్రెసిడెంట్‌ని ఆహ్వానించడంలో ఇండియా ఆత్మీయతతోపాటు వ్యూహాత్మకతనూ చాటుకుంది. ప్రపంచంలో సాగుకి పనికొచ్చే భూమిలో 60 శాతం ఆఫ్రికాలోనే ఉంది. వ్యవసాయోత్పత్తి మాత్రం పది శాతమే. ఇతర రంగాల్లోనూ వెనకబాటే. చాలా దేశాలు క్రైసిస్‌ను ఎదుర్కొంటున్నాయి. సౌతాఫ్రికా లాంటి కొన్ని చోట్లే ప్రజాస్వామిక వ్యవస్థలు స్థిరపడ్డాయి. అక్కడి పరిపాలన, రక్షణ రంగాల్లో సిబ్బంది శిక్షణకు ఇండియా చేయూతనిస్తోంది. 2018 జూలైలో సౌతాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన పదో బ్రిక్స్ సదస్సులో మోడీ ఇచ్చిన మెసేజ్ అందర్నీ ఆకట్టుకుంది. ఆఫ్రికా.. జాతుల మధ్య కలహాలకు కేంద్రంగా మారకూడదని, అభివృద్ధికి అడ్డాగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఇండియా అన్ని విధాలా సహకరిస్తుందని చెప్పారు.

**జాక్ ఆఫ్ ఆల్ ట్రేడ్స్**

రమఫోసా 1952లో జొహన్నెస్‌బర్గ్ శివారులోని సొవేటోలో పుట్టారు. విద్యార్థి దశలో జాతి వివక్ష వ్యతిరేక పోరాటంలో పాల్గొని జైలుకెళ్లారు. లా పూర్తి చేసిన తర్వాత నల్ల కార్మికులకు జరిగిన అన్యాయాలపై కోర్టుల్లో పోరాడేవారు. చిన్న వయసులోనే గొప్ప వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్న రమఫోసా.. 1982లో 'నేషనల్ యూనియన్ ఆఫ్ మైన్ వర్కర్స్'ను స్థాపించారు. ఇప్పుడది సౌతాఫ్రికాలో అతి పెద్ద కార్మిక సంఘం. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) పార్టీలో చేరి నియంత పాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశారు.

1990లో నెల్సన్ మండేలా జైలు నుంచి విడుదల కావడంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ రిసెప్షన్ కమిటీకి రమఫోసా ప్రెసిడెంట్. మండేలా సౌతాఫ్రికా ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు రమఫోసా నేషనల్ అసెంబ్లీ చైర్మన్ అయ్యారు. ఒక దశలో మండేలా తన వారసుడిగా రమఫోసా పేరును ప్రకటిస్తారని అంతా భావించారు. అలా జరగకపోవడంతో కొన్నేళ్లు రాజకీయాలకు దూరంగా, పూర్తి స్థాయి వ్యాపారవేత్తగా మారారు. రియల్ ఎస్టేట్, ఎనర్జీ, బ్యాంకింగ్, టెలికం, ఇన్సురెన్స్ రంగాల్లోకి ప్రవేశించారు. అంతర్జాతీయ సంస్థల్లో పార్ట్‌నర్ అయ్యారు.

డబ్బు సంపాదించిన తర్వాత మళ్లీ పాలిటిక్స్‌లోకి వచ్చి 2014లో సౌతాఫ్రికా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. అవినీతి ఆరోపణలతో జాకబ్ జుమా 2018 ఫిబ్రవరిలో పదవి నుంచి తప్పుకున్నారు. ఆ టైంలో దేశాన్ని నడిపించగల సమర్థుడు రమఫోసా ఒక్కరేనని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమైంది. ప్రతిపక్షమూ సపోర్ట్ చేయటంతో ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### ఆవుల కోసం అష్టకష్టాలు

2004లో రువాండాలో పర్యటించిన రమఫోసా అక్కడి అంకోలే జాతి ఆవులపై మనసుపడ్డారు. పెద్ద పెద్ద కొమ్ములతో అబ్బురపరిచే ఆ గోవులు చాలా ప్రత్యేకం. ఆఫ్రికా కరువు వాతావరణాన్ని తట్టుకొని వందల ఏళ్లుగా మనుగడ సాగిస్తున్నాయి. వీటి పాలలో పోషకాలు ఎక్కువ. మాంసం బలవర్ధక ఆహారం. ప్రపంచంలో బాగా డిమాండ్ ఉన్న బ్రీడ్‌లో అంకోలేదే అగ్రస్థానం. రువాండాలో ఈ ఆవుల్ని చూసిన వెంటనే ఆయన 43 జీవాల్ని కొనేశారు. రువాండా నుంచి సౌతాఫ్రికాకు ఆవుల దిగుమతిపై నిషేధం ఉండటంతో వాటిని మొదట కెన్యాకు తరలించి కృత్రిమ సంకరం ద్వారా కొత్త బ్రీడ్‌ని పుట్టించారు. అక్కడి నుంచి సొవేటోలోని ఫామ్ హౌజ్‌కి తెప్పించారు. ఆయన దగ్గర 200 ఆవులున్నాయి. రాజకీయాలు, వ్యాపారాల కంటే పశు పోషణే తనకు ఇష్టమని రమఫోసే అంటారు. అంకోలే జాతి ఆవుల్ని ప్రేమించడమే కాదు రీసెర్చ్ కూడా చేసిన ఆయన 'క్యాటిల్ ఆఫ్ ది ఏజెస్: స్టోరీస్ అండ్ పోర్ట్రెయిట్స్ ఆఫ్ ది అంకోలే క్యాటిల్ ఆఫ్ సౌతాఫ్రికా' అనే బుక్‌కి కో-ఆథర్‌గా వ్యవహరించారు.




## ఏమన్నారంటే



**జీరో ప్లస్ జీరో జీరోనే!**

ప్రియాంక పొలిటిక్ ఎంట్రీ కొత్తేమీకాదు. 2014, 2017 ఎన్నికల్లోనూ ఆమె యూపీలో కాంగ్రెస్‌ను లీడ్ చేసి ఫెయిలయ్యారు. రాహుల్ లాంటి జీరోకు ఇంకో జీరో తోడైతే ఫలితం జీరోనే.

**–యోగి ఆదిత్యనాథ్, యూపీ సీఎం**



**ఇండియాతో ఫ్రెండ్లీగానే..**

ఇండియాతో ఫ్రాన్స్ బంధం 70 ఏండ్ల నాటిది. రాఫెల్ ఇష్యూల్లాంటి టఫ్ టైమ్స్‌లోనూ రెండు దేశాలూ ఫ్రెండ్లీగానే వ్యవహరించాయి.


**– అలెగ్జాండర్ జిగ్లెర్, ఫ్రాన్స్ రాయబారి**



**టాప్ ఆర్డరే టార్గెట్**

ఫస్ట్ వన్డేలో చేసిన పొరపాట్లు రెండో వన్డేలో చేయం. ఇండియన్ టాప్ ఆర్డర్‌లో ధావన్, రోహిత్, కోహ్లీలను టార్గెట్ చేశాం. పది ఓవర్లలోపే వాళ్లను ఔట్ చేస్తే విజయం మాదే.

**– ట్రెంట్ బౌల్ట్, న్యూజిలాండ్ బౌలర్.**



**సీత చాలా స్పెషల్**

తెలుగులో నా డెబ్యూ డైరెక్టర్ తేజాతో మూడో సినిమా చేస్తున్నా. బెల్లంకొండ శ్రీనివాస్ హీరో. టైటిల్ సీత. ఈ సినిమా నిజంగా నాకెంతో ప్రత్యేకం.

**–కాజల్, నటి**

**మీరూ రాయొచ్చు!**

**సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com**



**భద్రతకు 'అద్దం' పడుతోంది..**

**రిపబ్లిక్ డే సందర్భంగా దేశంలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అడుగడుగునా భద్రతా దళాలను మోహరించారు. గణతంత్ర ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. కోల్‌కతాలోని ఓ ప్రాంతంలో గురువారం డ్యూటీలో ఉన్న ఓ పారామిలటరీ పర్సన్.**



# నీటి కోసం.. నేటి నుంచే..

**దాహం సమస్య ఏ ఒక్క దేశానికో పరిమితం కాలేదు. మొత్తం ప్రపంచంలో నెలకొంది. గుక్కెడు నీరు లేక జనం గొంతెండే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. అన్ని దేశాల్లోనూ నీటి వనరులు తగ్గిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఈ పరిస్థితి పట్ల ప్రజలను అలర్ట్ చేయాలి. సేవ్ వాటర్ అనేది నేటి నినాదం కావాలి. రేపటి విధానంగా మారాలి.**

ఒక వైపు ప్రపంచ జనాభా పెరుగుతోంది. మరో వైపు నీటి వనరులు తగ్గుతున్నాయి. దీంతో సరిపడా నీరు అందట్లేదు. ఈ సమస్య కొన్నేళ్లుగా తీవ్ర రూపం దాల్చింది. 2050 నాటికి పరిస్థితి మరింత దారుణంగా మారే సూచనలున్నాయి. ప్రపంచంలో 40 శాతం మందికి తాగటానికి నీళ్లే దొరకవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతకు కారణాలు అనేకం. వాతావరణ మార్పులదే ప్రధాన పాత్ర. ఓజోన్ పొర దెబ్బతినడంతో ఆ ఎఫెక్ట్ వాతావరణంపై పడుతోంది. ఫలితంగా భూమి అపరిమితంగా వేడెక్కుతోంది. చాలా చోట్ల వానలు పడట్లేదు. కొన్ని ప్రాంతాల్లో కురుస్తున్నా అదీ అరకొరగానే ఉంది. టోటల్‌గా సగటు వర్షపాతం పడిపోతోంది.

**వార్కా వాటర్ ప్రయోగం**

నీటి కొరతను ఎదుర్కోటానికి కనుగొన్న కొత్త పద్ధతే 'వార్కా వాటర్' ప్రాజెక్ట్. ఇథియోపియా దేశంలోని పల్లెల్లో నీటి సమ్యసకు చెక్ పెట్టడానికి దీనికి రూపకల్పన చేశారు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఆండ్రియాస్ వోల్గర్, ఇటలీ దేశస్తుడు ఆర్టురో విట్టోరీ అనే ఇద్దరు ఆర్కిటెక్టులు 2012లో ఆ దేశంలోని ఈశాన్య ప్రాంతంలో పర్యటించారు. అక్కడి సమస్యలను పరిశీలించిన తర్వాత ఈ ప్రాజెక్టుకు డిజైన్ చేశారు. ఇందులో.. వాతావరణంలోని నీటిని ఒడిసి పట్టుకునే నిలువు సెటప్ ఉంటుంది. తక్కువ ఖర్చుతో సహజంగా నీటిని గ్రహించటమే ఈ ప్రాజెక్టులో ప్రధాన అంశం. వార్కా వాటర్ పెద్ద పాత్రలా ఉంటుంది. బ్రహ్మజెముడు చెట్ల మాదిరిగా ప్రకృతి నుంచే నీటిని తీసుకొని తనలో దాచుకుంటుంది.

**జయించిన ఇజ్రాయెల్**

నీటి కొరతను జయించిన ఎడారి దేశం ఇజ్రాయెల్‌లో ఇప్పుడు పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. అయితే, ఇక్కడ నీటిని ఫ్రీగా ఇవ్వరు. వాటర్‌పై సబ్సిడీ కూడా లేదు. వేస్ట్ వాటర్‌ను క్లీన్ చేసే 'డీ శాలినేషన్' ప్రక్రియను అక్కడ విజయవంతంగా వాడుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో డీ శాలినేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. నీటి వృథాను అరికట్టారు. వాన నీటిని చుక్క పోనీయకుండా కలెక్ట్ చేస్తున్నారు. 'వాటర్ మేనేజ్‌మెంట్'లో లేటెస్ట్ టెక్నాలజీలను ఆ దేశం ఎప్పటికప్పుడు అడాప్ట్ చేసుకుంటుంది. ఎడారికి తగ్గట్లు తక్కువ నీటితో వ్యవసాయం చేసి మంచి ఫలితాలను సాధించింది.

**నీటి యుద్ధాలు తప్పవా?**

ఒకప్పుడు రాజ్యాల కోసం యుద్ధాలు జరిగాయి. ఫ్యూచర్‌లో నీటి కోసం వార్లు జరుగుతాయని చాలా కాలం కిందటే నిపుణులు జోస్యం చెప్పారు. నీటి కోసం ఒక దేశం నుంచి మరో దేశానికి జనం వలస పోయే రోజులూ వస్తాయట. దీనివల్ల చాలా దేశాల్లో రాజకీయ అస్థిరత నెలకొంటుందని అంటున్నారు.

**ఇండియా రెడీగా ఉందా?**

యూనిసెఫ్ రిపోర్ట్ ప్రకారం మన దేశంలో 90 శాతం నీటిని సాగుకే వాడుతున్నారు. ఆరు శాతం పారిశ్రామిక రంగానికి, మిగతా నాలుగు శాతం గృహవసరాలకు వినియోగిస్తున్నారు. ఇదంతా గత ముచ్చట. ఇప్పుడు నీటి వాడకంలో లెక్కలు మారాయి. నీటి వాడకంపై పట్టణీకరణ, మారుతున్న జీవన శైలి, పారిశ్రామిక ప్రగతి ప్రభావం చూపుతున్నాయి. పల్లెలతో పోల్చితే టౌన్లు, సిటీల్లో నీటి అవసరాలు దాదాపు పది శాతం పెరిగాయి. కానీ, వాటికి తగ్గట్లు నీటి లభ్యత లేదు. నీటిని శుద్ధి చేసి మళ్లీ వాడుకునే మెకానిజాన్ని అందిపుచ్చుకోవటంలో వెనకబడ్డాం. ఇప్పుడిప్పుడే ఇండియాలోని చాలా ప్రాంతాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మహారాష్ట్రలోని మరఠ్వాడాలో కొన్ని వందల ఎకరాలు చుక్క నీటికీ నోచుకోవటం లేదు. ఇదే రాష్ట్రంలోని లాతూర్‌లో కొన్నేళ్ల కిందట తీవ్ర నీటి కరువు వచ్చింది. రైళ్లలో నీళ్లు పంపి స్థానికుల గొంతు తడిపారు.

**రీసైక్లింగ్ 30 శాతమే**

మన దేశంలో నీటిని శుద్ధి చేసి, తిరిగి వాడుకునే నీరు 30 శాతం మాత్రమే. ఇతర దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ నేపథ్యంలో ముంచుకొస్తున్న నీటి సంక్షోభంపై ప్రజలను అప్రమత్తం చేయాలి. నీటి వృథా వల్ల జరిగే అనర్థాలను అందరికీ అర్థమయ్యేలా చెప్పాలి. 'సేవ్ వాటర్' అనేది నేటి తరం నినాదం కావాలి.

**'శ్రీమంతుడు' మారుతున్నాడు**

సంపన్నుడు అనే పదానికి రానున్న రోజుల్లో నిర్వచనం మారబోతోంది. ఇప్పుడు బాగా డబ్బున్నవాణ్నే ఇలా పిలుస్తున్నాం. ఇకపై వాడుకోడానికి సరిపడా నీళ్లున్న వాళ్లనే శ్రీమంతులుగా చెప్పుకునే రోజులు వస్తాయి. నీరు సహజ వనరు. సొంతగా తయారుచేసుకోలేం. టెక్నాలజీ సాయంతో తయారుచేసుకున్నా తాగునీటి అవసరాలను తీర్చే స్థాయిలో ఉండదు. అందుకే నీటిని పొదుపుగా వాడదాం. రేపటి తరం కోసం కాసిన్ని నీటి చుక్కలను మిగిలిద్దాం.

**– ఎస్. అబ్దుల్ ఖాలిక్**



వార్కా వాటర్ ప్రయోగం

## తెల్లోళ్లకు తలొంచని..

# రాణీమా



**స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ సైన్యంపై పోరాడిన ఏకైక ఆదివాసీ వీర నారి రాణీ గైడిన్ల్యూ. గిరిజనుల జీవన విధానాన్ని కాపాడటానికి తెల్ల దొరల ఆయుధాలకు ఎదురు నిలిచిన ధీర వనిత. నాగా జాతిలోని రాంగ్‌మోయీ తెగకు చెందిన రాణీమా దేశం గర్వించదగ్గ యోధురాలు. బ్రిటిష్ సైన్యాలకు వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన పోరాట పటిమ, ధైర్య సాహసాలు, త్యాగం అసమానం. మణిపూర్ పశ్చిమ ప్రాంతంలోని చిన్న గ్రామంలో 1915 జనవరి 26న జన్మించారు. బాల్యం నుంచే స్వాతంత్ర్య భావాలను పెంపొందించుకున్నారు.**

**ఇవాళ రాణిమా గైడిన్ల్యూ జయంతి**

తొలిసారిగా బ్రిటిష్ ఆర్మీకి అండగా మెసపటేమియా యుద్ధంలో పాల్గొన్నారు. కానీ, ఇండియాపై తెల్లవాళ్ల ఆగడాలను ప్రత్యక్షంగా చూసిన ఆమె ఆ సైన్యానికి వెంటనే రాజీనామా చేసి బయటికొచ్చారు. అప్పటికే మణిపూర్ ప్రాంతంలో ఆదివాసీల తరపున పోరాడుతున్న జాదోనాంగ్‌తో కలిసి హరాకా అనే ఉద్యమ సంస్థను ప్రారంభించారు. బ్రిటిష్‌వాళ్లను మన దేశం నుంచి తరిమికొట్టాలన్నదే ఆ సంస్థ లక్ష్యం. మరో వైపు నాగా జాతి ప్రజల్లో అన్ని విధాలా చైతన్యాన్ని రగిలించడంలో అలుపెరగక కృషి చేశారు.


ఈ మూమెంట్ మొదలైన కొద్ది రోజుల్లోనే బ్రిటిష్ పాలకులు అక్కసుతో జాదోనాంగ్‌ని దేశద్రోహం నేరం కింద అరెస్ట్ చేసి విచారణ జరిపారు. తర్వాత మరణ శిక్ష విధించారు. దీంతో రాణీమా 17 ఏళ్ల వయసులోనే ఉద్యమ నాయకత్వాన్ని చేపట్టారు. సాయుధ బలగాలను సిద్ధం చేసుకొని పోరాట స్థావరాన్ని బరక్ నదీ సమీపానికి మార్చారు. ఉద్యమంలో పాల్గొన్న గిరిజన, గిరిజనేతర గ్రామాలపై తెల్లోళ్లు విరుచుకుపడ్డారు. ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

అయినా, వాళ్లంతా ధైర్య సాహసాలతో రాణీమా నాయకత్వంలో బ్రిటిష్‌వాళ్లను ఎదిరించి స్వాతంత్ర్య పోరాటాన్ని కొనసాగించారు. హరాకా మూమెంట్ నాగా జాతిలోని ముఖ్య తెగలను ఏకతాటిపైకి తెచ్చింది. ఆదివాసీలపై విదేశీ సంస్కృతి ప్రభావం పడకుండా కాపాడింది. అందుకే మణిపూర్ ప్రజలు ఆమెను దేవతతో సమానంగా చూసేవారు. రాణీమా అని పిలుచుకునేవారు. ఆమె నేతృత్వంలో మణిపూర్ పశ్చిమ, నాగాలాండ్ దక్షిణ, అసోం ఉత్తర ప్రాంతాల్లో స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు బ్రిటిషర్లకు ముచ్చెమటలు పట్టించాయి. ఇంత బలమైన ఉద్యమాన్ని నిర్మించినందుకు రాణీమాపై కక్ష కట్టిన బ్రిటిష్ సర్కారు ఆమెను బంధించేందుకు డిప్యూటీ కమిషనర్ జేపీ మిల్స్ ఆధ్వర్యంలో సైన్యాన్ని పంపింది. రాణీమా ఆచూకీ చెప్పినవారికి నజరానాలను ప్రకటించింది. రాణీమా తమలో ఒకరిగా ఉంటూ తమతో అజ్ఞాతంలో తిరుగుతున్నప్పటికీ ఉత్తర కఛార్ ప్రజలెవరూ ఆమె జాడ చెప్పలేదు. రాణీమా అంటే వారికెంత అభిమానమో దీన్నిబట్టి తెలుసుకోవచ్చు.

నాగా స్వాతంత్ర్య దళం బ్రిటిష్ అస్సాం రైఫిల్స్‌పై దాడి చేసింది. కానీ, నాగాల ఆయుధాలైన కత్తి, డాలు, బాణం ఆంగ్లేయుల మోడ్రన్ వెపన్స్ ముందు నిలవలేకపోయాయి. వేల మంది నాగాలు వీర మరణం పొందారు. తర్వాత రాణీమా ఉత్తర మణిపూర్, నాగాల కేంద్ర స్థానమైన కోహిమాల్లో పర్యటిస్తూ సాయుధ బలగాలను కూడగట్టుకున్నారు. అసోం రైఫిల్స్ హంగ్రమ్ అనే ప్రాంతంలో కట్టెలతో ఒక కోటను ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రాణీమా కూడా గట్టి నిర్ణయం తీసుకున్నారు. 'విజయమో వీర స్వర్గమో' తేల్చుకోవాలనే తెగింపుతో పాలోమీ గ్రామ సమీపంలో ఆమె కూడా ఒక కోటను నిర్మించుకున్నారు. ఆ స్థావరాన్ని కనిపెట్టిన అస్సాం రైఫిల్స్ అకస్మాత్తుగా ఎటాక్‌కి దిగారు. ఇంగ్లిష్ వాళ్ల ఆధునిక ఆయుధాల ధాటికి నాగాలకు ఓటమి తప్పలేదు. రాణీమాను అస్సాం రైఫిల్స్ అదుపులోకి తీసుకొని తొలుత కోహిమాకు, ఆ తర్వాత ఇంఫాల్ జైలుకు తరలించారు.

జాదోనాంగ్ మాదిరిగానే రాణీమాకూ బ్రిటిష్ గవర్నమెంట్ యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ఇలా 15 ఏళ్ల పాటు ఆమె జీవితం చెరసాలల్లోనే గడిచింది. అయినా హరాకా ఉద్యమం ఏం తగ్గలేదు. అజ్ఞాతం నుండి బయటకు వచ్చిన తర్వాత గిరిజన తెగల సంక్షేమం కోసం ఛత్తీస్‌గఢ్‌లో అఖిల భారతీయ వనవాసీ కళ్యాణాశ్రమానికి అనుబంధంగా పనిచేశారు. దేశానికి ఆమె చేసిన సేవలకు 'పద్మభూషణ్'తో సత్కరించారు. పోరాటాన్నే జీవితంగా భావించి సాగించిన రాణీమా దేశవ్యాప్తంగా ఆదివాసీల, అణగారిన ప్రజల హక్కుల ఉద్యమాలకు స్ఫూర్తి.

**– గుమ్మడి లక్ష్మీ నారాయణ**
ఆదివాసీ రచయితల సంఘం




**మెచ్చుకున్న నెహ్రూ**

నెహ్రూ ఓసారి అసోంకి వచ్చినప్పుడు రాణీమా దేశభక్తిని మెచ్చుకున్నారు. ఆమెను విడుదల చేయించటం కోసం బ్రిటిష్ ప్రభుత్వంతో మంతనాలు జరిపారు. లెటర్స్‌లో ఆమెను 'నాగేల రాణి'గా ప్రస్తావించేవారు.

## మజ్ను.. టైటిల్‌ని జస్టిఫై చేశాడు



రివ్యూ

**అఖిల్ మూడో చిత్రం 'మిస్టర్ మజ్ను'. 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకుడు. తొలి చిత్రంతో మెప్పించిన దర్శకులు రెండో సినిమాకి మెప్పించలేక పోవడమనే సెంటి మెంట్ టాలీవుడ్లో ఉంది. వెంకీ దాన్ని బ్రేక్ చేశాడా? అఖిల్‌కి ఈ చిత్రం ఎలాంటి ఫలితాన్నిచ్చింది?**

**కథ**

పదుల సంఖ్యలో అమ్మాయిలతో లవ్, రొమాన్స్ చేసే కుర్రాడు విక్కీ (అఖిల్). ఇందుకు పూర్తి భిన్నంగా రాముడి తరహా భర్తను కోరుకునే అమ్మాయి నిక్కీ (నిధి అగర్వాల్). లండన్‌లో పరిచయమైన వీరిద్దరూ అనుకోని పరిస్థితుల్లో హైదరాబాద్‌లో బంధువులవుతారు. మొదట్లో విక్కీలోని ప్లేబోయ్ క్యారెక్టర్ చూసి అసహ్యించుకున్న నిక్కీ.. ఫ్యామిలీ రిలేషన్స్‌కి అతనిచ్చే ప్రాధాన్యత చూసి ప్రేమిస్తుంది. ప్రపోజ్ చేస్తుంది. మొహమాటంగానే అంగీకరిస్తాడు విక్కీ. కానీ ఆమెకు నచ్చినట్టు తాను ఉండాలనే తీరు అతనికి నచ్చదు. ఆ విషయం అర్థం చేసుకుని తిరిగి లండన్ వెళ్లిపోతుంది నిక్కీ. ఆమె దూరమయ్యాక ప్రేమ విలువేంటో తెలుసుకున్న విక్కీ ఆమెకు దగ్గరవడానికి ఏం చేశాడనేది మిగతా కథ.

**ఎవరెలా...**

ఓ వైపు ప్లేబాయ్‌లా, మరోవైపు లవర్‌బాయ్‌లా మెప్పించాడు అఖిల్. డ్యాన్సులు, ఫైట్స్‌లోనూ తన మార్క్ చూపించాడు. అయితే ఎమోషన్ సీన్స్‌లో ఇంకొంత పరిణితి చూపించాల్సిన అవసరముంది. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డిక్షన్‌లో మాత్రం చాలావరకూ నాగార్జున గుర్తొస్తాడు. నిధి గ్లామర్‌తో పాటు నటనలోనూ మెప్పించే ప్రయత్నం చేసింది. ప్రియదర్శి కామెడీ సెటిల్డ్‌గా నవ్విస్తే.. హైపర్ ఆది కామెడీ అతి అనిపిస్తుంది. రావు రమేష్, జయప్రకాశ్, సుబ్బరాజు, అజయ్, సితార, పవిత్రాలోకేశ్, సత్యకృష్ణన్ పాత్రల పరిధి మేరకు నటించారు. సినిమాటోగ్రఫీ ఆకట్టుకుంది. పాటలు ఫర్వాలేదనిపినా నేపథ్య సంగీతంలో తన మార్క్ చూపించాడు తమన్. డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్‌తో పాటు ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి.

**ఎలా ఉందంటే..**

ప్లేబోయ్ సిన్సియర్ లవర్‌గా మారడం పాత కథే. చాన్నాళ్ల క్రితమే ఏఎన్నార్, నాగార్జున ఇలాంటి చిత్రాలతో మెప్పించారు. చూసీ చూడగానే ప్రేమలో పడటం, రొమాన్స్ కొంత అతిగా అనిపించినప్పటికీ ప్లేబాయ్ గెటప్‌లో ఆకట్టుకున్నాడు అఖిల్. ఫ్యామిలీ సీన్స్, లవ్‌స్టోరీ కూడా ఆకట్టుకుని ఫస్ట్‌హాఫ్ ఓకే అనిపిస్తుంది. కానీ సెకెండాఫ్‌లో ఇది కంటిన్యూ అవలేదు. ఇంటర్వెల్‌కి హీరోని విడిచి హీరోయిన్ వెళ్లిపోయిందంటే జరగబోయే కథను ప్రేక్షకుడు ఇట్టే ఊహించేయొచ్చు. అలాంటప్పుడు సెకెండాఫ్‌ను ఆసక్తికరంగా మలచాలి. కానీ కథనంపై వెంకీ దృష్టి సారించలేదు. సెకెండాఫ్‌లో హీరోని హీరోయిన్ ఎందుకు రిజెక్ట్ చేస్తుందో సరిగా చూపించలేకపోయాడు. దానికితోడు కథలో ఇమడని కామెడీ, పాటలు, ఫైట్లతో ద్వితీయార్థం ఆకట్టుకోలేకపోయింది. ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ, ఫైట్స్ వంటి అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ప్రావీణ్యం చూపించి సక్సెసైన వెంకీ.. కథను నడపడంలో మాత్రం విఫలమయ్యాడు. ట్విస్టులు లేని బలహీనమైన కథ కావడం, సెకెండాఫ్ కూడా గ్రాఫ్ పడిపోడంతో కొంత నిరాశపరచింది. 'మజ్ను' అనే పాత టైటిల్‌కు మిస్టర్ జత చేసినప్పటికీ కథ, కథనాల విషయాల్లో మాత్రం అప్‌డేట్ అవలేదు. నటీనటుల ప్రతిభ, ఇతర సాంకేతిక హంగులన్నీ ఉన్న ఈ చిత్రంలో కథనంపై కూడా మరింత దృష్టిపెట్టి ఉంటే ఫలితం మరో స్థాయిలో ఉండేది. ఎక్కువ అంచనాలు పెట్టుకోకుండా సరదాగా ఒకసారైతే చూడొచ్చు.

## పీసీకి... అంత ఇష్టమేంటి?



అందరూ నగలు కొనుక్కోడానికి ఎక్కువ ఖర్చు పెడతారు. లేదంటే బట్టలకో, ఇంటీరియర్ డిజైనింగ్ కోసమో పెడతారు. కానీ ప్రియాంకా చోప్రా ఏం చేసిందో తెలుసా? తన కుక్క కోసం బోలెడంత ఖర్చు పెట్టేస్తోంది. పీసీకి తన పెంపుడు కుక్క అంటే చాలా ఇష్టం. అందుకే ఈమధ్య కాస్త తీరిక దొరకగానే దానికోసం షాపింగ్ చేయడం మొదలు పెట్టింది. కొత్త డ్రెస్సులు కొంటోంది. వెయ్యో రెండు వేలో కాదు... ఏకంగా ముప్పయ్యారు వేలు పెట్టి ఒక జాకెట్ కూడా కొనేసింది. తన కుక్కతో ఉన్న ఫొటోల్ని ఆనందంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. కుక్కల్ని ఇష్టపడటంలో తప్పు లేదు కానీ మరీ ఇంత కాస్ట్లీ ఇష్టమేంటి పీసీ అంటూ కామెంట్ చేస్తున్నారు నెటిజన్స్.



## అంతకు మించి..



ఇటీవలే 'కథానాయకుడు'గా వచ్చి మెప్పించిన బాలకృష్ణ.... మరికొద్ది రోజుల్లో 'మహానాయకుడు'గా రానున్నారు. ఆ తర్వాత కూడా ఎక్కడా గ్యాప్ ఇచ్చేలా లేరాయన. వీలైనంత త్వరగా బోయపాటితో సినిమా మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారట. బాలయ్యకున్న మాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని కథలు అల్లుతాడు బోయపాటి. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన సింహా, లెజెండ్ చిత్రాలు బ్లాక్ బస్టర్స్‌గా నిలిచాయి. దాంతో హ్యాట్రిక్ మూవీని కూడా ఆ రేంజ్‌లోనే ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తన ఇటీవలి చిత్రం 'వినయ విధేయ రామ' నిరాశపర్చడంతో బాలయ్య సినిమాపై మరీ ఎక్కువ శ్రద్ధ పెడుతున్నాడట బోయపాటి. బాలయ్యను తన గత చిత్రాల్లో ఎంతో పవర్‌ఫుల్‌గా చూపించాడు. ఈసారి అంతకు మించి ప్రత్యేకంగా చూపించాలని ఆశపడుతున్నాడట. ఫిబ్రవరిలోనే సినిమా సెట్స్ మీదికి వెళ్లనుందని సమాచారం.

## ఇన్నేళ్లకు రీమేక్



అందమైన ప్రేమకథలను దక్షిణాది వారు ఎప్పుడూ ఆదరిస్తారు. అలా అందరికీ నచ్చిన చిత్రాల్లో సెల్వ రాఘవన్ తీసిన '7/జి బృందావన్ కాలనీ' ఒకటి. రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా తెరకెక్కిన ఈ చిత్రం తమిళ, తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకుంది. మంచి మ్యూజికల్ హిట్‌గా కూడా నిలిచింది. బెంగాలీ, కన్నడ, ఒడియా భాషల్లోనూ రూపొంది హిట్ కొట్టింది. పదిహేనేళ్ల తర్వాత ఇప్పుడు హిందీలోకి రీమేక్ అవుతోంది. చేస్తోంది ఎవరో కాదు... భారీ చిత్రాలకు పెట్టింది పేరైన సంజల్ లీలా భన్సాలీ. ప్రముఖ నటుడు జావెద్ జాఫ్రీ కొడుకు మజన్ జాఫ్రీ ఈ చిత్రంతో పరిచయం కానున్నాడు. భన్సాలీ లాంటివాడి చేతిలో పడిందంటే ఈ సినిమా మరెన్ని కొత్త అట్రాక్షన్స్ అద్దుకుంటుందో!

## మాస్టర్ పీస్ అయ్యేది కానీ..



రివ్యూ

**ఫిమేల్ ఓరియెంటెడ్ చిత్రాలతో దూసుకుపోతున్న కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'మణికర్ణిక'. మొదలుపెట్టిన నాటి నుండీ ఎన్నో వివాదాల్లో చిక్కుకుని, నిరంతరం వార్తల్లో నిలిచిన ఈ బయోపిక్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. మరి వాటిని 'మణికర్ణిక' అందుకుందో లేదో చూద్దాం.**

**కథ**

మణికర్ణిక (కంగనా) వీరనారి. ఈస్ట్ ఇండియా కంపెనీ కన్ను పడిన ఝూన్సీకి మణికర్ణిక అవసరం ఉందని గుర్తించి, యువరాజు గంగాధర్ రావుకిచ్చి వివాహం చేస్తారు. మణికర్ణిక పేరును లక్ష్మీబాయిగా మారుస్తారు. కోడలిగా కంటే తనకు రాణిగానే ఎక్కువ బాధ్యతలు ఉన్నాయని గుర్తిస్తుంది లక్ష్మీబాయి. తమ బిడ్డను శత్రువులు హతమార్చడంతో మరో బిడ్డను దత్తత తీసుకుంటారా దంపతులు. తర్వాత లక్ష్మీబాయి భర్త కూడా విషప్రయోగం కారణంగా మరణిస్తాడు. భర్త చివరి కోరిక మేరకు సింహాసనాన్ని అధిష్టించిన లక్ష్మీబాయి... తమ రాజ్యాన్ని హస్తగతం చేసుకోడానికి ప్రయత్నిస్తోన్న బ్రిటిష్ పాలకులను ఎలా ఎదుర్కొందనేది మిగతా కథ.

**ఎవరెలా?**

ఈ సినిమాతో కంగనా నటిగా మరిన్ని మెట్లు ఎక్కింది. బ్రిటిష్ అధికారికి తల వంచనని చెప్పే సన్నివేశంతో పాటు భర్త చనిపోయాక వైధవ్యం స్వీకరించకుండా సింహాసనాన్ని ఎక్కుతానని చెప్పే సన్నివేశంలో ఆమె నటన అద్భుతం. జిషుసేన్ గుప్తా, అతుల్ కులకర్ణి, అంకితా లోఖండే, డ్యానీ డెంజొప్ప తదితరులంతా తమ పాత్రలకు న్యాయం చేశారు. టెక్నీషియన్స్ విషయానికొస్తే... ఏ సీన్ క్రిష్ తీశాడో, ఏ సీన్ కంగనా తీసిందో తెలియదు కానీ వారి కష్టం తెరమీద కనిపిస్తుంది. సింపుల్ డైలాగ్స్ కూడా పవర్‌ఫుల్‌గా రాశాడు ప్రసూన్. సినిమాటోగ్రఫీ ఆ కాలంలోకి తీసుకెళ్తుంది. పాటలు శంకర్ ఎహసాన్ లాయ్ స్థాయిలో లేవు. నేపథ్య సంగీతం బాగుంది. ఎడిటర్ ఇంకాస్త కష్టపడి ఉండాల్సింది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు.

**విశ్లేషణ**

అందరికీ తెలిసిన కథల్ని సినిమాగా తీసేటప్పుడు కొత్తగా చూపించే ప్రయత్నం చేయాలి. లేదంటే తెలిసిన విషయమేగా అనుకుంటారు జనాలు. ఇక్కడా అదే జరిగింది. మొదటి భాగమంతా మణికర్ణిక స్వభావాన్ని ఎలివేట్ చేసేందుకు కేటాయించారు. రెండో భాగమంతా యుద్ధమే చూపించారు. దాంతో కొత్తగా ఏముంది అనిపిస్తుంది. సెకెండాఫ్ అంతా ఏదో కథ చెప్పుకుంటూ వెళ్లిపోయినట్టు అనిపిస్తుందే తప్ప సినిమాటిక్‌గా లేదు. దాంతో సెల్యులాయిడ్‌పై చూస్తున్నప్పుడు కలిగే అనుభూతిని ప్రేక్షకుడు మిస్సవుతాడు. కొన్నిచోట్ల పాటలు కూడా కథకు అడ్డొచ్చాయనిపిస్తుంది. దేశభక్తిని రేకెత్తించే పాట మాత్రం స్ఫూర్తిదాయకంగా ఉంది. క్లయిమాక్స్ అద్భుతంగా ఉంది. అయితే ఝూన్సీ రాణి గురించి మనకు తెలియని విషయాలేమీ లేకపోవడం, అదే విషయాన్ని మళ్లీ మళ్లీ చూపిస్తున్నట్టు అనిపించడంతో కాస్త విసుగొస్తుంది. కత్తెరకు కాస్త పని చెప్పి, కథనంలో స్పీడు పెంచి, చిన్నపాటి సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్‌తో సినిమాని నడిపివుంటే... 'మణికర్ణిక' కచ్చితంగా మాస్టర్ పీస్ అయ్యుండేది.

## టీజర్ టాక్



బాలీవుడ్ బాక్సాఫీసును ఏలే సల్మాన్ ఖాన్‌కి పోయినేడు చెప్పుకోదగ్గ సక్సెస్ లేదు. దాంతో ఈ యేడు ఎలాగైనా సూపర్ హిట్ కొట్టాలనే లక్ష్యంతో ఉన్నాడు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో నటిస్తోన్న 'భారత్' కోసం చాలా కష్టపడుతున్నాడు. రీసెంట్‌గా రిలీజైన టీజర్ చూస్తుంటే అతని కష్టం ఫలించేలానే అనిపిస్తోంది. 'చాలామంది నన్ను అడుగుతుంటారు... నీ జాతి ఏంటి, నీ కులమేంటి, నీ మతమేంటి' అంటూ టీజర్ మొదలైంది. 'మా నాన్న ఈ దేశం పేరునే నాకు పెట్టారు భారత్ అని. అంత గొప్ప పేరుకి కుల మతాల పేర్లు తగిలించి ఈ దేశానికి ఉన్న గౌరవాన్ని తగ్గించలేను' అన్న డైలాగ్‌తో ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ ఏంటనేది క్లారిటీ వచ్చేసింది. నేవీ ఆఫీసర్ డ్రెస్సులో హుందాగా ఉన్న సల్మాన్... మరో రెండు మూడు లుక్స్‌లో కూడా కనిపించి మెస్మరైజ్ చేశాడు. మరి సినిమాతో ఎంత ఎంటర్‌టైన్ చేస్తాడో చూడాలి.

## సూర్యకాంతం గడుసే!

మెగా ఫ్యామిలీ నుంచి వచ్చి, ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవాలని తపిస్తోంది నీహారిక. వెబ్ సిరీసులతో ఇంప్రెస్ చేసింది. యాంకర్‌గా మెప్పించింది. హీరోయిన్‌గా కూడా కాస్త డిఫరెంట్ దారిలోనే వెళ్తోంది. రొటీన్‌కి భిన్నంగా ఉండే కథల మీదే మనసు పడుతోంది. ఆ క్రమంలో ఆమె చేస్తోన్న సినిమా 'సూర్యకాంతం'. నీహారికతో 'ముద్దపప్పు ఆవకాయ్' వెబ్ సిరీస్ తీసిన ప్రణీత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. రాహుల్ విజయ్ ఆమెకు జోడీగా నటిస్తున్నాడు. ఆల్రెడీ ఫస్ట్ లుక్‌తో మంచి మార్కులు వేయించుకున్న ఈ రొమాంటిక్ కామెడీ మూవీ టీజర్‌ను శుక్రవారం వరుణ్ తేజ్ లాంచ్ చేశాడు. అందులో నీహారిక చాలా బబ్లీగా, క్యూట్‌గా ఉంది. మరోపక్క కాస్తంత తుంటరిగాను గడుసుగాను కూడా కనిపిస్తోంది. మరి ఈ సూర్యకాంతంలో ఇంకెన్ని షేడ్స్ ఉన్నాయో చూడాలంటే మార్చి 29న మూవీ రిలీజయ్యేవరకూ ఆగాల్సిందే.





## ఎఫ్ 2.. వంద కోట్లు దాటేసింది

వెంకటేష్, వరుణ్‌తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఎఫ్ 2'. దిల్‌రాజు నిర్మించారు. సంక్రాంతి సీజన్‌లో విడుదలైన ఈ సినిమా వందకోట్ల వసూళ్లను రాబట్టడంతో సక్సెస్‌మీట్ నిర్వహించారు చిత్ర బృందం. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'రెండు వారాల్లో వంద కోట్ల వసూళ్లు క్రాస్ అవడం గొప్ప విషయం. ఇంకా పెద్ద స్థాయి విజయాన్ని అందుకోవాలని ఆశిస్తున్నాను. ఒకప్పుడు సిల్వర్ జూబ్లీ, హండ్రెడ్ డేస్ వేడుకలు నిర్వహించేవారు. ఇప్పుడన్నీ యాభై కోట్లు, వంద కోట్లు వసూలైనప్పుడు చేసే సెలబ్రేషన్స్ మాత్రమే. ఈ సినిమాతో ఓ కొత్త ఒరవడిని సృష్టిస్తూ, హండ్రెడ్ క్రోర్ సినిమా పేరుతో షీల్డులను థియేటర్లకు పంపబోతున్నాం. ఈ సినిమా ఎడిటింగ్ సమయంలో అనిల్‌ను కన్విన్స్ చేసి కొన్ని సీన్స్ ట్రిమ్ చేశాం. వాటిలో ఐదు కామెడీ సీన్లను శనివారం నుంచి సినిమాకి కలుపుతున్నాం. ప్రేక్షకులు కేరింతలు కొట్టేలా ఈ సీన్స్ ఉంటాయి' అన్నారు. తమన్నా మాట్లాడుతూ 'దిల్‌రాజు గారు నా లక్కీ చార్మ్. 'హ్యాపీడేస్'తో నా కెరీర్‌కి ఫస్ట్ హిట్ ఇచ్చారు. ఇప్పుడీ చిత్రంతో మరో హిట్. విడుదల సమయంలో అనిల్ కొంత కంగారుపడ్డారు. వంద కోట్ల వసూళ్లు దాటాక ఆయన ముఖంలో నవ్వు చూశాను. ఆయన లేకుండా వంద కోట్లు సాధ్యం కాదు. నేను ఒకే ఏడాది మూడు సినిమాల్లో నటించొచ్చు. కానీ వాటిలో కొన్ని చిత్రాల్లోనే మెప్పించగలను. అదంతా దర్శకుడి గొప్పతనమే. ఇంత పెద్ద విజయాన్నిచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని చెప్పింది. ప్రగతి మాట్లాడుతూ 'సినిమా హిట్ అవుతుందనుకున్నాను కానీ ఈ స్థాయి విజయం ఊహించలేదు. నా క్యారెక్టర్‌ను, సినిమాను ఆదరించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు' అని తెలిపారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ప్రతి దర్శకుడికీ వంద కోట్లు అనేది ఒక డ్రీమ్. ఈ సినిమాతో నాకా డ్రీమ్ తీరింది. ఇంకాస్త ఎక్కువ నవ్వుకునేందుకు మరికొన్ని సీన్స్ యాడ్ చేస్తున్నాం. వంద కోట్ల గ్రాస్ క్రెడిట్ నా ఒక్కడిది కాదు.. టీమ్ మొత్తానిది. పన్నెండేళ్లుగా వదిలేసిన కామెడీ టైమింగ్ ఉన్న క్యారెక్టర్‌ను ఈ సినిమాలో మళ్లీ వెంకటేశ్ పోషించారు. ఆయనకది స్పెషల్ కిక్ ఇచ్చింది. వరుణ్ ఇంతవరకూ కామెడీ క్యారెక్టర్ చేయలేదు. ఆయనకది కిక్ ఇచ్చింది. నా గత మూడు చిత్రాలు ఓవర్సీస్‌లో పెద్దగా వసూళ్లు రాబట్టలేదు. ఈ సినిమాతో నాకు ఆ కిక్ వచ్చింది. 'హ్యాపీడేస్', 'బాహుబలి' తర్వాత ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవడం తమన్నాకు కిక్ ఇచ్చింది. మెహ్రీన్‌కి ఈ సినిమాతో మరింతగా గుర్తింపు వచ్చింది. ఆమెకది కిక్ ఇచ్చింది. ఇలా టీమ్ అందరికీ ఒక్కో రూపంలో ఈ విజయం కిక్కిచ్చింది' అన్నారు.

| నెక్ గుడ్ల ధరలు (100కు) | ఫామ్‌గేట్ | రిటెయిల్ |
|---|---|---|
| హైదరాబాద్ | రూ.402 | రూ.4.60 |
| వరంగల్ | రూ.404 | రూ.4.60 |

**మార్కెట్**

సెన్సెక్స్ ↓169 36,025

నిఫ్టీ ↓69 10,780

## సెన్సెక్స్‌కు 169 పాయింట్లు నష్టం

**ముంబై:** దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టపోయాయి. సెన్సెక్స్ ప్రారంభంలో దూసుకెళ్లినా చివర్లో మాత్రం 169 పాయింట్లు నష్టపోయి 36,025.54 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ఇది 250 పాయింట్లు లాభపడి 36,474 స్థాయిని తాకింది. మారుతీ సుజుకీతోపాటు, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ, టీసీఎస్ లాభాలు తగ్గడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. మారుతీ షేరు ఏకంగా 8 శాతం నష్టపోయి రూ.6,516 వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈ నిఫ్టీ 69 పాయింట్లు నష్టపోయి 10,780 వద్ద క్లోజయింది. ఈవారం సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్లు పడిపోయాయి. మారుతీ సుజుకీ లాభాలు ఏకంగా 17 శాతం తగ్గిపోవడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంటు దెబ్బతిందని బ్రోకర్లు తెలిపారు. దీంతోపాటు హీరో మోటోకార్ప్, ఐసీఐసీఐ, ఏసియన్ పెయింట్స్, మహీంద్రా, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ 4.23 శాతం వరకు నష్టపోయాయి. యెస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, ఎయిర్‌టెల్, టీసీఎస్ 2.71 శాతం వరకు లాభపడ్డాయి. ఐటీ, ఫార్మా సెక్టర్లు మినహా మిగతావన్నీ నష్టాల్లో ముగిశాయి.

## 100 కోట్లతో నాట్కో అగ్రి కెమికల్స్ ప్లాంట్

**హైదరాబాద్, వెలుగు :** ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వద్ద రూ. 100 కోట్ల పెట్టుబడితో అగ్రి కెమికల్స్ ప్లాంట్‌ను పెట్టబోతున్నట్లు నాట్కో ఫార్మా శుక్రవారం ప్రకటించింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు సంబంధించిన పనులను ఇప్పటికే మొదలు పెట్టినట్లు స్టాక్ ఎక్స్‌చేంజ్‌కు నాట్కో ఫార్మా తెలిపింది. 2019 చివరి నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని, అగ్రి కెమికల్ టెక్నికల్ గ్రేడ్, ఫార్ములేషన్స్ రెండింటినీ అక్కడ ఉత్పత్తి చేస్తామని కూడా పేర్కొంది. ఫార్మాస్యూటికల్స్, కెమికల్స్ రంగాలలో ఇప్పటికే ఉన్న అపారమైన అనుభవం, ఇప్పుడు వినూత్నమైన అగ్రి కెమికల్స్ ఉత్పత్తుల రూపకల్పనకు ఉపయోగపడుతుందనే ఆశాభావాన్ని నాట్కో ఫార్మా వ్యక్తం చేస్తోంది. మాలిక్యూల్స్‌ను ఎంపిక చేసుకోవడంలోనూ తమ నైపుణ్యం దోహదపడుతుందని కంపెనీ వర్గాలు వివరించాయి.




# జోరుకు బ్రేక్

### అమ్మకాలు, లాభంలో క్షీణత | 8% నష్టపోయిన షేరు | ప్రాఫిట్‌లో 17% తగ్గుదల

**న్యూఢిల్లీ:** మనదేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతీ సుజుకీ నికరలాభం గత నెలతో ముగిసిన క్వార్టర్‌కు (క్యూ3) 17 శాతం తగ్గి రూ.1,489 కోట్లుగా నమోదయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి రూ.1,799 కోట్ల లాభం సాధించింది. ఈసారి రూ.1,731 కోట్ల లాభం ఆర్జిస్తుందన్న అంచనాలను అందుకోలేకపోయింది. కంపెనీ మొత్తం ఆదాయం 0.71 శాతం పెరిగి రూ.19,668 కోట్లకు చేరుకుంది. దీంతో మారుతీ సుజుకీ షేరు విలువ 8.11 శాతం తగ్గి రూ.6,469 వద్ద ముగిసింది. గత అక్టోబరు-డిసెంబరు మధ్యకాలంలో 4 లక్షల 28 వేల వాహనాలను అమ్మింది. గత ఏడాది ఇదే కాలం అమ్మకాలతో పోలిస్తే ఇవి 0.6 శాతం తక్కువ. నికర అమ్మకాల విలువ వార్షిక ప్రాతిపదికన 0.10 శాతం తగ్గి రూ.18,926 కోట్లకు చేరుకుంది. పరికరాల ధరలు, అమ్మకం వ్యయాలు పెరగడం, రూపాయి విలువ తగ్గడం, కొత్త మోడల్స్, కొత్త ఇంజన్ల వల్ల తరుగుదల ఖర్చులు ఎక్కువ కావడం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపింది. ‘‘దేశీయ మార్కెట్లో ప్యాసింజర్ అమ్మకాల వృద్ధి 8-10 శాతం ఉంటుందని సియామ్ అంచనా వేసింది. వాహనరంగం 4.4 శాతం మాత్రమే వృద్ధి సాధిస్తుందని తెలిపింది. పండగ అమ్మకాలు కూడా తక్కువగా ఉన్నాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నా, ఈ మూడు క్వార్టర్లలో మా కంపెనీ 7.2 శాతం పెరుగుదల సాధించింది’’ అని మారుతీ సుజుకీ విడుదల చేసింది ప్రకటన పేర్కొంది.

## ఎల్&టీ లాభం రూ.2,042 కోట్లు

**న్యూఢిల్లీ:** లార్సన్ అండ్ టూబ్రో (ఎల్&టీ) అంచనాలను అందుకుంది. గత డిసెంబరుతో ముగిసిన మూడో క్వార్టర్‌లో ఈ కంపెనీ నికర లాభం ఏకంగా 37 శాతం పెరిగి రూ.2,042 కోట్లుగా నమోదయింది. నిర్వహణపరమైన సామర్థ్యం, రాబడులు బాగా పెరగడంతో లక్ష్యాలను చేరుకుంది. మొత్తం ఆదాయం 24.2 శాతం పెరిగి రూ.35,709 కోట్లుగా నమోదయింది. ఈ క్వార్టర్‌లో అంతర్జాతీయ ఆదాయం 32 శాతం పెరిగి రూ.11,476 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3తో పోలిస్తే ఆర్డర్ల విలువ 12 శాతం తగ్గి రూ.42,233 కోట్లుగా నమోదయింది. మొత్తం ఆర్డర్లలో ఇన్‌ఫ్రా విభాగం వాటాయే




50 శాతం ఉంది. ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెవీ సివిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పవర్ బిజినెస్ విభాగాల్లో ఆర్డర్ల రాక ఆలస్యమైందని కంపెనీ తెలిపింది. కన్సాలిడేటెడ్ ఆర్డర్ బుక్ విలువ గత నెల నాటికి రూ.2.48 లక్షల కోట్లుగా నమోదయింది. ఈబీఐటీడీఏ (వడ్డీ, పన్ను, తరుగుదల, అప్పులకు ముందున్న ఆదాయాలు) 27.2 శాతం పెరిగి రూ.3,997 కోట్లకు చేరుకుంది. మార్జిన్ 10.9 శాతం నుంచి 11.2 శాతానికి పెరిగింది. ఇన్‌ఫ్రా విభాగం మొత్తం ఆదాయం 23.1 శాతం పెరిగి రూ.18,371 కోట్లుగా నమోదయింది. ఈబీఐటీ (వడ్డీ, పన్ను చెల్లింపునకు ముందున్న ఆదాయాలు) 22.2 శాతం తగ్గిపోవడంతో రూ.766 కోట్లకు పడిపోయాయి. మార్జిన్ 240 బేసిస్ పాయింట్లు తగ్గిపోయి 4.2 శాతానికి చేరింది. హెవీ ఇంజనీరింగ్ వ్యాపారం నుంచి రూ.693 కోట్లు, డిఫెన్స్ ఇంజనీరింగ్ నుంచి రూ.1,045 కోట్లు, హైడ్రోకార్బన్ నుంచి రూ.3,777 కోట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ విభాగం నుంచి రూ.1,567 కోట్లు, పవర్ బిజినెస్ నుంచి రూ.908 కోట్లు వచ్చాయి. ఇతర ఆదాయాలు రూ.606 కోట్లుగా నమోదయ్యాయి.

# కొత్తరకం దిండ్లు, దుప్పట్లు

### మార్కెట్లోకి స్లీప్‌వెల్ హోం కంఫర్ట్ ఉత్పత్తులు

**హైదరాబాద్, వెలుగు:** స్లీప్ వెల్ మాట్రెసెస్ నూతన హోం కంఫర్ట్ ఉత్పత్తుల శ్రేణిని మార్కెట్లోకి విడుదల చేసింది. దిండులు, బెడ్ షీట్లు, కంఫర్టర్, బ్లాంకెట్స్, మాట్రెసెస్ ప్రొటెక్టర్ వంటి ఉత్పత్తుల కొత్త మోడల్స్ ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. పరుపులతో పాటు సరైన నిద్రకు కావల్సిన అన్ని రకాల ఉత్పత్తులను అందించాలని ఈ సరికొత్త మోడల్స్ ను ప్రవేశపెట్టినట్లు స్లీప్ వెల్ హోం కంఫర్ట్ బిజినెస్ హెడ్ భూషన్ జి పాటక్ తెలిపారు. దేశ వ్యాప్తంగా హైదరాబాద్ తో పాటు 11 తయారీ యూనిట్లు ఉన్నాయని, దేశానికి మధ్యలో మరో ప్లాంట్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు. రూ.8 వేల నుండి రూ.1 లక్షా 40 వేల వరకు తమ పరుపుల శ్రేణి అందుబాటులో ఉందని చెప్పారు. దేశీయంగా పరుపుల మార్కెట్ రూ.10 వేల కోట్లకు పైగానే ఉంటుందని, దీన్లో అనార్గనైజ్డ్ మార్కెట్ వాటా 40 శాతంగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. మొత్తం ఆర్గనైజ్డ్ మార్కెట్ లో తమ వాటా 35-40 శాతంగా ఉంటుందని తెలిపారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1500 కోట్ల టర్నోవర్ సాధించగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ ను




సాధిస్తామని ధీమా వ్యక్తం చేసారు. దేశ వ్యాప్తంగా 4 వేల డీలర్స్ ఉండగా, తెలంగాణలో 300 మంది డీలర్లు ఉన్నారని వెల్లడించారు.

## డీల్‌కు సీసీఐ ఓకే

### హెచ్‌యూఎల్-జీఎస్‌కేసీహెచ్ విలీనం ముందడుగు




**న్యూఢిల్లీ :** గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ (జీఎస్‌కే సీహెచ్ ఇండియా), హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)ల విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతించింది. ఈ రెండు కంపెనీల అమాల్గమేషన్‌కు రూపొందించిన స్కీమును సీసీఐ ఆమోదించింది. ఈ డీల్‌ను పూర్తి ఈక్విటీ ప్రాతిపదికన రెండు కంపెనీలూ ప్రతిపాదించాయి. సీసీఐ అనుమతితో లెటర్‌ను శుక్రవారం అందుకున్నట్లు గ్లాక్సోస్మిత్‌క్లైన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. ఈ విలీన స్కీముకు ఇంకా పలు రెగ్యులేటరీ అనుమతులు రావాల్సి ఉంది. సెబీ, ఎన్‌సీఎల్‌టీల ఆమోదం కూడా రెండు కంపెనీల విలీన ప్రతిపాదనకు అవసరమే. ఇండియాతోపాటు 20 దేశాలలోని హార్లిక్స్, బూస్ట్ సహా గ్లాక్సోస్మిత్‌క్లైన్ హెల్త్ ఫుడ్ పోర్ట్‌ఫోలియోను హెచ్‌యూఎల్ తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ డీల్ విలువను రూ. 27,750 కోట్లుగా నిర్ణయించారు.

## రాష్ట్రంలో సదరన్ ట్రావెల్స్ 'హాలీడే బజార్'లు

**హైదరాబాద్, వెలుగు :** ట్రావెల్, టూరిజం రంగాలలో పేరొందిన సదరన్ ట్రావెల్స్ తెలంగాణ రాష్ట్రంలోని పలు నగరాల్లో 'హాలీడే బజార్'లను నిర్వహించనుంది. దేశ, విదేశాలకు విహారయాత్రలకు వెళ్లే పర్యాటకుల కోసం ఈ హాలీడే బజార్‌లను నిర్వహిస్తున్నట్లు సదరన్ ట్రావెల్స్ తెలిపింది. వివిధ టూర్ ప్యాకేజ్‌ల గురించి పూర్తి సమాచారాన్ని పర్యాటకులకు తమ ఉద్యోగులు వివరిస్తారని, వారికేమైనా సందేహాలుంటే వాటిని తీరుస్తారని పేర్కొంది. తాము నిర్వహించే టూర్ ప్యాకేజీల మీద ఈ హాలీడే బజార్‌లో డిస్కౌంట్లు కల్పించనున్నట్లు కూడా సదరన్ ట్రావెల్స్ వెల్లడించింది. క్యాష్‌బ్యాక్ ఆఫర్లు కూడా ఉంటాయని తెలిపింది. ఈ నెల 26,27 తేదీలలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, సూర్యాపేట్‌లలో ఈ హాలీడే బజార్‌లు నిర్వహించనున్నామని వెల్లడించింది. ట్రావెల్ డెస్టినేషన్ ఎక్స్‌పర్ట్స్ అందరినీ ఒకే చోట కలుసుకునే అవకాశం ఈ హాలీడే బజార్ కల్పిస్తుందని పేర్కొంది. దేశ, విదేశాలలో విలాసవం



తమైన, వరల్డ్ క్లాస్ టూర్ ప్యాకేజ్‌లను సదరన్ ట్రావెల్స్ అందిస్తోంది. పదేళ్లుగా అంతర్జాతీయ టూరిజంను సంస్థ ప్రోత్సహిస్తోంది. 48 ఏళ్లుగా పర్యాటకులకు సేవలందిస్తున్న సదరన్ ట్రావెల్స్‌కు కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ నుంచి ఎనిమిది సార్లు బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో సెంట్రల్ హెడ్ ఆఫీస్ ఉండగా, రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరాలన్నింటిలోనూ సదరన్ ట్రావెల్స్ ఆఫీసులున్నాయి.

# యెస్ బ్యాంక్ షేరు షంషేర్

**న్యూఢిల్లీ:** యెస్ బ్యాంక్ షేరు వరుసగా రెండో రోజైన శుక్రవారం కూడా దూసుకెళ్లింది. రెండు రోజుల్లో 13 శాతం లాభపడింది. సంస్థ కొత్త ఎండీ, సీఈఓగా రవ్‌నీత్ గిల్‌ను నియమించడానికి ఆర్‌బీఐ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో షేరు ధర శుక్రవారం మరో ఐదు శాతం పెరిగి రూ.219కు చేరుకుంది. క్యూ3లో ఫలితాల వెల్లడి నేపథ్యంలో గురువారం దీని షేరు ధర భారీగా పెరిగింది. బ్యాంక్ సీఈఓ విషయమై అనిశ్చితి తొలగిపోవడంతో ఎనిమిది శాతం లాభంతో రూ.214 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ 19 శాతం ఎగిసి రూ.235ను తాకింది. జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ ఇండియా సీఈఓగా వ్యవహరిస్తున్న గిల్ మార్చి కంటే ముందే పదవీ బాధ్యతలు స్వీకరిస్తారని బ్యాంకు వర్గాలు తెలిపాయి. బ్యాంక్ ప్రమోటర్లు రాణా కపూర్, ఆయన మరదలు బిందు కపూర్‌లు ఈ నెలలోపే రాజీనామా చేయాలని ఆర్‌బీఐ గతంలోనే ఆదేశించింది. కపూర్ పదవీ కాలాన్ని మరో మూడేళ్లపాటు పొడిగించాలన్న బోర్డ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈయన హయాంలో మొండి బకాయిల విషయంలో అవకతవకలు జరగడమే ఇందుకు కారణమని వార్తలు వచ్చాయి. ఇదిలా ఉంటే యెస్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరంలో క్యూ 3 ఫలితాలను గురువారం ప్రకటించింది. నికరలాభం ఏడు శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో రూ.1,077 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.1,002 కోట్లకు పడింది. మొత్తం ఆదాయం ఏడు శాతం ఎగసి రూ.3,557 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 41 శాతం పెరిగి రూ.2,666 కోట్లకు చేరింది. 42 శాతం వృద్ధితో రుణాలు రూ.2,43,885 కోట్లకు, డిపాజిట్లు 30 శాతం వృద్ధి చెంది రూ.2.22,758 కోట్లకు చేరాయి. గత క్యూ3లో 1.72 శాతంగా ఉన్న స్థూల మొండిబకాయిలు ఈ క్యూ3లో 2.1 శాతానికి పెరిగాయి.




## కొత్త దివాలా చట్టం రాజ్యాంగబద్ధమే: సుప్రీం

**న్యూఢిల్లీ:** దివాలా, రుణగ్రస్త చట్టం (ఐబీసీ) రాజ్యాంగవిరుద్ధమన్న వాదనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఐబీసీకి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కొట్టేసింది. ఈ చట్టం కింద ఆపరేషనల్ క్రెడిటర్లను ఫైనాన్షియల్ క్రెడిటర్లతో సమానంగా చూడాలన్న వినతులను తిరస్కరించింది. తాము అప్పులు ఇచ్చిన కంపెనీలు దివాలా తీసినప్పుడు, వాటి కొనుగోలుకు తమనూ అనుమతించాలన్న విజ్ఞప్తిని తిరస్కరించింది. అప్పులు వసూలు కాని సందర్భంలో దివాలా ప్రక్రియను ప్రారంభించడానికి అనుమతించకపోవడం న్యాయం కాదన్న వాదననూ తోసిపుచ్చింది. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్‌లో ఫైనాన్షియల్ క్రెడిటర్లకు మాత్రమే చోటు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తన సొంత కంపెనీ దివాలా తీస్తే దానిని కొనుక్కోవడానికి ప్రమోటర్లకు అవకాశం కల్పించడానికి కూడా కోర్టు అనుమతించలేదు. ఐబీసీ 12ఏ సెక్షన్ ప్రకారం వారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపింది.




హాంకాంగ్ కంపెనీ నెక్స్‌గో అవిటా పేరుతో ఇండియా మార్కెట్లోకి ల్యాప్‌టాప్‌లను విడుదల చేసింది. వీటి ధరలు రూ.27 వేల నుంచి రూ.89 వేల వరకు ఉన్నాయి. ఆవిష్కరణ కార్యక్రమంలో నటి నేహా శర్మ, కంపెనీ సీఈఓ అలెక్స్ చంగ్ పాల్గొన్నారు.

# సిటీలో కో వర్కింగ్ స్పేస్ జోరు



**హైదరాబాద్, వెలుగు:** నగరంలో కో వర్కింగ్ స్పేస్ గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఇక్కడి మౌలిక సదుపాయాలు, ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే అందుబాటు ధరలు, తక్కువ అద్దె, స్థిరమైన ప్రభుత్వం, భద్రత వంటి వాటితో చాలా కంపెనీలు ఇక్కడే తమ సెంటర్లను ఏర్పాటు చేయడానికి మొగ్గు చూపుతున్నాయి. దీనికి తోడు స్టార్టప్స్ కూడా పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతుండడంతో కో వర్కింగ్ స్పేస్ కు డిమాండ్ భారీగా పెరుగుతోంది. స్టార్టప్ లకు స్వంతంగా బిల్డింగ్ ఏర్పాటు చేసుకుని నిర్వహించుకునే సామర్థ్యం ఉండదు కాబట్టి కావల్సినన్ని సీట్లకు కో వర్కింగ్ స్పేస్ తీసుకోవడం ఉత్తమంగా భావిస్తున్నారు.

**ఐటీ కంపెనీలదే అగ్ర స్థానం**

కో వర్కింగ్ స్పేసెస్ తో కలిపి మొత్తం లీజింగ్ లో ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీల వాటా దాదాపు 44 శాతంగా ఉంది. తయారీ రంగం 26 శాతం, ఇతర సేవల వాటా 29 శాతంగా నమోదైంది. 2018 సెకండ్ హాఫ్ లో కొత్త సప్లై దాదాపు 70 శాతం పెరిగి 20 లక్షల చదరపు అడుగులకు చేరింది. ఇక అద్దె కూడా భారీగానే పెరిగింది. గత రెండు మూడేళ్లలో ఒక చదరపు అడుగుకు దాదాపు 20-25 శాతం ధర పెరిగింది. ప్రాజెక్ట్ నిర్మించే ప్రాంతం, డెవలపర్, మౌలిక వసతులు వంటి వాటిని బట్టి ధర ఆధారపడి ఉంటుంది. సగటున ఒక చదరపు అడుగుకు దాదాపు రూ.5వేల నుండి రూ.7 వేల వరకు ఉంటోంది. సిటీ అంతటా డిమాండ్ ఉన్నప్పటికీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో డిమాండ్ అధికంగా ఉంటోందని క్రెడాయ్ తెలంగాణ ప్రెసిడెంట్ రాంరెడ్డి తెలిపారు. డిమాండ్ కు తగ్గ సప్లై ఉంటోందని అన్నారు.

**2020 కల్లా రెండింతల వృద్ధి**

సిటీలో కో వర్కింగ్ స్పేస్ కూడా భారీగా వృద్ధి చెందుతోంది. దేశీయంగా కూడా కో వర్కింగ్ స్పేస్ గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఇండియాలో 2014 లో కో వర్కింగ్ స్పేస్ 2 లక్షల చదరపు అడుగుల మేర ఉండగా, 2017 నాటికి 15 లక్షల చదరపు అడుగులకు చేరుకుంది. 2018 లో ఏకంగా 80 లక్షల చదరపు అడుగులకు కో వర్కింగ్ స్పేస్ వృద్ధి చెందింది. 2020 నాటికి కోటి చదరపు అడుగులకు చేరుకుంటుందని కేపీఎమ్జి తమ రిపోర్ట్ లో వెల్లడించింది. దేశీయంగా స్టార్టప్ లు రోజురోజుకూ పెరుగుతుండడంతో కో వర్కింగ్ స్పేస్ ఊపందుకుంటోంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 5200 స్టార్టప్ లు ఉండగా, 2020 నాటికి ఇది రెండింతలు పెరిగి 10,500 స్టార్టప్ లు వెలుస్తాయని అంచనా. స్టార్టప్ లలో చైనా, యూఎస్ తరువాతి స్థానంలో ఇండియా నిలిచింది. 72 శాతం 35 సంవత్సరాల లోపు ఉన్న ఫౌండర్లతో ఇండియా యంగెస్ట్ స్టార్టప్ దేశం గా పేరుకెక్కింది. స్టార్టప్‌ల వృద్ధితో తో కోవర్కింగ్ స్పేస్ కు డిమాండ్ పెరుగుతుంది.

**కో వర్కింగ్ స్పేస్ స్టార్టప్ నిధుల సమీకరణ**

నగరానికి చెందిన కో వర్కింగ్ స్పేస్ స్టార్టప్ ఐకెవా తమ సేవలను మరింత విస్తరించడానికి ఇటీవలే నిధులను సమీకరించుకుంది. కో వర్కింగ్ స్పేస్ కు పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని ఈ నిధులతో మొత్తం 3 వేల సీట్ల సామర్థ్యంతో మరో 15 సెంటర్లను ఏర్పాటు చేయనుంది. గత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లో 40 శాతం వృద్ధి సాధించగా, ఈ యేడాది 80 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ తో పాటు 5 మెట్రో నగరాల్లో 8 సెంటర్లు ఐకెవాకు ఉన్నాయి. హైదరాబాద్ లో ఉన్న 2 సెంటర్లు నిండిపోవడంతో 3 నెలల్లో మరో 2 కో వర్కింగ్ స్పేస్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది.



**పే అండ్ యూజ్ ఫెసిలిటీ**

ప్రస్తుతం కో వర్కింగ్ స్పేస్ డిమాండ్ 23 శాతంగా ఉండగా, రాబోయే రోజుల్లో 40–50 శాతానికి పెరుగుతుంది. నీటి వసతి నుండి సెక్యూరిటీ వరకు ప్రతీది మేమే చూసుకుంటాం. ఒక సీట్ కు రూ.4వేల నుండి చార్జి చేస్తున్నాం. ప్లగ్ అండ్ పే మోడల్ లో సేవలు వినియోగించుకోవచ్చు. చిన్న కంపెనీలు ఎక్కువగా ఇలాంటి సౌకర్యాన్ని కోరుకుంటున్నాయి. కో వర్కింగ్ లో కావల్సినప్పుడు వేరే ప్రదేశానికి మారడం కూడా సులువే. సరైన స్థలం, మంచి ప్రాంతాన్ని ఎంచుకోవడంతో పాటు అందుబాటులో రియల్ ఎస్టేట్ ధర వంటివి ఇందులోని సవాళ్లు.

- మౌనిక మిశ్రా, ఫౌండర్, ఐకెవా.





# సై అంటే సై

పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో తొలివన్డేలో కివీస్‌ను బోల్తాకొట్టించిన కోహ్లీ అండ్ కో అదే ఉత్సాహంతో రెండో వన్డేకు సై అంటోంది. సొంతగడ్డపై ఎదురులేదని కాలరెగరేస్తున్న న్యూజిలాండ్‌కి మరో షాకిస్తామని టీమిండియా కాన్ఫిడెంట్‌గా చెబుతుంటే.. ఈ సారి కోహ్లీసేన దూకుడును అడ్డుకుంటామని ఆ జట్టు అంటోంది.

## నేడు ఇండియా – న్యూజిలాండ్ రెండో వన్డే

### ఉత్సాహంలో ఇండియా.. ప్రతీకారం కోసం కివీస్



**మౌంట్ మాంగనీ:** తొలి వన్డేలో టీమిండియా ఇచ్చిన షాక్‌తో మైండ్‌బ్లాంక్ అయిన న్యూజిలాండ్ శనివారం జరిగే రెండో వన్డేకు రెడీ అయింది. ఈ మ్యాచ్‌లో అయినా గెలిచి పరువు నిలుపుకోవాలని కివీస్ ఆరాటంతో ఉంటే.. రెండో వన్డేలోనూ గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యత కొనసాగించాలని కోహ్లీసేన ఉత్సాహంతో ఉంది. వరల్డ్ కప్ సన్నాహకాల్లో ఇండియా ఈ మ్యాచ్‌లో ఒకటి రెండు ప్రయోగాలు చేసే అవకాశముంది. సస్పెన్షన్ నుంచి బయటపడ్డ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య జట్టులో చేరే అవకాశమున్నప్పటికీ ఈ మ్యాచ్‌లో ఆడే చాన్సుండకపోవచ్చు. అయితే పిచ్ కండిషన్ ఆధారంగా తొలి వన్డేలో చాన్స్ కొట్టేసిన ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్ ప్లేస్‌లో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు ప్లేస్ ఇవ్వాలని టీమ్‌మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. ఇక నేపియర్ వన్డేలో 23 రన్స్ కొట్టిన హైదరాబాదీ అంబటి రాయుడుకు రెండో వన్డేలోను ఆడే చాన్సుంటుంది. అన్నిటికంటే ముఖ్యంగా శిఖర్ ధవన్ ఫామ్‌లోకి రావటంతో టీమిండియా ఉత్సాహం రెట్టింపైంది. చాలా కాలం తర్వాత నేపియర్ వన్డేలో చెలరేగిన ధవన్ అజేయంగా 75 రన్స్ చేయడంతో కోహ్లీసేన ఖుషీగా ఉంది. ధవన్ ఇదే ఫామ్ కొనసాగిస్తే మిగతా మ్యాచ్‌ల్లో టీమిండియాకు తిరుగుండదని కోహ్లీసేన యోచన. అయితే తొలి వన్డేలో కివీస్‌ను ఓడించినంత సులువుగా మిగతా మ్యాచ్‌ల్లోనూ విజయం సులువుకు కాపోవచ్చని మరింత ధాటిగా ఆడాల్సి ఉంటుందని టీమిండియా భావిస్తుంది. హోం గ్రౌండ్ అడ్వాంటేజ్‌తో పాటు బ్యాటింగ్, బౌలింగ్ బలం ఆ జట్టుకు ఎప్పుడూ ఉంటాయని ఏ మాత్రం లైట్ తీసుకున్నా తేడా వస్తుందని ఓ అంచనాకొచ్చింది. ఇక సీన్ రివర్సవడంతో తొలి వన్డేలో బోల్తా కొట్టిన కివీస్ రెండో వన్డే కోసం పక్కా ప్లాన్ రెడీ చేస్తోంది. సొంతగడ్డపై చివరి సారి జరిగిన వన్డే సిరీస్‌లో 4-0 తేడాతో గెలిచిన కివీస్ అదృష్టం ఈ సిరీస్‌లో తారుమారయ్యే అవకాశముందని యోచిస్తోన్న ఆ జట్టు భారీ స్కోరుపైనే గంపెడాశలు పెట్టుకుంది. టీమిండియా స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ మ్యాజిక్ బౌలింగ్‌తో పాటు, షమీ చెలరేగిపోవడంతో బ్రహ్మాండమైన బ్యాట్స్‌మన్ ఉన్నా నేపియర్ వన్డేలో న్యూజిలాండ్ తక్కువ స్కోరుకే ఆలౌట్ అయింది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ ఆ ఇద్దరు స్పిన్నర్లతోనే ప్రమాదమని కివీస్ కంగారుపడుతోంది.. ఈ మ్యాచ్‌లో అయినా బిగ్‌టార్గెట్‌తో టీమిండియాకు పరీక్ష పెట్టాలని ఆశతో ఉంది. పేస్ బౌలర్లు కూడా రాణించి కట్టడి చేయగలిగితే ఇండియాను ఓడించవచ్చని అనుకుంటోంది. బే ఓవల్ మైదానంలో న్యూజిలాండ్ ఇప్పటి వరకూ ఆరు వన్డేలు ఆడితే మూడు మ్యాచ్‌లు గెలిచి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

**ఇండియా:** కోహ్లీ (కెప్టెన్), రోహిత్‌శర్మ, శిఖర్ ధవన్, ధోనీ, కేదార్ జాదవ్, దినేశ్‌కార్తీక్, విజయ్‌శంకర్, శుభ్‌మన్‌గిల్, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, భువనేశ్వర్‌కుమార్, సిరాజ్, ఖలీల్ అహ్మద్, జడేజా, పాండ్య.

**న్యూజిలాండ్:** విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, టామ్ లాంథమ్, మార్టిన్ గప్టిల్, కొలిన్ డి గ్రాండ్‌హోమ్, ట్రెంట్ బౌల్ట్, నికోల్స్, బ్రెస్‌వెల్, ఫెర్గూసన్, హెన్రీ, కొలిన్ మన్రో, ఇష్ సోధి, శాట్నర్, టిమ్ సౌతీ

**1**

న్యూజిలాండ్‌పై మరో సెంచరీ కొడితే ఆ జట్టుపై సెహ్వాగ్ చేసిన ఆరుసెంచరీల రికార్డును కోహ్లీ సమం చేస్తాడు

**10**

మరో పది రన్స్ చేస్తే రవీంద్ర జడేజా వన్డేల్లో 2000 రన్స్ క్లబ్‌లో చేరతాడు.

**2**

కివీస్ ఫాస్ట్ బౌలర్ సౌతీ మరో రెండు వికెట్లు పడగొడితే.. ఇండియాపై అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా రికార్డుల్లోకెక్కుతాడు.


**ఉదయం: 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ లో ప్రత్యక్ష ప్రసారం**

**టీమిండియాలో పోటీ పెరిగింది**

“టీమిండియాలో చోటు కోసం ప్లేయర్ల మధ్య పోటీపెరిగింది. షా, శుభ్‌మన్ గిల్ లాంటి ప్లేయర్లు బాగా రాణిస్తున్నారు. జట్టులో చోటు కోసం చాలా మంది పోటీపడుతున్నారు. మన బెంచ్ సత్తా ఏమిటో, ఎంత బలంగా ఉందో నిరూపిస్తున్నారు. ఫైనల్ లెవెన్ సంగతేమో కానీ, జట్టుకు ఎంపికయ్యే 15 మంది మధ్యే చాలా పోటీ ఉంది. ఇంతకు ముందు న్యూజిలాండ్‌లో ఆడాను, ఇక్కడ ఎలా ఆడాలో తెలుసు, ఫుట్‌వర్క్‌లో మార్పులు చేయలేదు’

**- శిఖర్ ధవన్, టీమిండియా ఓపెనర్**

# ఫుట్‌బాల్ ‘పద్మం’ మన బిడ్డే..



**సునీల్‌ఛెత్రిని వరించిన ‘పద్మశ్రీ’**

**హారిక సహా 9 మంది ప్లేయర్లకు ‘పద్మశ్రీ’ పురస్కారం**

వెలుగు క్రీడా విభాగం

సికింద్రాబాద్‌లో పుట్టి పెరిగి, ఇండియన్ ఫుట్‌బాల్ టీమ్‌కు నాయకత్వం వహిస్తోన్న స్టార్ ప్లేయర్ సునీల్ ఛెత్రీతో పాటు, తెలుగుతేజం, గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికను పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. క్రీడా రంగంలో విశిష్ఠ సేవలందించిన తొమ్మిది మందికి ఈ ఏడాదికి పద్మ పురస్కారాలు దక్కాయి. 70వ రిపబ్లిక్ డే నేపథ్యంలో భారత ప్రభుత్వం శుక్రవారం అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. వీరిలో ఒకరికి పద్మభూషణ్ దక్కగా, మరో ఎనిమిది మంది పద్మశ్రీ అందుకోనున్నారు. తెలంగాణ నుంచి ఇండియా ఫుట్‌బాల్ టీమ్‌లో స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రిని పద్మ శ్రీ వరించింది. ఇండియా తరఫున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా నిలిచిన ఛెత్రీ, జాతీయ జట్టు తరఫున అత్యధిక గోల్స్ చేసిన వారి జాబితాలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాడు. ఛెత్రీ కంటే ముందు రొనాల్డో ఉన్నాడు. 2011లో ఛెత్రీకి ప్రభుత్వం అర్జున అవార్డు ప్రకటించింది. భారత ఫుట్‌బాల్‌కు కొత్త రూపు తెచ్చిన ఛెత్రి 1984 ఆగస్టు 3న హైదరాబాద్‌లో పుట్టి పెరిగాడు. అందుకే తెలంగాణ నుంచి ఛెత్రికి ఈ సారి ఈ పురస్కారం దక్కింది. తండ్రి బి.కె. ఛెత్రి ఏఓసీలో ఉండేవాడు. ఆర్మీకి చెందిన ఈఎంఈలో తండ్రి బి.కె.ఛెత్రి ఆఫీసర్‌గా పనిచేస్తున్నప్పుడు ఇక్కడే పుట్టి నాలుగో తరగతి వరకూ చదువుకున్నాడు. ఫుట్‌బాల్‌లో ఓనమాలు నేర్చుకుంది కూడా ఇక్కడే.

- తెలుగుతేజం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 2012, 2015, 2017లో జరిగిన విమెన్స్ వరల్డ్ చెస్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకాలు గెలిచింది. 2007-08 సంవత్సరానికి అర్జున అవార్డుకు ఎంపికైంది.
- ఇటీవల అన్ని ఫార్మాట్‌ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్‌కి ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది. 2008లో అర్జున అవార్డు అందుకున్న గంభీర్ 2018 డిసెంబర్‌లో క్రికెట్ కెరీర్‌కు ముగింపు పలికాడు. 2003లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఈ ఢిల్లీ బ్యాట్స్‌మెన్ టీమిండియా టీ20 వరల్డ్‌కప్, వన్డే వరల్డ్‌కప్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.
- 2004 అర్జున అవార్డు గ్రహీత, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ శరత్ కమల్‌కు పద్మ శ్రీ దక్కింది. టేబుల్ టెన్నిస్‌లో ఇండియాకు ఎన్నో పతకాలు అందించిన శరత్ వరల్డ్ ర్యాంకింగ్‌లో ప్రస్తుతం 31వ స్థానంలో ఉన్నాడు.
- 2013 ఏసియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మణిపూర్‌కు చెందిన బొంబేల దేవికి పద్మ శ్రీ వరించింది. 2012 కామ్‌న్వెల్త్‌లో బంగారు, ఏషియన్ గేమ్స్‌లో కాంస్యం గెలిచి అదే ఏడాది అర్జున అందుకుంది.
- 2018 ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ 65 కిలోల విభాగం రెజ్లింగ్‌లో బంగారు పతకాలు సాధించిన ఇండియన్ స్టార్ రెజ్లర్ భజరంగ్ పునియాకు పద్మశ్రీ దక్కింది. హర్యానాకు చెందిన భజరంగ్ 2015లో అర్జున అవార్డు అందుకున్నాడు. 2018 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లోను సిల్వర్ మెడల్ గెలిచాడు.
- ఇండియన్ విమెన్స్ బాస్కెట్ బాల్ టీమ్‌స్టార్ ప్లేయర్ ప్రశాంతి సింగ్‌కు ప్రభుత్వం పద్మ శ్రీ ప్రకటించింది. 2009లో ఇండియాకు నాయకత్వం వహించిన ప్రశాంతి ఆ ఏడాది జరిగిన ఏసియన్ ఇండోర్ గేమ్స్‌లో మన జట్టుకు సిల్వర్ మెడల్ సాధించిపెట్టింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రశాంతి 2017లో అర్జున అవార్డు అందుకుంది.
- ఇండియా కబడ్డీ టీమ్ కెప్టెన్ అజయ్ ఠాకూర్‌కు పద్మశ్రీ దక్కింది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన అజయ్ 2016లో వరల్డ్‌కప్ గెలిచిన ఇండియా జట్టులో సభ్యుడు. ఆ టోర్నీలో అత్యధిక రైడ్ పాయింట్లు సాధించిన రైడర్‌గా కూడా నిలిచాడు. 2014 ఏసియన్ గేమ్స్‌లోను, 2017 ఆసియన్ కబడ్డీ చాంపియన్‌లో ఇండియా గోల్డ్‌మెడల్ గెలవడంలో అజయ్ పాత్ర కీలకం.



బచేంద్రీపాల్ | ద్రోణవల్లి హారిక | గౌతమ్ గంభీర్ | అజయ్ ఠాకూర్

ప్రశాంతిసింగ్ | బొంబేలదేవి | బజరంగ్ పునియా | శరత్‌కమల్

ప్రభాత వెలుగు తెలుగు దినపత్రిక క్రికెట్ టోర్నమెంట్

www.v6velugu.com v6velugu

# లోకల్ టాలెంట్‌కు గోల్డెన్ చాన్స్

**‘వెలుగు’ స్టేట్ లెవల్ టీ20 టోర్నమెంట్**

**నేటి నుంచే సెలెక్షన్లు షురూ**

**వెలుగు, హైదరాబాద్:** క్రికెట్‌పై ఆసక్తి ఉన్న కుర్రాళ్లను ప్రోత్సహించేందుకు ‘వెలుగు’ దినపత్రిక స్టేట్ లెవెల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి మినహా ఎనిమిది ఉమ్మడి జిల్లాల నుంచి 90 టీమ్స్ బరిలో నిలిచే ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభమవుతుంది. నియోజకవర్గాల వారీగా జట్లు ఎంపికకు శుక్రవారం నుంచి అన్ని జిల్లాలో సెలెక్షన్స్ జరుగుతాయి. 28 ఏళ్ల లోపు వయసున్న వారు పోటీలకు అర్హులు. సెలెక్షన్లకు వచ్చే వారు తమ ఆధార్ కార్డును వెంట తెచ్చుకోవాలి. మొదట ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తారు. ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో విజేతలకు ఫిబ్రవరి 23 నుంచి జరిగే క్వార్టర్స్‌కు (స్టేట్ లెవెల్)కు అర్హత సాధిస్తాయి. ఉమ్మడి జిల్లాలో గెలిచిన జట్టుకు రూ.50 వేలు, రన్నరప్ కు రూ.25 వేలు అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతకు లక్ష రూపాయలు, రన్నరప్‌కు రూ.50 వేలు అందుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనవరి 26 నుంచి, నిజామాబాద్ జిల్లాలో 27 నుంచి, మెదక్, నల్గొండ జిల్లాల్లో 29 నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో 31 నుంచి, ఖమ్మంలో ఫిబ్రవరి 5 నుంచి సెలెక్షన్లు ప్రారంభమవుతాయి. మరిన్ని వివరాలను వెలుగు పేపర్, వీ6 చానల్ ద్వారా తెలుసుకోవచ్చు.



# జొకో వచ్చేశాడు

**మెల్‌బోర్న్:** కెరీర్‌లో ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగిన వరల్డ్ నెంబర్‌వన్‌నోవాక్ జొకోవిచ్ (సెర్బియా) సునాయాసంగా ఫైనల్ చేరాడు. వరల్డ్ నెంబర్ 31 లూకస్ పౌలీ (ఫ్రాన్స్)తో శుక్రవారం జరిగిన సెమీఫైనల్‌లో జొకోవిచ్ 6-0, 6-2, 6-2 తో గెలిచాడు. మ్యాచ్ మొత్తం ఆధిపత్యం చూపించిన జొకోవిచ్.. 28వ సీడ్ పౌలీకి వరల్డ్ నెంబర్‌వన్ అంటే ఏమిటో చూపించాడు. ఈ మ్యాచ్‌లో 24 విన్నర్లు సంధించిన జొకో, కేవలం 5 అనవసర తప్పిదాలు చేశాడంటే ఏ రేంజ్‌లో ఆడాడో అర్థం చేసుకోవచ్చు. కెరీర్‌లో 14 గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన జొకోవిచ్ ఆదివారం జరిగే బిగ్‌ఫైట్‌లో స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్‌ను ఎదుర్కొనున్నాడు. 2012లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో తలపడ్డ జొకోవిచ్, నడాల్ ఐదు గంటల 53 నిమిషాల పాటు పోరాడారు. ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ విజయం సాధించగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ చరిత్రలోనే అది సుదీర్ఘ మ్యాచ్‌గా రికార్డులకెక్కింది. గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో జొకోవిచ్, నడాల్ ఇప్పటివరకు ఏడు సార్లు తలపడగా, నాలుగు విజయాలతో రఫా లీడ్‌లో ఉన్నాడు.

**సమంతా, జాంగ్‌దే డబుల్స్ కిరీటం..**

ఈ టోర్నీ మహిళల డబుల్స్ టైటిల్‌ను సమంతా స్టోసర్ (ఆస్ట్రేలియా)- షుయ్ జాంగ్ (చైనా) సొంతం చేసుకుంది. ఫైనల్‌లో సమంతా- జాంగ్ జంట 6-3, 6-4తో తిమియా బాబోస్ (హంగేరి)- క్రిస్టినా మ్లాడినోవిచ్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది.



# సెమీస్‌లో సైనా

**సింధు, శ్రీకాంత్ ఔట్**

**జకార్తా :** ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియన్ స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ సెమీఫైనల్ చేరింది. మరో స్టార్, ఒలింపిక్ మెడల్ విన్నర్ పీవీ సింధుతో పాటు కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్‌లోనే ఇంటి దారి పట్టారు. శుక్రవారం తొలుత జరిగిన మహిళల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌లో ఎనిమిదో సీడ్ సైనా 21-7, 21-18తో పోర్న్‌పావీ చోచువాంగ్ (థాయ్‌లాండ్)పై సునాయాసంగా విజయం సాధించింది. రెండుసార్లు కామ్‌న్వెల్త్ పతక విజేత అయిన సైనా శనివారం జరిగే సెమీఫైనల్‌లో వరల్డ్ నెంబర్ 7, హే బింగ్‌జియావో (చైనా)తో తలపడుతుంది. మరో క్వార్టర్స్‌లో సింధు 11-21, 12-21తో కరోలినా మరీన్ (స్పెయిన్) చేతిలో, శ్రీకాంత్ 18-21, 19-21 తేడాతో జోనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించారు. దీంతో ఈ టోర్నీలో ఒక సైనా మాత్రమే బరిలో నిలిచింది.



# వరల్డ్ ‘నెం. 1’ ఫైట్

**నేడు మహిళ సింగిల్స్ ఫైనల్స్**

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ‘వరల్డ్ నెంబర్‌వన్’ ఫైట్‌కు రంగం సిద్ధమైంది. జపాన్ సంచలనం నవోమి ఒసాక, చెక్ రిపబ్లిక్ యోధురాలు పెట్రా క్విటోవా ఫైనల్ ఫైట్‌కు రెడీ అయ్యారు. మెల్‌బోర్న్ పార్క్‌లో శనివారం జరిగే మహిళల సింగిల్స్ ఫైనల్‌లో గెలిచిన ప్లేయర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో పాటు వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకును సొంతం చేసుకోనుంది. ప్రస్తుతం వరల్డ్ నెంబర్‌వన్ సిమోనా హలెప్ ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి నాలుగో రౌండ్‌లోనే ఇంటి దారి పట్టడంతో ఒసాక, క్విటోవాకు ఈ చాన్స్ దొరికింది. 21 ఏళ్ల ఒసాకను తక్కువ అంచనా వేస్తే మొదటికే మోసం వస్తుందన్న విషయాన్ని క్విటోవా గుర్తించింది. మరోపక్క మూడు సెట్లు మ్యాచులు మూడు ఆడి ఫైనల్ చేరిన ఒసాక ఈ టోర్నీలో తనకు ఎదురైన కొందరు ప్రత్యర్థులను సరిగ్గా అంచనా వేయలేకపోయింది.

# రంజీ ఫైనల్లో విదర్భ

**కేరళపై ఇన్నింగ్స్ విజయం**

**ఉమేశ్ యాదవ్‌కు 12 వికెట్లు**

వేనాడ్: టీమిండియా బౌలర్ ఉమేశ్ యాదవ్ (12/79) అద్భుత ప్రతిభతో డిఫెండింగ్ చాంపియన్ విదర్భ మరో సారి రంజీ ట్రోఫీ ఫైనల్లో అడుగుపెట్టింది. కేరళతో జరిగిన సెమీస్‌లో విదర్భ ఇన్నింగ్స్ 11 రన్స్ తేడాతో విజయాన్నందుకుంది. రంజీ చరిత్రలో తొలిసారి సెమీస్ దాకా వచ్చిన కేరళ ఉమేశ్ దెబ్బకు అల్లాడిపోయింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 106 రన్స్‌కే ఆలౌట్ అయిన కేరళ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 91 రన్స్‌కే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఉమేశ్‌యాదవ్ ఐదు వికెట్లు పడగొడితే...ఠాకూర్ 28 రన్స్‌కు నాలుగు వికెట్లు పడగొట్టాడు.

## సౌరాష్ట్రకు చిక్కులు

**బెంగళూరు:** కర్ణాటకతో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీస్‌లో సౌరాష్ట్ర ఇక్కట్లలో ఉంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కర్ణాటకను 275 రన్స్‌కే ఆలౌట్ చేసిన సౌరాష్ట్ర రెండో రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు నష్టపోయి 227 రన్స్ చేసింది. సౌరాష్ట్ర వికెట్ కీపర్ పటేల్ అత్యధికంగా 85 రన్స్ చేయగా, పుజారా 45, జాక్సన్ 46 రన్స్‌తో రాణించారు. కర్ణాటక బౌలర్ గజానన్ మోరె 54 రన్స్‌కు ఐదు వికెట్లు పడగొట్టాడు

# విహారి వీరవిహారం

**తిరువనంతపురం:** ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ప్లేయర్, హైదరాబాద్ స్టార్ విహారి (92: 83 బంతుల్లో 8x4, 4x6), రహానె (91: 117 బంతుల్లో 4x4, 4x 6), అయ్యర్ ( 65: 47 బంతుల్లో 5x4, 2x6) ) వీరవిహారం చేయడంతో ఇండియా ఏ జట్టు 138 రన్స్ తేడాతో విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి భారత్ ఎ జట్టు 303 పరుగులు చేసింది. ఓపెనర్ అన్‌మోల్‌ప్రీత్ సింగ్ నిరాశపరచడంతో 14 రన్స్‌కే తొలి వికెట్ నష్టపోయినా విహారి - రహానెలు రెండో వికెట్‌కు 181 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. ఆ తర్వాత భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ లయన్స్ జట్టు 37.4 ఓవర్లలోనే 165 పరుగులకి కుప్పకూలిపోయింది. మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన హనుమ విహారికి ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది.





# అందుకే రాత్రి ప్రయోగం

**చెన్నై:** గురువారం.. రాత్రి 11.37 నిమిషాలు.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్వీ సీ44 రివ్వున నింగిలోకి దూసుకెళ్లి మైక్రోశాట్ ఆర్, కలాంశాట్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యల్లో విజయవంతంగా వదిలి పెట్టింది. మరి, పొద్దున పూట కాకుండా దాదాపు అర్ధ రాత్రి సమయంలో ఇస్రో ఆ ప్రయోగాన్ని ఎందుకు చేపట్టిందో డౌట్ వచ్చిందా? బహుశా వచ్చి ఉండదేమో. ప్రయోగాన్ని రాత్రి చేయడం వెనకా ఓ కారణముంది. ఆ కారణమేంటో ఇస్రో చైర్మన్ కే శివన్ వివరించారు. ఉపగ్రహాన్ని బట్టి ప్రయోగం టైంను నిర్ణయిస్తామన్నారు. మైక్రోశాట్ ఆర్ ఉప్రగహం విషయంలో అదే జరిగిందన్నారు. ‘‘మధ్యాహ్నం టైంలో భూమధ్యరేఖ మీదుగా దక్షిణం నుంచి ఉత్తరానికి ఉపగ్రహాన్ని పంపాలని డీఆర్డీవో చెప్పింది. కానీ, మా రాకెట్ భూమధ్యరేఖకు ఉత్తరం నుంచి దక్షిణానికి వెళుతుంది. అందుకే అవసరాన్ని బట్టి రాత్రి టైంలో ప్రయోగం చేశాం’’ అని శివన్ తెలిపారు. ఉపగ్రహం ఏ టైంలో భూమికి సంబంధించిన ఫొటోలు తీయాలన్నదానిపై ఉపగ్రహం తయారీదారులే నిర్ణయిస్తారని, ఎక్కువ వెలుతురు, తక్కువ మబ్బులు ఉన్నప్పుడు ఉపగ్రహం భూమిని స్పష్టంగా చిత్రాలు తీసే వీలుంటుందన్నారు. అందుకు ఉపగ్రహంలోని సోలార్ పానెళ్లకు సూర్యుడి వెలుతురు తగిలే కోణం చాలా ముఖ్యమన్నారు. కాబట్టి డీ ఆర్డీవో నిర్ణయించిన కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపేందుకు రాత్రిపూటే కరెక్ట్ అని నిర్ణయించి ప్రయోగం చేశామన్నారు. ఉపగ్రహ అవసరాలను అందుకోవడం తొలి లక్ష్యమైనా.. వేరే కారణాలూ రాత్రిపూట ప్రయోగానికి కారణమయ్యాయని ఇస్రో అధికారులు తెలిపారు. ‘‘రాకెట్ రకం, దాని గమ్యం, ఉపగ్రహ ఇంధనాన్ని వాడుకోకుండా రాకెట్ ఇంధనాన్నే తక్కువగా వాడుకుంటూ నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపడం వంటివి ప్రయోగ టైంను నిర్దేశిస్తాయి’’ అని ఓ ఇస్రో అధికారి చెప్పారు. జీఎస్ఎల్వీ ప్రయోగాలనూ ఎక్కువగా రాత్రిపూటే చేస్తారు. జియోస్టేషనరీ ఉపగ్రహాలను 35 వేల కిలమీటర్ల ఎత్తులో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కాబట్టి వాటికి నేరుగా సూర్యుడి కాంతి తగలాలంటే సాయంత్రం లేదా రాత్రిపూటే బెస్ట్ టైం అని సైంటిస్టులు చెప్పారు. మైక్రోశాట్ ఆర్ ఉపగ్రహాన్ని మిలటరీ అవసరాల కోసం రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) తయారు చేసిన సంగతి తెలిసిందే. భూమికి 274 కిలోమీటర్ల ఎత్తులో అది సేవలు అందిస్తుంది.





# అమ్మకు ఎన్ని పనులో?

ఇల్లు చక్కబెట్టాలి. పిల్లల ఆలనాపాలనా చూడాలి. భర్తకు సపర్యలు చేయాలి. ఆఫీసుకెళ్లి ఉద్యోగ బాధ్యతలు పూర్తి చేయాలి. ఒక అమ్మకు (ఉద్యోగం చేసేవారికి) రోజూ ఎదురయ్యే సవాళ్లే ఇవి. ఆ పనుల్లో పడితే వారికి టైం ఎక్కడ దొరుకుతుంది? అందుకే ఒక్కోసారి మల్టీ టాస్కింగ్ (ఒకేసారి చాలా పనులు చేయడం) చేయాల్సి రావొచ్చు. ఇదిగో ఈ ఫొటోలో అమ్మను చూడండి.. ఒక భుజంపై బుడ్డోణ్ని నిద్రపుచ్చడం ఓవైపు. ఇంకో వైపు ఫోన్లో క్లయింట్‌తో చర్చలు. ఇంకో పక్క ఫైల్స్‌లో రాతలు. ఒకేసారి మూడు పనులు చేసేస్తోంది. ఆమెను గమనించిన కంపెనీ ఓనర్ ఫొటో తీసి ఫేస్‌బుక్‌లో షేర్ చేసే సరికి.. వర్కింగ్ మదర్స్ గుండెలను తాకిందీ ఫొటో. ఆ ఫొటోను షేర్ల మీద షేర్లు చేయడంతో వైరల్ అయింది. ఆ ఫొటోలో ఉన్నామె పేరు మెలొడీ బ్లాక్‌వెల్. వయసు 27 ఏళ్లు. ఎంచక్కా నిద్రపోతున్న ఆ బుడతడి పేరు నోరా జో. అమెరికాలోని టెన్నెసీలోగల మేరీలాండ్ ఫార్మ్స్ షిరోప్రాక్టిక్ కంపెనీలో ఉద్యోగి. ఆమె ఒక్కతే కాదు.. ఆ కంపెనీలో పనిచేసే మహిళలంతా తమ పిల్లలను ఆఫీసుకు తీసుకొచ్చి లాలించే వెసులుబాటు కల్పించింది ఆ కంపెనీ ఓనర్ డాక్టర్ ఎలిజబెత్ బేకర్. ఇంతకీ షిరోప్రాక్టీస్ అంటే.. ఓ వ్యక్తి రోగాన్ని గుర్తించాక మందులను రాసిచ్చే ఉద్యోగమన్నమాట. సింపుల్‌గా చెప్పాలంటే ఓ ఫార్మాసిస్ట్.

■ పిల్లల్లో వస్తున్న నరాల సంబంధిత వ్యాధుల్లో 55 శాతం మేర పేగుల్లోని వైరస్ (ఎంటరోవైరస్) వల్లే వస్తున్నాయని ముంబైలోని ఐజెనిటిక్ డయాగ్నస్టిక్స్ అనే సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది. చాలా రకాల రోగాలకు కారణం అవే అయినా, దాని వల్ల వచ్చే సెంట్రల్ నర్వస్ సిస్టం (సీఎన్ఎస్) రోగాలు మరింత తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. సీఎన్ఎస్‌సమస్యలతో బాధపడుతున్న 49 మంది పిల్లల సెరిబ్రోస్పైనల్ ఫ్లుయిడ్‌ను సేకరించి సంస్థ అధ్యయనం చేసింది.





Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.